ఆంధ్రజ్యోతి ANDHRAJYOTHY
ప్రకాశం 3
సోమవారం 19, ఆగస్టు 2024

టీడీపీ కూటమి ప్రభుత్వం రాకతో కదలిక

రాష్ట్రంలో ఇటీవల ఏర్పడిన టీడీపీ కూటమి ప్రభుత్వం మౌలిక రంగాల అభివృద్ధి, అందులోనూ కేంద్రం సహకారంతో చేపట్టే రోడ్డు, రైలు, వాయు, జల రవాణాపై ప్రత్యేక దృష్టి సారించింది. పాత ప్రతిపాదనల ఫైళ్లు దుమ్ము దులిపి తిరిగి కేంద్రం వద్ద చర్చకు పెడుతోంది. ఈ క్రమంలో ఒంగోలు ఎయిర్ పోర్టు అంశం తిరిగి తెరపైకి వచ్చింది. పది రోజుల క్రితం పార్లమెంట్‌లో విమానాశ్రయాల విస్తరణపై జరిగిన చర్చలో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఒంగోలు ఎయిర్‌పోర్టు అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. గతంలో ఉన్న ప్రతిపాదనలు, మినీ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అనువుగా భూముల గుర్తింపు తదితరాలను వివరించి 60శాతం కేంద్రం, 40శాతం రాష్ట్ర నిధులతో నిర్మించాలని కోరారు. దీంతో కదలిక వచ్చింది.



ఒంగోలులో విమానాశ్రయం ఏర్పాటు అంశం మరోసారి తెరపైకి వచ్చింది. రాష్ట్రంలో ఎయిర్‌పోర్టుల అభివృద్ధిపై కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తాజాగా చేసిన ప్రకటనతో దానిపై మళ్లీ చర్చ మొదలైంది. రెండు దశాబ్దాల క్రితమే ఒంగోలులో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు బీజం పడింది. అప్పట్లో కొత్తపట్నం మండలం అల్లూరు, ఆలూరు వద్ద భూములను కూడా గుర్తించారు. అనంతరం అది మరుగునపడింది. ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ఢిల్లీ పర్యటన సందర్భంగా వివిధ అంశాలపై కేంద్రంతో చర్చించారు. అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఏడు విమానాశ్రయాలను 14కు పెంచనున్నట్లు ప్రకటించారు. అందులో ఒంగోలు కూడా ఉంది.

ఒంగోలు ఎయిర్ పోర్టు మళ్లీ తెరపైకి

- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రకటనతో విస్తృత చర్చ
- పదిరోజుల క్రితం పార్లమెంట్‌లో మాట్లాడిన ఎంపీ మాగుంట
- కొద్ది రోజులకే ప్రతిపాదన
- 20 ఏళ్లనాడే భూముల గుర్తింపు
- అనంతరం మరుగునపడిన వైనం
- సీఎం చంద్రబాబు జోక్యంతో కదలిక



ఒంగోలు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై 20 ఏళ్ల క్రితమే పరిశీలన జరిగింది. అప్పట్లో అది ప్రతిపాదనలకే పరిమితమై అనంతరం కొద్దిరోజులకే మరుగునపడింది. ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వ చొరవతో మళ్లీ తెరపైకి వచ్చింది. ఉమ్మడి రాష్ట్రంలో 2004–07 మధ్య ఉన్న నాటి కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో విమానాశ్రయాల విస్తరణపై ప్రకటన చేసింది. ఆ సమయంలో ఒంగోలుకు ఎయిర్‌పోర్టు ప్రకటించింది. ఆవెంటనే ఒంగోలు సమీపంలోని కొత్తపట్నం మండలం అల్లూరు, ఆలూరు ప్రాంతాల్లో భూములను పరిశీలించారు. సుమారు 650 ఎకరాలు అవసరమని తేల్చారు. ఆమేరకు భూములను కూడా గుర్తించారు. ఒంగోలు చిన్న పట్టణమే అయినప్పటికీ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ గ్రానైట్, విస్తారంగా తీరప్రాంతం ఉండి భారీగా ఆక్వా సాగు, దేశంలోనే అత్యధికంగా పొగాకు పంట వంటి వ్యాపార సంబంధ అంశాలతోపాటు అప్పట్లో వాన్‌పిక్ ప్రతిపాదన తదితర సానుకూల అంశాలను చూపి ఎయిర్‌పోర్టు ప్రతిపాదన చేశారు. కేంద్ర విమానయానశాఖకు చెందిన అధికారులు పరిశీలన కూడా అప్పట్లోనే పూర్తయ్యింది. భూ సంబంధ వివాదాలు, ఇతరత్రా కారణాలతో ఆ అంశం ప్రతిపాదనలకే పరిమితమైంది.

ఒంగోలు ఎయిర్‌పోర్టుపై అధ్యయనం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం ఢిల్లీ పర్యటన సందర్భంగా రాష్ట్రానికి చెందిన పలు కీలక రంగాలపై కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. అందులో ప్రస్తుతం ఉన్న విమానాశ్రయాల అభివృద్ధి, కొత్తవి ఏర్పాటు వ్యవహారంపై సంబంధిత మంత్రి రామ్మోహన్‌నాయుడుతో కూడా సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఏడు విమానాశ్రయాలను 14కు పెంచనున్నట్లు ప్రకటించారు. అందులో ఒంగోలు కూడా ఉంది. ఒంగోలులో ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై అధ్యయనం చేయనున్నట్లు ప్రకటించారు. దీంతో మరోసారి ఈ అంశం తెరపైకి వచ్చింది. వివిధ వర్గాల ప్రజల్లో దీనిపై విస్తృత చర్చ సాగుతోంది. గతంలోనే భూముల గుర్తింపు కూడా జరిగిన నేపథ్యంలో పాలకపక్ష నేతలు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

గతంలో ప్రతిపాదించి పక్కనపెట్టిన వైనం

ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దలు 2009-14మధ్య నాటి నెల్లూరు జిల్లాలో దగదర్తి వద్ద ఎయిర్ పోర్టు, దుగరాజపట్నం వద్ద పోర్టు.. అలాగే ప్రకాశం జిల్లాలో రామాయపట్నం వద్ద పోర్టు, ఒంగోలు వద్ద ఎయిర్ పోర్టు ప్రతిపాదనలను పరిశీలన చేసి ఒకే జిల్లాలో అటు పోర్టు, ఇటు ఎయిర్‌పోర్టు రెండూ నిర్మాణం సాధ్యం కాదన్న అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. నెల్లూరు జిల్లాలో ఎయిర్ పోర్టు, ప్రకాశం జిల్లాలో పోర్టు నిర్మించాలని అనధికారికంగా ఒక అవగాహనకు వచ్చినట్లు అప్పట్లో విస్తృత ప్రచారం జరిగింది. ఆ నేపథ్యంలో ఒంగోలు ఎయిర్‌పోర్టు మరుగునపడి నెల్లూరు జిల్లా దగదర్తి ఎయిర్‌పోర్టు ముందుకు కదిలింది. దీంతో ఒంగోలు ఎయిర్‌పోర్టు లేనట్లేనన్న భావన అందరిలోనూ వ్యక్తమైంది. ఆ తర్వాత దొనకొండలోని పురాతన విమానాశ్రయ పునరుద్ధరణ చర్యలు, కదలికతో ఇక ఒంగోలు విమానాశ్రయంపై ప్రజలు ఆశలు వదిలేసుకున్నారు.





నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు

కొనసాగిన జూడాల నిరసన

రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 18 : కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని నిరసిస్తూ ఒంగోలు జీజీహెచ్‌లోని జూడాలు చేపట్టిన ఆందోళన మూడోరోజూ కొనసాగింది. ఆదివారం వారు విధులు బహిష్కరించారు. ఆసుపత్రి ఆవరణలో 'రియల్ మెన్.. డోంట్ రేప్' పేరుతో రోడ్డుపై చిత్రాలను గీచి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జూడాలు మాట్లాడుతూ ఈనెల 9న పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచారానికి గురైతే అక్కడి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య రంగ రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.అజయ్‌కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షురాలు బొగ్గు శృతి, ప్రధాన కార్యదర్శులు చైతన్యసాయి, విష్ణుప్రియ, జాయింట్ సెక్రటరీలు అవినాష్ కుమార్, ఎం.సాయిపవిత్ర, ఇతర జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నుంచి 24 గంటలపాటు ఓపీ, వైద్య సేవలను నిలిపివేసిన ప్రైవేటు వైద్యులు ఆదివారం పునరుద్ధరించారు.

21 మంది ఎస్సైల బదిలీ

వీఆర్‌కు పది మంది



ఒంగోలు (క్రైం), ఆగస్టు 18 : జిల్లాలో భారీగా ఎస్సైలను బదిలీ చేశారు. 21 మందికి స్థానచలనం కల్పించారు. ఈమేరకు ఎస్పీ దామోదర్ ఉత్తర్వులు ఇచ్చారు. 10 మందిని వీఆర్‌కు పిలిచారు.

బదిలీ అయిన ఎస్సైల వివరాలు

ఎస్సై పేరు	పనిచేస్తున్న స్థానం	బదిలీ అయిన స్థానం
కె.విజయకుమార్	తాళ్లూరు	దొనకొండ
సాంబశివరాజు	మర్రిపూడి	త్రిపురాంతకం
ఎం.సైదాబాబు	పామూరు	మార్కాపురం టౌన్
పి.అంకమ్మరావు	దోర్నాల	మార్కాపురం రూరల్
టి.రమేష్ బాబు	పీసీపల్లి	మర్రిపూడి
ఎం.మురళి	అటాచ్‌డ్ దర్శి	దర్శి
వై.నాగరాజు	పీటీసీ ఒంగోలు	ముండ్లమూరు
నాగమల్లేశ్వరరావు	దిశ పోలీస్‌స్టేషన్	టంగుటూరు
వి.సుధాకర్	తర్లుపాడు	కొత్తపట్నం
వి.వేమన	వీఆర్	పొదిలి
బి.మహేంద్ర	అటాచ్‌డ్ పుల్లలచెరువు	సింగరాయకొండ
యు.పున్నారావు	టంగుటూరు	జరుగుమల్లి
ఎస్.మల్లికార్జునరావు	వీఆర్	తాళ్లూరు
బి.శివరామయ్య	వీఆర్	మద్దిపాడు
బి.నరసింహారావు	బేస్తవారపేట	కంభం
పి.అనిల్‌కుమార్	వీఆర్	పెద్దారవీడు
పి.చౌడయ్య	నెల్లూరు జిల్లా	ఎర్రగొండపాలెం
జి.గిరిబాబు	గుంటూరు జిల్లా	పొన్నలూరు
ఎస్.సుమన్	పల్నాడు జిల్లా	కొండపి
ఎస్.వి.రవీంద్ర రెడ్డి	బాపట్ల జిల్లా	బేస్తవారపేట
పి.కోటేశ్వరరావు	బాపట్ల జిల్లా	రాచర్ల

వీఆర్‌కు పిలిచిన ఎస్సైలు వీరే..

జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌లలో పనిచేస్తున్న 10 మంది ఎస్సైలను వీఆర్‌కు పిలిచారు. వారి స్థానాల్లో ఇతరప్రాంతాల్లో పనిచేస్తున్న వారికి పోస్టింగ్‌లు ఇచ్చారు. వీఆర్‌కు పిలిచిన వారిలో సింగరాయకొండలో పనిచేస్తున్న టి.శ్రీరాం, మద్దిపాడు ఎస్సై వి.మహేష్, ముండ్లమూరులో పనిచేస్తున్న వి.ఆంజనేయులు, త్రిపురాంతకం నుంచి వి.సాంబశివయ్య, పెద్దారవీడు నుంచి జి.వెంకటసైదులు, కొత్తపట్నం ఎస్సై బి.సాంబశివరావు, మార్కాపురం టౌన్ ఎస్సై అబ్దుల్‌రెహమాన్, కొండపిలో పనిచేస్తున్న ఎం.కృష్ణబాజీబాబు, దొనకొండ ఎస్సై ఎల్.సంపత్‌కుమార్, కంభం ఎస్సై పి.రాజేష్ ఉన్నారు. వీరంతా జిల్లా పోలీసు కార్యాలయంలో రిపోర్టు చేయాలని తన ఉత్తర్వుల్లో ఎస్పీ పేర్కొన్నారు.



తెరాతేజీకి హాజరైన ముస్లింలతో కళకళలాడుతున్న కంభం చెరువు కట్ట

వైభవంగా తేరాతేజీ

- అధిక సంఖ్యలో తరలివచ్చిన ముస్లింలు
- కంభం చెరువు వద్ద సందడి



పెళ్లినాటి దండలను చెరువులో వదులుతున్న నూతన వధువు

కంభం, ఆగస్టు 18 : జిల్లాలోని చారిత్రాత్మక కంభం చెరువుపై ముస్లింలు తేరాతేజీ (గరిక తొక్కుడు) ఉత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ముస్లింలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కంభం చెరువులో నీరు ఉంటే ఈ పండుగ చేసుకుంటారు. ప్రస్తుతం కంభం చెరువులో మూడు అడుగుల మేర నీరు ఉంది. తేరాతేజీ మాసంలో కొత్తగా పెళ్లైన దంపతులు 13 రోజులపాటు దూరంగా ఉంటారు. పుట్టింటికి చేరే వరకు నూతన వధువుకు వరుడి ముఖం కూడా చూపరు. 13వ రోజు ఆహ్లాదాన్ని కలిగించే కంభం చెరువుకు రావడం ఆనవాయితీగా వస్తోంది. బంధువులంతా కలిసి అక్కడే వంటలు వండుకొని భోజనాలు చేసి ఆనందంగా గడుపుతారు. దీన్నావలి దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. పెళ్లినాటి దండలు, పూలు, ఇతరాలను కంభం చెరువులో వదిలారు. ఆదివారం జరిగిన ఉత్సవానికి విజయవాడ, హైదరాబాద్, గుంటూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి పెద్దత్తున భక్తులు తరలివచ్చారు. ఏటా వేలాది మంది భక్తులు వస్తారని తెలిసినా అధికారులు అక్కడ ఎటువంటి సౌకర్యాలు కల్పించలేదు. పోలీసు సిబ్బంది తగినంత మంది లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య పెరిగింది. దీంతో భక్తులు ఇబ్బంది పడ్డారు.

పాఠశాల విద్యార్థుల పరీక్షల షెడ్యూల్ విడుదల

ఎఫ్‌ఏ-1 పేరు మార్పు

ఈనెల 27 నుంచి ప్రారంభం

ఒంగోలు (విద్య), ఆగస్టు 18 : ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లో 1నుంచి పదో తరగతి వరకూ చదువుతున్న విద్యార్థుల పరీక్షల షెడ్యూల్‌ను విద్యా శిక్షణ మండలి పరిశోధనా సంస్థ (ఎస్సీఈఆర్టీ) డైరెక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి విడుదల చేశారు. ఫార్మెటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్‌ఏ-1) పేరు సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్-1గా మార్చారు. పరీక్షలు ఈనెల 27నుంచి ప్రారంభమవుతాయి. వచ్చేనెల 4 వరకూ నిర్వహిస్తారు. గతేడాది వరకూ ఈ పరీక్షలను రోజుకు రెండు చొప్పున ఉదయం, మధ్యాహ్నం నిర్వహించేవారు. అయితే ప్రస్తుతం రోజుకు ఒకటి చొప్పున ఏడు రోజులు ఉంటాయి.

- ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈనెల 27నుంచి సెప్టెంబరు 2 వరకూ ఉదయం 10.45 నుంచి 11.45 వరకు పరీక్షలు నిర్వహిస్తారు.
- ఈనెల 27న 3,4,5తరగతులకు ఓఎస్ఎస్‌సీ పరీక్ష ఉంటుంది.
- 1నుంచి 5 తరగతులకు 28న తెలుగు, 30న ఇంగ్లీషు, 31న గణితం, సెప్టెంబరు 2న పరిసరాల విజ్ఞానం పరీక్ష నిర్వహిస్తారు.
- ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని 6,7,8 తరగతుల విద్యార్థులకు 27వతేదీ మధ్యాహ్నం 1.10నుంచి మధ్యాహ్నం 2.10వరకు ఓఎస్ఎస్‌సీ పరీక్ష జరుగుతుంది. 28న తెలుగు, 30న హిందీ, 31న ఇంగ్లీషు, సెప్టెంబరు 2న గణితం, 3న జనరల్ సైన్స్, 4న సోషల్ పరీక్షలు ఉంటాయి. ఇవన్నీ మధ్యాహ్నం 1.30నుంచి 2.30 వరకూ జరుగుతాయి.
- హైస్కూళ్లలో 9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు 27వతేదీ ఉదయం 10నుంచి 11.15 గంటల వరకు ఓఎస్ఎస్‌సీ పేపర్-1, 11.15నుంచి 12.15 గంటల వరకు జీఎస్ఎన్‌సీ పేపర్-2, 28న తెలుగు, 30న హిందీ, 31న ఇంగ్లీషు, సెప్టెంబరు 2న గణితం, 3న జనరల్ సైన్స్, 4న సోషల్ పరీక్షలు జరుగుతాయని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. ప్రశ్నపత్రాలను ప్రభుత్వమే జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు(డీసీఈబీ) ద్వారా పాఠశాలలకు పంపుతుంది.



సర్దుబాటుకు సర్వం సిద్ధం

ఎంఈవోల లాగిన్‌కు సవరణ జాబితాలు

టీచర్లకు నేడు మండలాల్లో కౌన్సెలింగ్

ఒంగోలు (విద్య), ఆగస్టు 18 : జిల్లాలో ఉపాధ్యాయుల పని సర్దుబాటుకు సర్వం సిద్ధమైంది. మండల విద్యాధికారుల లాగిన్‌కు సవరించిన మిగులు టీచర్ల సీనియారిటీ జాబితాలు వచ్చాయి. వాటి ఆధారంగా సర్దుబాటుకు అన్ని ఏర్పాట్లు ఆదివారం రాత్రికే పూర్తి చేశారు. సోమవారం మండల స్థాయిలో మిగులు టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈమేరకు మొదట ప్రకటించిన మిగులు టీచర్ల జాబితాపై అభ్యంతరాలు వెల్లువెత్తడంతో సవరణకు అవకాశం కల్పించింది. పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి వారి సలహాలు, సూచనలు స్వీకరించారు. కొన్నింటికి ఆయన ఆమోదం తెలిపారు.


794 మంది టీచర్లు మిగులు

జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో ఈనెల 16నాటికి నమోదైన యుడైస్‌లోని విద్యార్థుల సంఖ్య ప్రామాణికంగా 794 మంది టీచర్లు మిగులుగా ఉన్నట్లు గుర్తించారు. వారిలో అత్యధికంగా 500 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు ఉన్నారు. స్కూలు అసిస్టెంట్ తెలుగు 55 మంది, హిందీ 42 మంది, సోషల్ స్టడీస్ 27 మంది, బయోలాజికల్ సైన్స్ 23 మంది, ఉర్దూ 8 మంది, ఇంగ్లీషు 19మంది, పీఎస్ 32మంది తేలారు. మినిమం టైం స్కేలుతో కాంట్రాక్టు టీచర్లుగా పనిచేస్తున్న 43 మంది, ఎల్‌పీ తెలుగు, హిందీ ఒక్కొక్కరు, ఎస్‌జీటీ ఉర్దూ 16మంది మిగులుగా ఉన్నారు. మొదట ప్రకటించిన మిగులు జాబితాలో 906 మంది టీచర్లు ఉండగా సవరించిన జాబితాలో 112 మంది తగ్గారు. చివరకు మార్కాపురం మండలంలో గరిష్ఠంగా 71 మంది, అర్థవీడులో 9 మంది, బేస్తవారపేటలో ఆరుగురు, సీఎస్‌పురంలో 16 మంది, చీమకుర్తిలో 29 మంది, కంభంలో 26, దర్శిలో 45, దొనకొండ 15, గిద్దలూరులో 31, హనుమంతునిపాడులో 16, కనిగిరిలో 38 మంది టీచర్లు మిగులు ఉన్నారు. కొమరోలు మండలంలో 47 మంది, కొనకనమిట్లలో 28, కొండపిలో 11, కొత్తపట్నంలో 21 మంది, కురిచేడులో 20 మంది, మద్దిపాడులో 20, మర్రిపూడిలో 15, ముండ్లమూరులో 22, ఎన్‌జీపాడులో 12, ఒంగోలులో 48, పీసీపల్లిలో 17, పెదదోర్నాలలో 7, పామూరులో 9, పెద్దారవీడులో 23 మంది మిగులుగా తేలారు. పొదిలి మండలంలో 23 మంది, పొన్నలూరులో 22, పుల్లలచెరువులో 12, రాచర్లలో 23, సంతనూతలపాడులో 29, సింగరాయకొండలో 16, త్రిపురాంతకంలో 22, తాళ్లూరులో 17, టంగుటూరులో 12, తర్లుపాడులో 18, వెలిగండ్లలో 7, ఎర్రగొండపాలెంలో 22, జరుగుమల్లి మండలంలో ఎనిమిది మంది మిగులుగా టీచర్లు ఉన్నారు.

సీనియారిటీలపై 29 అభ్యంతరాలు

సీనియారిటీ జాబితాపై జిల్లాలోని టీచర్ల నుంచి 29 అభ్యంతరాలు రాగా వీటన్నింటినీ కమిషనర్ కార్యాలయానికి పంపించారు. సవరించిన సీనియారిటీ జాబితా ప్రస్తుతం ఎంఈవో లాగిన్‌కు వచ్చింది. వీటిపైన ఏమైనా అభ్యంతరాలు ఉంటే పాఠశాల విద్య కమిషనర్ కార్యాలయంలోని ఐటీ బృందం దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుతం ఎంఈవో లాగిన్‌కు వచ్చిన సవరించిన సీనియారిటీ జాబితాలపై ఎటువంటి అభ్యంతరాలు లేకపోతే ఈరాత్రికే అన్ని ఏర్పాట్లు చేసుకొని సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించి టీచర్ల సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేయమన్నారు. సర్దుబాటుకు సంబంధించిన సూచనలను విధిగా పాటించాలని, ఏమైనా సమస్యలు ఉంటే వర్క్ అడ్జస్ట్‌మెంట్ గ్రూపులో పోస్టు చేయాలని కోరారు. తాజా సూచనల ప్రకారం మండల స్థాయికే పనిసర్దుబాటు పరిమితమ్యేలా ఉంది. డివిజన్ స్థాయిలో సర్దుబాటు అనుమానంగా కన్పిస్తోంది.





ఆలయ భూములకు రక్షణ కరువు

పామూరులో రూ.వంద కోట్లకుపైగా ఆస్తుల ఆక్రమణ

లోపలి పేజీల్లో..

'రక్షా'నుబంధం!

సోదరీసోదరుల ప్రేమకు ప్రతిరూపం ● తరాలుమారినా తరగని సంప్రదాయం ● నేడు రాఖీపౌర్ణమి



ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 18: హిందూ సంప్రదాయ పండుగల్లో ప్రకృతి శక్తులు, దేవతల అనుగ్రహం, ఆధ్యాత్మిక దృక్పథంతో పాటు ఆత్మీయానురాగాలకు ఎంతో పెద్దపీట వేశారు. వీటన్నింటి కలయికతో శ్రావణమాసంలో వచ్చేటువంటి పౌర్ణమి రోజును తరతమ భేదం లేకుండా ప్రతి ఒక్కరూ ఎంతో ఆనందంగా, ఆత్మీయంగా జరుపుకునే పండుగ రాఖీపౌర్ణమి. దీన్నే 'రక్షాబంధన్' అని కూడా పిలుస్తుంటాం. అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ పండుగ. సోదరుల చేతికి రాఖీ కట్టి, వారు చేపట్టే ప్రతి పని విజయవంతం కావాలని సోదరి ఆశిస్తుంది. అదేవిధంగా తన విజయాన్ని కాంక్షింకే సోదరికి తాను అన్ని వేళలా రక్షగా నిలుస్తానని సోదరుడు తన ప్రేమను చాటుకుంటూ జరుపుకునే ప్రేమానుబంధాల ముడి ఈ రాఖీలో ఉంది. ఇక అన్నదమ్ములు లేనివారు కూడా తాము సోదరులుగా భావించే వ్యక్తులకు రాఖీని కడతారు. అన్నయ్య కలలు పండాలన్నా.. చెల్లాయి మనసు నిండాలన్నా అది స్వచ్ఛమైన ప్రేమతో కూడిన 'రక్షాబంధన్'కే సాధ్యం. ఆడపిల్లకు తండ్రి తర్వాత అంతటి రక్షణగా నిలిచే వ్యక్తి సోదరుడు. అందుకే తన సోదరుడు ఉన్నతస్థితిలో ఉండాలని ప్రతి సోదరి ఆకాంక్షిస్తుంది. తండ్రి ఉన్నా లేకపోయినా పుట్టినింటి ప్రేమను పంచే వ్యక్తి సోదరుడు. కనుక ఆ సోదరుడి క్షేమాన్ని, ఉన్నతిని కోరుకుంటూ సోదరుని చేతికి రక్షను సోదరి కడితే, ఆ రక్ష కట్టిన సోదరికి జీవితాంతం రక్షణగా నిలుస్తానని, తన సోదరి జీవితం తియ్యగా సాగిపోవాలని ప్రేమతో మిఠాయి తినిపిస్తాడు సోదరుడు. ఈ అద్భుత అనురాగ ఘట్టానికి సాక్షీభూతంగా నిలిచేదే రాఖీపండుగ.

దేవతలకు రక్షాబంధన్

రక్షాబంధన్‌గా పిలుచుకునే రాఖీపండుగ ఈనాటి కాదు. ఇది యుగయుగాలుగా వస్తున్న పవిత్రమైన పర్వదినం. ఒకనాడు దేవతలందరూ దేవేంద్రుడి చేతికి కట్టిన రక్షతో అతనిలో సమరోత్సాహం కలిగి రాక్షసరాజును సంహరిస్తాడు. అదేవిధంగా ద్వాపరయుగంలో ద్రౌపది తన సోదరుడైన శ్రీకృష్ణుని చేతికి రక్షను కడుతుంది. దుర్యోధనుని అహంకారంతో దుశ్శాసనుడు ద్రౌపది వస్త్రాపహరణానికి పూనుకున్నప్పుడు ఆమెను శ్రీకృష్ణుడు అభయమిచ్చి కాపాడి ఈ జగతిలో అన్నాచెల్లెళ్ల బంధం ఎంతగొప్పదో చాటిచెబుతాడు. అదేవిధంగా బలిచక్రవర్తి చేతికి శ్రీమహాలక్ష్మి రక్ష కట్టి, పాతాళంలో ఉండిపోయిన తన భర్త శ్రీమహావిష్ణువును వైకుంఠానికి తీసుకెళ్తుంది. అందుకే రాఖీపండుగ రోజున సోదరి సోదరుని చేతికి రాఖీ కట్టేటప్పుడు 'యేన బద్ధో బలీ రాజా దానవేంద్రో మహాబలః తేన త్వా మభిబధ్నామి రక్షే మా చల మా చల' అని చదువుతూ కట్టాలంటారు. ఇక చరిత్రపరంగా చూసినపుడు ఈ రాఖీకి ఎంతో ప్రాధాన్యం ఉంది. అలెగ్జాండర్ మహాచక్రవర్తి భార్య రోక్సానా, తక్షశిల రాజైన పురుషోత్తముడిని తన సోదరునిగా భావించి రాఖీ పంపుతుంది. జీలం, చినాబ్ నదుల మధ్య ఉన్న దేశాలపై దండయాత్ర చేస్తున్న అలెగ్జాండర్, పురుషోత్తముడికి చిక్కినప్పటికీ సోదరిసమానురాలైన రోక్సానా కోరిక మీద అతను అలెగ్జాండర్‌ను విడిచిపెడతాడు. ఆవిధంగా అలెగ్జాండర్‌ను కాపాడింది కూడా ఈ రాఖీనే. ఈ విధంగా ఈ రాఖీకి యుగయుగాలుగా ఎంతో ప్రాధాన్యం ఉంది.





ఒంగోలులో రాఖీలను కొనుగోలు చేస్తున్న యువతులు

కాలానికి అతీతంగా..

కాలం మారేకొద్ది కొన్ని సంప్రదాయాలు, పండుగలు ప్రాధాన్యతను కోల్పోతాయి. అయితే రాఖీపండుగ మాత్రం ఆధునిక కాలంలో మరింత విశిష్టతను సంతరించుకుందని చెప్పొచ్చు. ఒకప్పుడు కేవలం ఉత్తర భారతదేశంలోనే జరుపుకునే ఈ అన్నాచెల్లెళ్ల పండుగ గత కొన్ని దశాబ్దాలుగా మనదగ్గర ఎంతో ఘనంగా జరుపుకుంటున్నారు. ప్రస్తుతం వివిధ రకాల డిజైన్లలో రాఖీలు పౌర్ణమికి ముందునుంచే మార్కెట్లో లభిస్తున్నాయి. వీటిని కొనుగోలు చేసేందుకు ఆడపిల్లలు సైతం ఎంతో ఆసక్తిగా దుకాణాలకు పరుగులు తీస్తున్నారు. అంతేకాకుండా సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన ప్రస్తుత రోజుల్లో ఆన్‌లైన్‌లోను వివిధ రకాల రాఖీలు లభ్యమవుతుండటంతో వీటికి భారీగా ఆర్డర్లు లభిస్తున్నాయి. ఇక గతంలో గ్రామాల్లో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉన్నప్పుడు అన్నాచెల్లెళ్లు ఒకే చోట ఉండేవారు. అయితే ప్రస్తుతం పరిస్థితులు మారాయి. ద్దరు చెరొకచోట ఉద్యోగాలు, చదువుల్లో ఉంటున్నారు. అయినప్పటికీ వారు ఈ రాఖీపండుగను ఘనంగా జరుపుకుంటున్నారు. ఫలానా చిరునామాలో ఉన్న తన సోదరునికి రాఖీ కోసం సోదరి ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తే రాఖీ పండుగ రోజున అది వారికి అందుతుంది. ఈ విధంగా నేటి యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని రాఖీపండుగను ఎంతో సంతోషంగా జరుపుకుంటున్నారు. ఎలాంటి మతబేధం లేకుండా రాఖీపండుగను జరుపుకోవడం విశేషం.

కిటకిటలాడుతున్న దుకాణాలు

రాఖీపౌర్ణమి సందర్భంగా ఒంగోలు నగరంలోని పలుచోట్ల రాఖీల అమ్మకాలు ప్రత్యేకంగా జరుగుతున్నాయి. గాంధీరోడ్డు, బాపూజీ కాంప్లెక్స్, మంగమూరు రోడ్డు, నెల్లూరు బస్టాండు, కర్నూల్ రోడ్డు ఇలా ప్రతీచోట దుకాణదారులు ప్రత్యేకంగా వివిధ రకాల రాఖీలను చెన్నై, హైదరాబాద్ వంటి నగరాలనుంచి తెప్పించి ప్రజలకు అందుబాటులో ఉంచారు. వీటిని కొనుగోలు చేయటానికి యువత సైతం ఎంతో ఉత్సాహంగా వస్తుండటంతో గత నాలుగైదు రోజులుగా దుకాణాలు కళకళలాడుతున్నాయి. అదేవిధంగా వివిధ రకాల స్వీట్లు కొనేందుకు సైతం ప్రజలు పెద్దసంఖ్యలో ఆసక్తి చూపుతున్నారు.

జంధ్యాల పౌర్ణమి



ఇక శ్రావణ పౌర్ణమి కేవలం సోదరీసోదరుల అను రాగ బంధానికి చిహ్నంగా మాత్రమే కాకుండా వేద పరిరక్షణను గుర్తుచేసే ఒక పవిత్రదినంగా కూడా పురాణాల్లో చెప్పబడింది. ఈ శ్రావణపౌర్ణమి రోజునే వేదాధ్యయనం, వేదపఠనం వంటి కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అదేవిధంగా శ్రావణమాసానికి ముందు 'ఉపనయనం' అయిన వారు రోజున ముంజవిడుపు అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఇక ఉపకర్మకు అర్హులై జంధ్యం ధరించే ప్రతి ఒక్కరూ ఈ శ్రావణపౌర్ణమి రోజున నూతన యజ్ఞోపవీతాన్ని ధరించాలి.

భక్తిశ్రద్ధలతో గంగమ్మతల్లికి పొంగళ్లు



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి స్వామి

సింగరాయకొండ, ఆగస్టు 18 : మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీలోని నర్రావారిపాలెంలో ఆదివారం గంగమ్మ తల్లి పొంగళ్ల కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు కూనపరెడ్డి సుబ్బారావు, చిగురుపాటి గిరి, సుదర్శి చంటి, మించల బ్రహ్మయ్య, నక్కా బ్రహ్మేశ్వరరావు, పామర్తి మాధవరావు, యస్థాని పాల్గొన్నారు.

ఘనంగా ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 18: ఒంగోలులోని మంగమ్మకాలేజీ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన మెరైన్ ఎగ్జిబిషన్‌ను ఆదివారం రాత్రి ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మానసిక ఉల్లాసం కోసం ఇటువంటి ఎగ్జిబిషన్‌ను అవసరమన్నారు. ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. అనంతరం ఎగ్జిబిషన్ నిర్వాహకులు కోటిరెడ్డి, రాజారెడ్డి మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటి సారిగా జలకన్య ఒక ప్రత్యేక ఐటంగా ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఇంకా ఎన్నో విభిన్నమైన అంశాలు ప్రజలకు ఆనందాన్ని పంచేందుకు పలు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కనుక ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని వారు కోరారు.

ఆటో బోల్తా.. ఒకరు మృతి



బోల్తాపడిన ఆటో

దర్శి ఆగస్టు 18: ఆటో బోల్తాపడి మహిళ మృతి చెందారు. ఈఘటన ఆదివారం ఉదయం మండలంలోని రామచంద్రాపురంలో చోటుచేసుకుంది. జముకులదిన్నె గ్రామానికి చెందిన 16 మంది కూలీ పనుల కోసం ఆటోలో రామచంద్రాపురం వెళ్తున్నారు. గ్రామ సమీపంలో మలుపువద్ద బ్రేక్ వేసేందుకు డ్రైవర్ యత్నించారు. అయితే బ్రేక్ కింద పొరపాటున అన్నం క్యారేజీ పడటంతో పడలేదు. దీంతో వేగంగా వెళ్తున్న ఆటో మలుపు వద్ద బోల్తా పడింది. వీరిలో 12 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను 108 ద్వారా దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ముగ్గురిని మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగేంద్రం అనే మహిళ మృతిచెందారు. మిగిలినవారు దర్శిలో వైద్యం పొందుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మానవత్వం చాటుకున్న ఎస్ఐ

ముండ్లమూరు, ఆగస్టు 18: వేముల గ్రామానికి చెందిన షేక్ మౌలాబీ శనివారం రమణారెడ్డిపాలెంలో వద్ద జరిగిన ఆటో ప్రమాదంలో మృతి చెందారు. పదేళ్ల క్రితం ఆమె భర్త కాలేషా మృతి చెందారు. వీరికి ఫరీద్, కరిష్మా అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలయ్యారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వి.నాగమల్లేశ్వరరావు ఆ చిన్నారులను చూసి చలించిపోయారు. మౌలాబీ కుమారుడు ఫరీద్‌కు రూ.10 వేలు సాయం చేశారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

కనిగిరి ఆగస్టు 18: అనారోగ్యంతో మండలంలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన బొనం బాబ్జి (42) ఆదివారం మృతిచెందారు. ఎస్ఐ త్యాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కనిగిరిలో బార్ అండ్ రెస్టారెంట్‌లో ఆయన బాబ్జి హోటల్ నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి కుమారుడిని హోటల్ ఉంచి బయటికి వెళ్ళాడు. పొదిలిరోడ్డులోని పొగాకుబోర్డు వెనుక పొలాల్లో స్పృహ తప్పి పడిపోయి ఉండటంతో అక్కడ నివసించే గిరిజనులు గమనించి బంధువులకు సమాచారం అందించారు. స్థానికుల సాయంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అందిస్తుండగా అధిక రక్తపోటుతో మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి గతంలోనే నరాల సంబంధించిన వ్యాధి ఉందని, బంధువులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉపాధి పనులను వెంటనే ప్రారంభించాలి

మంత్రి స్వామికి వ్యవసాయ కార్మిక సంఘం విజ్ఞప్తి



మంత్రి స్వామికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 18: గత రెండు నెలలుగా నిలిచిపోయిన ఉపాధి హామీ పథకం పనులను ప్రారంభించి గ్రామీణ పేదలను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు కోరారు. ఆదివారం రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామిని స్వగ్రామం తూర్పునాయుడుపాలెంలో కలిసిన వారు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ఉపాధి పనులు నిలిచిపోవడంతో పేదలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. వ్యవసాయ పనులు లేని కాలంలో జిల్లాలో ఉపాధి పనులు ముమ్మరంగా సాగుతాయని, ప్రతి రోజు రెండు లక్షల మంది పైగా కూలీలు జిల్లాలో పనిచేసేటువంటి జూన్, జూలై, ఆగస్టు నెలల్లో పనులు నిలిచిపోవడం బాధాకరమని, అందువల్ల వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీసం వేతనం రూ.600లతో పాటు పని దినాలు ఏడాదికి 200 రోజులకు పెంచాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి డాక్టర్ స్వామి మాట్లాడుతూ నిలిచిపోయిన ఉపాధి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు అక్రమ పద్ధతులను సరిచేసేందుకే తాత్కాలికంగా పనులు ఆపాల్సి వచ్చిందని, సోమవారం నుంచి విస్తృతంగా పనులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, నాయకులు కేజీ.మస్తాన్, వి.మోజేష్, కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగభైరవ సాహిత్య పురస్కార సభ

● పలువురికి అవార్డుల ప్రదానం



సన్మానగ్రహీతలతో అతిథులు, నిర్వాహకులు

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 18: నాగభైరవ సాహిత్యపీఠం ప్రతి ఏడాది డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు పేరిట అందిస్తున్న సాహిత్య పురస్కార ప్రదాన సభ ఆదివారం స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో ఘనంగా జరిగింది. సాహిత్యపీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) మాట్లాడుతూ నాగభైరవ కోటేశ్వరరావు ఎంతో మందిని సాహిత్యరంగంలో తీర్చిదిద్దారన్నారు. అటువంటి మహనీయుని పేరిట పురస్కారాలు అందజేయటం అభినందనీయమన్నారు. నాగభైరవ కోటేశ్వరరావు మంచి మనసున్న కవి అని, తనలాంటి ఎందరినో సాహిత్యరంగంలో ప్రోత్సహించారని తేళ్ల అరుణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాహిత్యపురస్కారాల ప్రథమ బహుమతిని పూలపూల వాన రచయిత ఏనుగు నరసింహారెడ్డికి, ద్వితీయ బహుమతిని మణిపూసలు రచయిత డాక్టర్ వూటుకూరి వరప్రసాద్‌కు, కళాపురస్కారాలను నాటక సినీ రచయిత వై.కృష్ణేశ్వరరావుకు, ఆత్మీయ పురస్కారాన్ని డాక్టర్ బీరం సుందరరావుకు అందజేశారు. కార్యక్రమంలో గుత్తికొండ సుబ్బారావు, డాక్టర్ నూనె అంకమ్మరావు, కుర్రా ప్రసాద్‌బాబు, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, గుళ్లపల్లి సుబ్బారావు, జక్కంపూడి సీతారామారావు, డాక్టర్ సింగారావు, సింహాద్రి జ్యోతిర్మయి, బెజవాడ వెంకట్రావు, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, డాక్టర్ నాగభైరవ ఆంజనేయులు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథంతోనే సుస్థిరాభివృద్ధి

● జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు గేయానంద్



సదస్సులో మాట్లాడుతున్న గేయానంద్

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 18: శాస్త్రీయ దృక్పథం ద్వారానే సుస్థిర అభివృద్ధి సాధ్యమని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం. గేయానంద్ పేర్కొన్నారు. మార్కాపురంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన జనవిజ్ఞాన వేదిక 18వ వార్షిక మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ సైన్సును, శాస్త్రీయ పద్ధతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు కట్టుబడి ఉండాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ పరిశోధనలు తెలియజేసే విజ్ఞాన ప్రసారం వంటి సంస్థలను మూసివేయటం, పరిశోధనలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం, పాఠ్యపుస్తకాల్లో సైన్సుకు సంబంధించిన కొన్ని అంశాలను తొలగించటం జరిగిందన్నారు. సమాజాన్ని మార్పు చేయటానికి జేవీవీ కార్యకర్తలు కృషి చేయాలని చెప్పారు. రాష్ట్ర నాయకులు డాక్టర్ స్వరూపారెడ్డి మాట్లాడుతూ స్మార్ట్‌ఫోన్‌లకే విద్యార్థులు అధిక సమయం కేటాయిస్తున్నారని, దీంతో ఆలోచన శక్తి తగ్గి నైతిక విలువలు కూడా దిగజారి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో డాక్టర్ శ్రీనివాసులు, దేవప్రసాద్, భాస్కర్, బాలకొండారెడ్డి, బషిరూన్ నిషాబేగం, సుబ్బ హ్మణ్యాచారి, వీరారెడ్డి, తిరుమలయ్య పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మ్యాజిక్‌షో

మూఢనమ్మకాలు పారదోలేందుకు జనవిజ్ఞాన వేదిక నాయకులు చేసిన మ్యాజిక్ షోలు ఆకట్టుకున్నాయి. గాలిలో తేలే వేషధారణ, గాజుపెంకులపై నడవటం, మండుతున్న కర్పూరాన్ని మింగటం, నీళ్లతో దీపాలు వెలిగించటం ప్రదర్శనల ద్వారా వీటి వెనుక ఉన్న సైన్సును వివరించారు.

లక్ష్మీనారాయణ ఇండస్ట్రీలో చోరీ

● సుమారు రూ.25 లక్షల సొత్తు అపహరణ



పరిశీలిస్తున్న క్లూస్‌టీం

కొమరోలు, ఆగస్టు 18 : కొమరోలు మండలం ఇడమకల్లు క్రాస్ రోడ్డు సమీపంలోని శ్రీలక్ష్మీనారాయణ ఇండస్ట్రీ కంపెనీలో ఆదివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫ్యాక్టరీలోని 33 కేవీ 500 కిలోవాట్ కెపాసిటీ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులోని రాగి తీగను దొంగిలించారు. ఫ్యాక్టరీలోని 17 త్రీఫేస్ ఇన్‌డిగేషన్ మోటార్లును పూర్తిగా తీసుకెళ్లారు, అంతేగాకుండా ప్యానల్ బోర్డులోని తీగలు కూడా కట్ చేశారు. కార్యాలయంలోని రెండు టీవీలు కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. చోరీకి గురైన వస్తువుల విలువ సుమారు రూ.25లక్షలు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కంపెనీకి నెలకు ఐదు లక్షల విద్యుత్ బిల్లులు వస్తున్నందున, ఆరు నెలల నుంచి ఫ్యాక్టరీని మూత వేశారు. విద్యుత్ సరఫరా కూడా పూర్తిగా నిలుపుదల చేశారు. ఫ్యాక్టరీలో విద్యుత్ లేకపోవడంతో సీసీ కెమెరాలు కూడా పనిచేయడంలేదు. ఫ్యాక్టరీలో ఇడమకల్లుకు చెందిన భార్యాభర్తలను కాపలాగా ఉంచారు. వారు శనివారం రాత్రి గ్రామంలో వారి బంధువుల వివాహానికి హాజరైన క్రమంలో ఈ చోరీ జరిగిందని పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు మార్కాపురం నుంచి క్లూస్‌టీం వచ్చి వేలిముద్రలు సేకరించింది. కేసు నమోదుచేసుకుని విచారిస్తున్నట్లు ఎస్సై మధుసుదన్‌రావు తెలిపారు. నిర్వాహకులు తుమ్మలపెంట వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ రామకోటయ్య ఫ్యాక్టరీకి వెళ్లి పరిశీలించారు.

అవీ..ఇవీ..

ప్రజలకు మంత్రి స్వామి రాఖీ శుభాకాంక్షలు

టంగుటూరు, ఆగస్టు 18 : రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి జిల్లా ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల మధ్య ప్రేమకు ప్రతి రూపమే రాఖీపండగని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాల్లో ఈ పండుగ భాగంగా ఉందని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు(విద్య),ఆగస్టు 18 : ఒంగోలు జవహర్ నవోదయవిద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి సెప్టెంబరు 16లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గీతాలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. ఒంగోలు, చీరాల, కందుకూరు, అద్దంకి, వేటపాలెం, గుడ్లూరు, వలేటివారిపాలెం, పొన్నలూరు, లింగసముద్రం, సింగరాయకొండ, ఉలవపాడు, టంగుటూరు, జరుగుమల్లి, కొండపి, చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు, కొత్తపట్నం, సంతమాగులూరు కొరిశపాడు, పంగులూరు, మార్టూరు, యద్దనపూడి, బల్లికురవ, పర్చూరు, ఇంకొల్లు, కారంచేడు, చినగంజాం మండలాల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. నవోదయ విద్యాలయ సమితి వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తు ఫారాన్ని ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలన్నారు. దరఖాస్తు ఫారంలో పొందుపర్చిన నియమాలను గమనించి జాగ్రత్తగా అప్‌లోడ్ చేయాలన్నారు ప్రవేశ పరీక్ష 2025జనవరి 18న జరుగుతుందని, పరీక్ష ఉదయం 11.30 నుంచి 1 గంట వరకు జరుగుతుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

పటిష్ట చట్టాలతో అత్యాచారాలను అరికట్టాలి : ఐద్వా

ఒంగోలు(కార్పొరేషన్), ఆగస్టు 18: నిత్యం మహిళలు, చిన్నారులుపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టేందుకు కఠిన చట్టాలు చేసి, పటిష్టంగా అమలు చేస్తేనే ఇలాంటి దురాగతాలను అడ్డుకోగలమని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోల్‌కతాలో వైద్యురాలిపై అమానుషంగా సామూహిక అత్యాచారం చేసి, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఒంగోలు జీజీహెచ్‌లో జూనియర్ డాక్టర్లు చేపట్టిన ఉద్యమానికి ఐద్వా తరుపున మద్దతు తెలియజేశారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి : సీపీఎం

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 18: ఒంగోలు నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పాలకులు పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం చీకటిశ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నగర కార్యదర్శి జి.రమేష్ సమావేశంలోని తీర్మానాలకు పత్రికలకు విడుదల చేశారు. నగర ప్రజానీకం మంచినీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నా ఆ సమస్యను పరిష్కరించకుండా, కౌన్సిల్ సమావేశాలు జరపకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ తమ స్వార్థం కోసం పార్టీ ఫిరాయింపుల పనిలో బిజీగా ఉన్నారని విమర్శించారు. నగరంలో రోడ్ల మరమ్మతులు, పేర్లు, కాలువల నిర్మాణం, కొత్త మంచిపైపులైను పనులు జరగడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో దామా శ్రీనివాసులు, తంబి శ్రీనివాసులు, సభ్యులు బీవీ.రావు, ఎస్‌డీ.హుస్సేన్, టి.మహేష్, దారా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

నాగులుప్పలపాడు, ఆగస్టు 18: ఈదుమూడి గ్రామంలో మన ఊరు-మన ఈదుముడి సేవా సంస్థ వ్యవస్థాపకులు కావూరి వాసు ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలు శ్రీరామ్ మల్టీస్పెషాలిటీ వైద్యశాల సహకారంతో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు చంద్రమౌళి, మౌనికారెడ్డి, కుట్టుబోయిన వెంకటేష్, సరయు, పల్లవి 127 మందికి రోగులకు వైద్యపరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీరామ్ మల్టీస్పెషాలిటీ వైద్యశాల మేనేజర్ ఎస్.నాగరాజు, పీఆర్వోలు జి.పున్నయ్య, చిరంజీవి, శ్యాంకుమార్, సైదా, సంస్థ సభ్యులు మేడా బ్రహ్మయ్య, ఉప్పల వెంకట్రామయ్య, యు.ప్రసాదు, కుర్రా వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీప్రసన్నాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

నాగులుప్పలపాడు, ఆగస్టు 18 : మద్దిరాలపాడులో నూతనంగా నిర్మించిన మహాగణపతి, జంటనాగులు, శ్రీప్రసన్నాంజనేయ, శ్రీగురు దత్తాత్రేయ, సరస్వతి దేవి, శిఖర జీవ ధ్వజయంత్ర ప్రతిష్ట మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు స్వామివార్లకు ప్రత్యే పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు అన్నదానం నిర్వహంచారు. దేవస్థాన కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఎండలతో హడలెత్తుతున్న జనం



ఎండలతో జన సంచారం లేని కొండపి ప్రధాన వీధి

కొండపి, ఆగస్టు 18 : భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. జనం రోడ్లపైకి రావాలంటే హడలెత్తిపోతున్నారు. ఇప్పటికే అడపాదడపా వర్షాలు కురిసి కొంతమేర వాతావరణం సహజంగా చల్లబడుతుండేది. ఈ ఏడాది ఆగస్టు మాసం సగం పూర్తయినా ఎండల వేడిమి తగ్గడం లేదు. పైగా శ్రావణమాసం కావడంతో పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, ఇతర శుభ కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి. ఎండల కారణంగా కార్యక్రమాలకు హాజరు కావడానికి సైతం జనం జంకుతున్నారు. మునుపెన్నడూ లేని విధంగా ఎండ తీవ్రంగా కాస్తున్నది. పగటి వేళ జనం రోడ్లపైకి రావడానికి వెనుకడుగు వేస్తున్నారు. పగలు ఎండలు తీవ్రంగా కాస్తుండగా, రాత్రిళ్లు గ్రామాల్లో దోమల పోడు పెరిగిందని ప్రజలు వాపోతున్నారు.

కోల్‌కతా దురాగతంపై 'నరసం' నిరసన గళం

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 18: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన అమానుష అత్యాచారం, హత్య ఘటనపై నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం)నిరసన గళాన్ని వినిపించింది. నరసం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ మున్నంగి రాజకుమారి అధ్యక్షతన ఆదివారం స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలోని సంఘ కార్యాలయంలో పలువురు కవయిత్రులు తమ కవితల ద్వారా నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ మాట్లాడుతూ ఆడవాళ్లు అంటే ఆటబొమ్మలు కాదని, వారికి కూడా ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛ ఉంటాయన్నారు. సమాజంలో స్త్రీలపై ఇటువంటి దురాగతాలు ఎన్నో జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధ్యక్షురాలు పి.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళలపై అత్యాచారం, హత్య చేసిన వారిని తక్షణమే కఠిన శిక్షించేలా చట్టాలను రూపొందించాలన్నారు. కార్యక్రమంలో నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, జిల్లా ప్రధానకార్యదర్శి మారేపల్లి సూర్యకుమారి, ఝాన్సీదుర్గ, బీరం అరుణ, పరాంకుశం కృష్ణవేణి తదితరులు తమ కవితలు వినిపించారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించి వైద్యురాలికి నివాళి ప్రకటించారు.

ఉత్సాహంగా 'చదవడం మాకిష్టం'

టంగుటూరు, ఆగస్టు 18 : టంగుటూరు గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు గుమ్మడి వర్ధనరాజు విద్యార్థులతో కథలు, పలు పుస్తకాలు చదివించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

వైభవంగా దక్షిణామూర్తిస్వామి గ్రామోత్సవం

టంగుటూరు, ఆగస్టు 18 : టంగుటూరులో ఆదివారం దక్షిణామూర్తి, కాలభైరవ స్వాముల విగ్రహాల ప్రతిష్ఠలో భాగంగా గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. భక్తులుకొబ్బరి కాయలు కొట్టి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామోత్సవం ముగియగానే పాలాభిషేకం నిర్వహించారు. ఉదయం 8గంటలకు గ్రామోత్సవం ప్రారంభం కాగా, 8.45 గంటలకు వేదపారాయణం, అధివాస హోమం, రుద్రహోమాలు, జలాధివాసం, మహానైవేద్యం, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ జరిగాయి. సాయంత్రం 6గంటలకు వేదపారాయణం, అధివాస హోమాలు, దాన్యాధివాసం, పుష్పాదివాసం, శయ్యాదివాసం, చతుర్వేదపారాయణం, మహానైవేద్యం, హారతి, మంత్రపుష్పం, ప్రసాద వినియోగం జరిగాయి. మాజీ ఉపసర్పంచ్ మక్కెన కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు : ఎస్ఐ

దర్శి, ఆగస్టు 18: దర్శి నూతన ఎస్ఐగా ఎం.మురళి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. చీరాలలో పనిచేస్తున్న ఆయన దర్శికి బదిలీ అయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పేకాట, బెట్టింగులు, తదితర కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈవ్‌టీజింగ్‌ను ఉక్కుపాదంతో అణిచి వేస్తామన్నారు. దర్శి పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు.

ఆలయ భూములకు రక్షణ కరువు

- రూ.100 కోట్లకు పైగా ఆస్తులు అన్యాక్రాంతం
- పట్టించుకోని అధికారులు
- యథేచ్ఛగా భూములను ఆక్రమిస్తున్న వైనం



భజంత్రీల మాన్యంలో వేసిన లేఅవుట్

పామూరు, ఆగస్టు 18: దేవుడి భూములకు రక్షణ కరువైంది. యథేచ్ఛగా భూములను ఆక్రమించుకొని రికార్డుల్లో పేర్లు మార్చుకొని సొమ్ము చేసుకొంటున్నారు. పామూరులోని మదనవేణుగోపాల స్వామి దేవస్థానానికి సంబంధించిన కోట్లాది రూపాయల విలువ కలిగిన భూములు ఈపాటికే ఆక్రమణకు గురయ్యాయి. వాటిల్లో పక్కా భవనాలతోపాటు, వెంచర్లు వేశారు. తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటూ రెవెన్యూ, ఎండోమెంట్ అధికారులు మమ అనిపిస్తున్నారు.



సర్వేనెంబర్ 176/2లో ఆక్రమించి ప్లాట్లకు ఏర్పాటు చేసిన రహదారి

పామూరులోని శ్రీమదనవేణుగోపాల స్వామి, శ్రీవల్లీ భుజంగేశ్వరస్వామి, వరద రాజులస్వామి, ఆంజనేయస్వామి దేవస్థానాలకు చెందిన సుమారు 395ఎకరాల భూములు, ఉన్నాయి. అందులో ఇప్పటివరకు వివిధ రూపాల్లో 75 ఎకరాలకు పైగా ఆక్రమణలకు గురయ్యాయి. ఆక్రమణకు గురైన భూముల విలువ మార్కెట్‌లో రూ.వంద కోట్లకు పైగా ఉంటుంది. కొందరు ఆక్రమణ దారులు తప్పుడు పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. పామూరు రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 176/2లో 13.80 ఎకరాల భూములు ఉన్నాయి. అందులో ఒక టిన్నర ఎకరా భూమిని ఓ ప్రయివేట్ వెంచర్ సంస్థ ఆక్రమించి రహదారి ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడ ఎకరా భూమి విలువ రూ.2 కోట్లకు పైగా ఉంది. సర్వే నెంబర్ 329/2లో 2.41 ఎకరాల భూమిలోను ఎకరా భూమిని ఆక్రమించి ప్లాట్లు వేసి సొమ్ము చేసుకొన్నారు. మరి కొందరు కట్టడాలు నిర్మించుకొన్నారు. సర్వే నెంబర్ 439/5లో 1.97 ఎకరాల భూమిలో ప్లాట్లు వేశారు. వేణుగోపాలస్వామి ఆలయానికి సంబంధించి నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం వేంపాడు రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 78/1లో ఉన్న 6.06 ఎకరాల భూమి అర్చకుల దగ్గర కొనుగోలు చేశామంటూ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. జాతీయ ర హదారికి పక్కనే ఉన్న ఈ భూమి విలువ రూ.20కోట్లు ఉంటుంది. ఈ భూమికి కమిటీతో సంబంధం లేకుండా అర్చకులు తమకు విక్రయించినట్లు అధికా రులను లోబరుచుకొని బినామీ రికార్డులు సృష్టించి 2016లో రిజిస్ట్రేషన్ చేయించుకొన్నారు. దేవస్థాన అధికారులు తమకు ఎన్‌వోసీ ఇచ్చేందుకు సహకరించడం లేదని పట్టాలు పొందినారు గతేడాది జూన్ 2న జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో అప్రమత్తమైన ఎండోమెంట్ అధికారులు విచారణ చేపట్టి పట్టాలు పొందిన వ్యక్తుల పేర్లు తొలగించి ఆలయ భూమిగా నమోదు చేయాలని అక్టోబర్ 26న తీర్పు ఇచ్చారు. దాంతో స్థానిక అధికారులు ఆ భూమిలో బోర్డులు ఏర్పాటుచేశారు. వల్లీ భుజంగేశ్వర దేవస్థానానికి సంబంధించి సర్వే నెంబర్ 438/2లో 7.66 ఎకరాల భూములు ఉన్నాయి. వీటిలో ఆక్రమణ దారులు జామాయిల్ తోటలు సాగు చేస్తున్నారు. పామూరు కొత్త చెరువు వెనుక భాగం జాతీయ రహదారికి పక్కన సర్వే నెంబర్ 399/6లో 1.55 ఎకరాల విలువైన భూమిపై ఆక్రమణదారులు కన్నేశారు. తప్పుడు పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకొని వెబ్‌ల్యాండ్‌లో పేర్లు నమోదు చేసుకున్నారు. ఎఫ్‌ఎల్ఆర్‌లో మాత్రం భజంత్రీల మాన్యంగా నమోదై ఉంది. దీని విలువ మార్కెట్‌లో రూ.4 కోట్లకు పైగా ఉంది. ప్రస్తుతం ఆక్రమణ దారులు లేఅవుట్ వేసి అమ్మకాలు జరుపుతున్నారు. 256/2, 256/1, 441లో 1,2,3, 442 1,2,3,లోని భూములు ఆక్రమ ణదారుల చెరలో ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ జిల్లా అధికారులు స్పందించి దేవస్థాన భూములను 22ఏ1సి రిజిస్ట్రేషన్ చట్టం 1908లోని నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్పించి రక్షణ చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.



వల్లీ భుజంగేశ్వరస్వామి ఆలయం

1,200 లీటర్ల బెల్లంఊట ధ్వంసం

- 20 లీటర్ల నాటుసారా స్వాధీనం



బెల్లంఊటను ధ్వంసం చేస్తున్న ఎస్ఈబీ అధికారులు

గిద్దలూరు టౌన్, ఆగస్టు 18 : నాటుసారా తయారు చేస్తున్న ప్రాంతంపై ఎస్ఈబీ అధికారులు దాడిచేసి అక్కడున్న బెల్లంఊటను ధ్వంసం చేశారు. నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. గిద్దలూరు ఎస్ఈబీ సీఐ ఎస్.కొండారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని బురుజుపల్లె గ్రామశివారులోని చెరువుకట్ట వద్ద ముళ్లపొదల్లో నాటుసారా తయారీ చేస్తున్నట్లు సమాచారం రావడంతో సీఐ, సిబ్బంది దాడి చేశారు. ఆ సమయంలో నాటుసారా తయారు చేస్తున్న ముగ్గురు వ్యక్తులు సిబ్బందిని చూసి పారిపోయారు. బురుజుపల్లె గ్రామస్థులుగా గుర్తించారు. 6 డ్రమ్ములలో 1,200 లీటర్ల బెల్లంఊటను గుర్తించి ధ్వంసం చేశారు. 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. దాడిలో సిబ్బంది పి.వెంకటేశ్వర్లు, ఎం.సాయి ఉన్నారు.

లెదర్‌పార్కును పునఃప్రారంభించాలి

గిద్దలూరు టౌన్, ఆగస్టు 18 : గిద్దలూరు సమీపంలోని లెదర్‌పార్కును పునఃప్రారంభించాలని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ ఆర్గనైజేషన్ నియోజకవర్గ కన్వీనర్ పెరికె మహేష్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఎస్సీ యువతి, యువకులకు శిక్షణ కోసం, జీవనోపాధి కోసం లెదర్‌పార్కును ఏర్పాటు చేసేందుకు చొరవ చూపాలన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2003లో చర్మకారుల ఉపాధికి పెద్దపీట వేస్తూ టీడీపీ ప్రభుత్వం లెదర్‌పార్కు ఏర్పాటుకు చొరవ చూపిందన్నారు. అప్పట్లోనే దాదాపు 72 చోట్ల వీటి ఏర్పాటుకు స్థలాన్ని, నిధులను కేటాయించిందన్నారు. యడవల్లి సమీపంలో లెదర్‌పార్కుకు 2003లో టీడీపీ 27.18 ఎకరాలను ఇందుకోసం కేటాయించిందన్నారు. ఇందులో షెడ్లు ఏర్పాటు చేసి కొంతమందికి నైపుణ్యశిక్షణ కూడా ఇచ్చిందని పేర్కొన్నారు. తరువాత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. లెదర్‌పార్కును తిరిగి ప్రారంభించడం వలన తోలు వస్తువులు, పాదరక్షల తయారీకి చర్మకారులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు చొరవ చూపాలని ఆయన కోరారు.

ఆటో నుంచి జారిపడి మహిళ మృతి



కాశమ్మ మృతదేహం

త్రిపురాంతకం, ఆగస్టు 18: ఆటో నుంచి జారిపడి ఓ మహిళ మృతిచెందిన ఘటన త్రిపురాంతకంలోని శివాలయం సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో పత్తి కాశమ్మ (55) అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. దొనకొండ మండలం రామాపురం గ్రామానికి చెందిన పత్తి కాశమ్మ బంధువులతో కలిసి త్రిపురాంతకంలో వివాహ కార్యక్రమానికి బయలుదేరారు. మార్గమధ్యలో సాగర్ కాలువ, శివాలయం మధ్యలోకి రాగానే ఆటో వెనుకవైపు డోరుకు ఉన్న తాడు తెగింది. ఆటోలో వెనుకవైపు కూర్చునివున్న కాశమ్మ, కోటేశ్వరరావు కిందపడిపోయారు. దీంతో కాశమ్మ ఘటనా స్థలంలోనే మృతిచెందారు. కోటేశ్వరరావుకు స్వల్పగాయాలు కావడంతో 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు మహిళ మృతి

త్రిపురాంతకం, ఆగస్టు 18: పిడుగుపాటుకు గురై ఓ మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని దూపాడు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన సభినాబీ (60) మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు.. దూపాడు గ్రామానికి చెందిన సభినాబీ వ్యవసాయ పనులకు పొలానికి వెళ్లారు. ఈ క్రమంలో సాయంత్రం వర్షంపడే సమయంలో పిడుగులు పడ్డాయి. పిడుగుపాటుకు గురైన సభినాబీ పొలంలోనే మృతిచెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువురికి గాయాలు

మార్కాపురం రూరల్, ఆగస్టు 18: మండలంలోని నికరంపల్లి వద్ద అమరావతి- అనంతపురం జాతీయ రహదారిపై కారు, మరో కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. బ్రహ్మంగారి మఠం నుంచి శ్రీశైలం వెళుతున్న వాహనం అదే సమయంలో శ్రీశైలం నుంచి తిరుపతి వెళుతున్న కారు నికరంపల్లి వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఘటనా స్థలాన్ని రూరల్ పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు.

కరాటేలో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 18: మార్కాపురంలోని ఎంఎస్ స్పోర్ట్స్ కరాటే విద్యార్థులో చెన్నైలో జరిగిన సౌత్ కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చారు. మహితారెడ్డి బంగారు, కాంస్యం, భార్గవ్ బంగారం, సాయి త్రిష కాంస్య మెడల్, షాకీర్ బాషా, యాసిన్ బాషా కాంస్య పతకాలు సాధించారు. కరాటే అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి కీర్తన, జిల్లా కార్యదర్శి మోహన్‌రావులు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎంఎస్ కరాటే స్కూల్ చీఫ్ మారంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, తోట ప్రసాద్ పాల్గొన్నారు.

ఇరువురి మధ్య వాగ్వాదం-సీసాతో దాడి

చీరాలటౌన్, ఆగస్టు 18 : వ్యక్తిపై మరో వ్యక్తి సీసాతో దాడి చేయగా బాధితుడు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఈఘటన ఆదివారం మధ్యాహ్నం కారంచేడు మండలం కుంకులమర్రు గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జమ్మలమడుగు ఏసురత్నం, బిళ్ల ప్రశాంత్ ఒకే ముఠాలోని రోజువారీ కూలీలు. వీరిద్దరూ మధ్యాహ్న సమయంలో ఓ గోడౌన్‌లో పని చేసి విశ్రాంతి తీసుకునే సమయంలో పరస్పరం గొడవ పడ్డారు. దీంతో ప్రశాంత్ సీసా పగలకొట్టి గొంతుపై పలు చోట్ల దాడిచేసి గాయపరిచాడు. దీంతో అపస్మారక స్థితిలో ఉన్న బాధితుడిని స్థానికులు 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యులు అతడికి శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉంది. ఈ మేరకు అవుట్‌పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు. దీంతో సమాచారం అందుకున్న ఎస్ఐ వెంకటరావు హాస్పిటల్‌కు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ప్రశాంత్ కూడా స్వల్ప గాయంతో హాస్పిటల్‌లో చేరాడు.

బావిలో పడి రైతు మృతి

సంతమాగులూరు, ఆగస్టు 18 : మండలంలోని ఏల్చూరు గ్రామానికి చెందిన చల్లా వెంకటరెడ్డి (37) అనే రైతు ఆదివారం పొలం వద్ద ఉన్న బావిలో కాలుజారి పడి మృతి చెందారు. సంతమాగులూరు ఏఎస్ఐ రావినూతల నాగేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం ఏల్చూరు గ్రామానికి చెందిన వెంకటరెడ్డి ఆదివారం ఉదయం పొలం పనులకు వెళ్లారు. అక్కడున్న నేలబావిలో నీటి కోసం దిగి కాలుజారి పడిపోయినట్లు తెలిపారు. ఈతగాళ్లతో మృతదేహాన్ని బయటకు తీసినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వెంకటరెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

జూదరుల అరెస్టు

స్వర్ణ(పర్చూరు), అగస్టు 18 : కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకట్రావు తెలిపారు. అందిన సమాచారం మేరకు.. పేకాట శిబిరంపై దాడి చేసి జూదరులను అరెస్టు చేశామని, వారి నుంచి రూ.3490 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని ఎస్ఐ తెలిపారు.

ఎనిమిది దుకాణాలపై కేసులు

అద్దంకి, ఆగస్టు 18 : అద్దంకి పట్టణంలోని పలు దుకాణాలను జిల్లా తూనికల కొలతల అధికారి నాగేశ్వరరావు ఆదివారం తనిఖీలు చేసి 8 దుకాణాలపై కేసులు నమోదు చేశారు. ఒక బియ్యం దుకాణం, రెండు చికెన్ దుకాణాలలో తూకాలలో వ్యత్యాసం ఉండగా, మిగిలిన 5 చికెన్ దుకాణాలలో కాటాలకు ముద్రలు లేనట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు.

పురుగు మందుల షాపులో చోరీ

- రూ.96వేల అపహరణ

పర్చూరు, ఆగస్టు 18 : పర్చూరులో పురుగు మందుల దుకాణంలో చోరీ జరిగిన ఘటనపై ఆదివారం బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పర్చూరు-చీరాల ఆర్అండ్‌బీ రోడ్డులోని పురుగు మందుల దుకాణంలో శనివారం రాత్రి ఎగ్జాస్ట్ ఫ్యాన్‌ను తొలగించి, రంధ్రం తొలిచి దొంగలు షాపులోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. దుకాణంలో ఉన్న రూ.96వేల నగదును దొంగిలించారు. ఈ చోరీ దృశ్యాలు సీసీ కెమెరా ఫుటేజీలో నమోదయ్యాయి. ఆదివారం ఉదయం షాపు యజమాని తలుపులు తీసి లోకిని వెళ్లడంతో ఎదురుగా ఉన్న గోడకి రంధ్రం ఉండడంతో ఆందోళనకు గురయ్యారు. వెంటనే గల్లాపెట్టిని పరిశీలించగా, నగదు కనిపించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు దుకాణాన్ని పరిశీలించారు. ఏఎస్ఐ సురేష్ రెడ్డి బాపట్ల క్లూస్ టీం సిబ్బందికి సమాచారం అందించారు. ఆ బృందం చోరీ జరిగిన ప్రాంతంలో ఆధారాలను సేకరించారు. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

నేడు శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠ

పర్చూరు, ఆగస్టు 18 : పర్చూరు మండల పరిధిలోని వీరన్నపాలెం గ్రామంలో దాతల సహకారంతో రూపుదిద్దుకున్న శ్రీ కృష్ణుని ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం అనతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.


ఆరామ క్షేత్రం ప్రారంభం



కార్యాలయ గదిని ప్రారంభిస్తున్న అప్పారావు

అద్దంకిటౌన్, ఆగస్టు 18 : అద్దంకి సీమ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని పాత శివాలయం వద్ద నిర్మించిన ఆరామ క్షేత్రంలో ఆదివారం కార్యాలయ గదిని ధర్మవరపు చారిటీస్ తరపున ధర్మవరపు అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు జమ్మలమడక హనుమంతరావు మాట్లాడుతు ఆరామక్షేత్రం ఆధునీకరణ, మొదటి అంతస్తు పూర్తికి చేయడానికి సూమారు రూ.19లక్షల విరాళాలను సేకరించి పూర్తి చేసినట్లు చెప్పారు. మొదటి అంతస్తు కార్యాలయ గదిని ధర్మవరపు చారిటీస్ తరపున రూ.3లక్షలతో నిర్మించినట్లు చెప్పారు. బ్రాహ్మణ కుటుంబాలు కర్మ కార్యక్రమాలకు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి ఈదర శివప్రసాద్, కోశాధికారి నాగరాజు, పుట్టంరాజు శ్రీరామచంద్రమూ ర్తి, ధర్మవరపు శ్రావణ్‌కుమార్, లక్కరాజు చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు, వెంకటరత్నం, శ్రీనివాస్, సప్తాచలశర్మ, శ్రీనివాసరావు, మోహనరావు, సుబ్రహ్మణ్యం, రాధాకృష్ణమూర్తి, భవన్నారాయణ, సీతారామయ్య, సత్యం పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన కల్పించాలి



ర్యాలీలో పాల్గొన్న మహిళలు

అద్దంకిటౌన్, ఆగస్టు 18 : హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అద్దంకి, కొరిశపాడు టీఐ అవుట్‌రిచ్ వర్కర్స్ కరుణ, కృష్ణవేణి అన్నారు. ఆదివారం అద్దంకిలోని సంజీవనగర్‌లో మీకు తెలుసా అనే కార్యక్రమంలో భాగంగా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై మహిళలు, యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు శ్రావణి, మల్లేశ్వరి, శారద, నయోమి, కృపాదానం పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా అంకమ్మతల్లి తిరునాళ్ల



తిరునాళ్లలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలు



టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్‌ప్రభ

చీమకుర్తి, ఆగస్టు 18 : చీమకుర్తి మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో వేంచేసిఉన్న అంకమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిపారు. ఉదయం నుంచే ఆలయంలో అమ్మవారిని దర్శించుకోవటానికి భక్తులు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణతో సుందరంగా తీర్చిదిద్దారు. రాత్రికి ఆలయం ప్రాంగణంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మూడు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. అలాగే టీవీ, సినీ కళాకారులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు. పరిసరప్రాంత గ్రామాల నుంచి పెద్దఎత్తున ప్రజలు విచ్చేశారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు

అద్దంకి ఎస్ఐ నాగరాజు వీఆర్‌కు..

తీవ్ర అవినీతి ఆరోపణలు

మంత్రి గొట్టిపాటికి ఫిర్యాదు చేసిన పలు గ్రామాల ప్రజలు

అద్దంకి, ఆగస్టు 18 : అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న నాగరాజును వీఆర్‌కు పిలిచారు. ఎన్నికల ముందు అద్దంకి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన నాగరాజు ఎస్‌హెచ్‌వోగా ఉన్న అధికారిని సైతం తప్పు దారి పట్టించే విధంగా వ్యవహరిస్తూ ఎన్నికల సమయంలో రెండు పార్టీల నాయకుల ద్వారా డబ్బులు దండుకున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఎన్నికల పూర్తయి టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కూడా పాత పద్ధతినే కొనసాగిస్తూ పలు కేసులలో వైసీపీ వర్గీయుల వద్ద డబ్బులు తీసుకుంటూ టీడీపీ వర్గీయుల కేసులను నీరుగార్చే విధంగా వ్యవహరించినట్లు పలు గ్రామాల ప్రజలు మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా చినకొత్తపల్లిలో టీడీపీ వర్గీయులు బాధితులుగా ఉన్నప్పటికీ వైసీపీ వర్గీయులతో మిలాఖత్ అయ్యి కేసును పక్కదారి పట్టించినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయాలు మొత్తం నిర్ధారణ చేసుకున్న తరువాత మంత్రి గొట్టిపాటి ఈ నెల 16వ తేదీన అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన సమయంలో పలు గ్రామాల ప్రజలు ఎస్ఐ తీరుపై ఫిర్యాదు చేశారు. అక్కడే ఉన్న ఎస్ఐ నాగరాజుతో మంత్రి రవికుమార్ ఒకింత కటువుగానే చెప్పినట్లు తెలుస్తున్నది. పద్ధతి మార్చుకొని ఉద్యోగం చేయకపోతే కష్టమని కూడా అని చెప్పినట్లు సమచారం. ఈ విషయాలు జిల్లా పోలీస్ అధికారుల దృష్టికి కూడా పోవడంతో శుక్రవారం వీఆర్‌కు పిలిచారు. ఎస్ఐ ఈ విషయాన్ని ఎస్‌హెచ్‌వోగా ఉన్న సీఐ కృష్ణయ్య నిర్ధారించారు. ఇప్పటికే సీఐ కృష్ణయ్య ఆరోగ్య రీత్యా సెలవులో ఉండగా మహిళా ఎస్ఐ రత్నకుమారి బదిలీపై వెళ్లారు. నాగరాజును వీఆర్‌కు పిలవడంతో పోలీస్‌స్టేషన్‌లో ప్రస్తుతం సిబ్బంది మాత్రమే మిగిలారు. ఇప్పటికే మహిళా ఎస్ఐగా ప్రవీణను నియమించగా, మరో ఎస్ఐని కూడా త్వరలో నియమించనున్నట్లు తెలుస్తుంది. త్వరలో బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలుస్తుంది.

గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్



గ్రామ అధ్యక్షులకు నియామకపత్రాలను అందజేస్తున్న విజయ్‌కుమార్

చినగంజాం, ఆగస్టు 18 : జనసేన పార్టీ నాయకులు, వీరమహిళలను సమన్వయం చేసుకుంటూ గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని పల్లెపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దపల్లెపాలెం, బాపయ్యనగర్ గ్రామాలకు జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులను ఆదివారం ఆయన నియమించారు. పెద్దపల్లెపాలెం, బాపయ్యనగర్ గ్రామాలకు చెందిన రాసాని గోపి, దండుప్రోలు అంజయ్యను గ్రామ పార్టీ అధ్యక్షులుగా ఎంపి క చేసి నియామక పత్రాలను అందజేశారు. రాష్ట్ర పార్టీ ఆదేశాలను పాటిస్తూ గ్రామ స్థాయిలో పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సందు శ్రీనివాసరావు, ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి తుమ్మలపెంట సతీష్, నాయకులు వెంకట్, తోట అశోకచక్రవర్తి, వాసుదేవరావు, నోవా, వాసు, ఆయా గ్రామాల జనసైనికులు పాల్గొన్నారు.

మార్కాపురం సబ్‌కలెక్టర్ బదిలీ

మార్కాపురం, ఆగస్టు 18: మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. కడప జిల్లాలో ట్రైనీ కలెక్టర్‌గా పనిచేస్తూ గత సంవత్సరం డిసెంబర్‌లో మార్కాపురం సబ్ కలెక్టర్‌గా రాహుల్‌మీనా వచ్చారు. మార్కాపురం డివిజన్‌లో పనిచేసింది కొద్దికాలమే అయినా సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు పొందారు. ప్రధానంగా సార్వత్రిక ఎన్నికల సమయంలో సమర్థంగా సేవలం దించి ఉత్తమ అధికారిగా ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు పొందారు. ఇటీవల జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అవార్డును పొందారు.

నల్లమల ఘాట్‌లో ట్రాఫిక్ జామ్

పెద్దదోర్నాల, ఆగస్టు 18: కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి నల్లమల ఘాట్ రోడ్డులో ఆదివారం వాహనాల రాకపోకలు గంటపాటు స్తంభించాయి. ఈ ఘటన మండల పరిధిలోని పిల్లల ఘాట్‌గా పిలువబడే ప్రాంతం వద్ద చోటు చేసుకొంది. కర్నూలు నుండి దోర్నాల వైపు లోడుతో వస్తున్న లారీ ఘాట్ ఎక్కలేక రోడ్డుకు అడ్డంగా తిరిగింది. దీంతో రెండు వైపులా వాహనాలు నిలిచి పోయాయి. గంట పాటు ప్రయాణికులు అవస్థలు పడ్డారు. దీంతో వాహనాల డ్రైవర్లు కలుగజేసుకుని లారీని పక్కకు తొలగించారు. దాంతో వాహనాల రాకపోకలు యధావిధిగా కొనసాగాయి.

పురందేశ్వరి నియామకంపై హర్షం

గిద్దలూరు, ఆగస్టు 18 : కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలలో పార్టీని బలోపేతం చేసేందుకు, పార్టీ సభ్యత్వాన్ని పెంచేందుకు వీలుగా ఆయా రాష్ట్రాల ఇన్‌చార్జ్‌గా దగ్గుపాటి పురందేశ్వరిని నియమించడంపై బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ కూటమి అధికారం దిశగా నడిపించిన పురందేశ్వరి రానున్న రోజుల్లో ఈ మూడు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తారని ఆయన పేర్కొన్నారు.

తాగునీటి కోసం రాస్తారోకో



రోడ్డుపై నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

పెద్దారవీడు, ఆగస్టు 18: తాగునీటి కోసం మహిళలు ఆదివారం మండలంలోని గొబ్బూరు వద్ద గల అమరావతి-అనంతపురం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. తాగుటానికి నీరు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. గతంలో మాదిరిగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. తాగడానికి నీరులేక ఇబ్బందులు పడుతుంటే అధికారులు పంటించుకోవడం లేదని వాపోయారు. నీటి సమస్య పరిష్కారానికి త్వరలో చర్యలు చేపడతామని సర్పంచ్ ఆదినారాయణ హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

అద్దంకి, ఆగస్టు 18 : తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని శంఖవరప్పాడు(రెడ్డిపాలెం)లో లక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు పర్యవేక్షించారు. నిర్వాహకులు జిలుగు రోశిరెడ్డి, నాగ శ్రీనివాసరెడ్డి, వెంకటలక్ష్మి పూజా సామగ్రిని సమకూర్చారు.

అధ్వానంగా పారిశుధ్యం



మార్కాపురం మున్సిపల్ కార్యాలయం

• కంపుకొడుతున్న వీధులు • కాలువల్లో కదలని మురుగు • పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు

మార్కాపురం, ఆగస్టు 15: మార్కాపురం మున్సిపాలిటీలో పారిశుధ్యం నానాటికి తీసికట్టుగా మారుతోంది. కాలాలతో సంబంధంలేకుండా ఏ కాలంలోనైనా పట్టణంలో అపరిశుభ్రత తాండవిస్తోంది. ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. మురుగు కాలువల పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. కాలువల్లో చెత్తాచెదారం పేరుకు పోవడంతో వర్షాకాలంలో పొంగిపొర్లి రోడ్డపై మురుగు పారుతోంది. గతంతో పోలిస్తే సచివాలయాల్లో ఉండే పారిశుధ్య విభాగం సిబ్బంది ద్వారా పర్యవేక్షణ పెరిగినా పరిస్థితిలో మార్పు రావడంలేదు. ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం, పారిశుధ్య విభాగం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రజలకు శాపంగా మారింది. ప్రస్తుతం వర్షాకాలం కావడం వ్యాధులు ముసిరె ప్రమాదం ఉన్న నేపథ్యంలో నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాల్సి ఉంది.

కాలువల్లో ముందుకు కదలని మురుగు

మార్కాపురం మున్సిపాలిటీలో మొత్తం 35 వార్డులు న్నాయి. రోజుకు 40 టన్నుల మేర చెత్త ఉత్పత్తి అవుతోంది. దానిలో సుమారు 35 టన్నుల మేర చెత్త సేకరించి డపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. మిగిలిన చెత్త కాలువల్లోకి చేరి మురుగు ముందుకు కదలక పోవడంతోనే ఇబ్బందులు తలెత్తుతున్నాయి. చాలాచోట్ల మురుగు రోడ్లపైకి చేరడంతో దోమలకు ఆవాసంగా మారుతోంది. మామూలు కాలాల్లో ఎలావున్నా వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. వ్యాధులు వ్యాప్తి చెందేందుకు మురుగునీరు కారణమవుతోంది. అలా మురుగు నిలిచిన చోట కనీసం దోమలవృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ కిరోసిన్ చల్లాల్సివున్నా ఆ విధమైన పనులేమి చేయడంలేదు. మరీ ముఖ్యంగా క్రమం తప్పకుండా మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాల్సి ఉంది. ప్రధాన వీధుల్లో మినహా పట్టణం మొత్తం ఆ పనులు చేస్తున్న దాఖలాలు లేవు.

ఎక్కడికక్కడ పేరుకుపోతున్న చెత్త

మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య కార్మికులు 205 మంది ఉన్నారు. వారిపై సచివాలయానికి ఒకరు చొప్పున శానిటరీ సెక్రటరీలు, వీరందరినీ పర్యవేక్షించడానికి ఒక శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉన్నారు. చెత్త సేకరణకు 3 లారీలు, 4 ట్రాక్టర్లు, 10 ఈ-ఆటోలు, 50 పుష్‌కార్టులు ఉన్నాయి. కార్మికులు ప్రతి రోజు వేకువజామున 5.00 గంటల నుంచి విధులకు హాజరవుతారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కొందరు కార్మికులు ఆయా వార్డుల్లో పారిశుధ్య పనుల్లో పాల్గొనాల్సి ఉంది. వీరు పట్టణంలో ఉత్పత్తయ్యే చెత్తను సక్రమంగా సేకరించడంలో మాత్రం విఫలమవుతున్నారు. ప్రధాన పట్టణంలోని 8 వార్డుల్లో మినహా మిగిలిన వార్డుల్లో కార్మికులు అన్ని ప్రాంతాలకు తిరిగి చెత్తను సేకరించడంలేదు. శివారు కాలనీల్లో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. చెత్త సేకరణ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు రోడ్లపక్కన చెత్తను పడేస్తున్నారు. దీంతో ఎక్కడికక్కడ చెత్తపేరుకు పోతోంది. ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన సందర్భాల్లో మినహా మిగిలిన సమయంలో చెత్త సేకరణ సక్రమంగా జరగడంలేదు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని ఎంపీ, ఎమ్మెల్యేల కార్యాలయాల సమీపంలో రోడ్డుపై చెత్త చెదారం పేరుకుపోయి ఇబ్బందిపడుతున్నామని పలుమార్లు ఫిర్యాదులు అందినా పారిశుధ్య విభాగం పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.




రోడ్డువెంబడి పడేస్తున్న చెత్తాచెదారం, పొత్తంవారి వీధిలో వర్షాలకు రోడ్డుపైకి వచ్చిన మురుగు

1200 లీటర్ల బెల్లంఊట ధ్వంసం

• 20 లీటర్ల నాటుసారా స్వాధీనం



బెల్లంఊటను ధ్వంసం చేస్తున్న ఎస్ఈబీ అధికారులు

గిద్దలూరు టౌన్, ఆగస్టు 18 : నాటుసారా తయారు చేస్తున్న ప్రాంతంపై ఎస్ఈబీ అధికారులు దాడిచేసి అక్కడున్న బెల్లంఊటను ధ్వంసం చేశారు. నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. గిద్దలూరు ఎస్ఈబీ సీఐ ఎస్.కొండారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని బురుజుపల్లె గ్రామశివారులోని చెరువుకట్ట వద్ద ముళ్లపొదల్లో నాటుసారా తయారీ చేస్తున్నట్లు సమాచారం రావడంతో సీఐ, సిబ్బంది దాడి చేశారు. ఆ సమయంలో నాటుసారా తయారు చేస్తున్న ముగ్గురు వ్యక్తులు సిబ్బందిని చూసి పారిపోయారు. పారిపోయిన వ్యక్తులు బురుజుపల్లె గ్రామస్థులుగా గుర్తించారు. ఆ ప్రాంతంలో 6 ప్లాస్టిక్ డ్రమ్ములలో 1200 లీటర్ల బెల్లంఊటను గుర్తించి ధ్వంసం చేశారు. 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. దాడిలో సిబ్బంది పి.వెంకటేశ్వర్లు, ఎం.సాయి ఉన్నారు.

లెదర్‌పార్కును పునఃప్రారంభించాలి

గిద్దలూరు టౌన్, ఆగస్టు 18 : గిద్దలూరు సమీపంలోని లెదర్‌పార్కును పునఃప్రారంభించాలని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ ఆర్గనైజేషన్ నియోజకవర్గ కన్వీనర్ పెరికె మహేష్ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎస్సీ యువతీ యువకులకు శిక్షణ కోసం, జీవనోపాధి కోసం లెదర్‌పార్కును ఏర్పాటు చేసేందుకు చొరవ చూపాలని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2003లో చర్మకారుల ఉపాధికి పెద్దపీట వేస్తూ టీడీపీ ప్రభుత్వం లెదర్‌పార్కు ఏర్పాటుకు చొరవ చూపిందన్నారు. అప్పట్లోనే దాదాపు 72 చోట్ల వీటి ఏర్పాటుకు స్థలాన్ని, నిధులను కేటాయించిందన్నారు. యడవల్లి సమీపంలో లెదర్‌పార్కుకు 2003లో టీడీపీ 27.18 ఎకరాలను ఇందుకోసం కేటాయించిందన్నారు. ఇందులో షెడ్లు ఏర్పాటు చేసి కొంతమందికి నైపుణ్యశిక్షణ కూడా ఇచ్చిందన్నారు. తరువాత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. లెదర్‌పార్కును తిరిగి ప్రారంభించడం వలన తోలు వస్తువులు, పాదరక్షల తయారీకి చర్మకారులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు చొరవ చూపాలని ఆయన కోరారు.

ఆటో నుంచి జారిపడి మహిళ మృతి



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

త్రిపురాంతకం, ఆగస్టు 18: ఆటో నుంచి జారిపడి ఓ మహిళ మృతిచెందిన ఘటన మండల కేంద్రంలోని శివాలయం సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో పత్తి కాశమ్మ (55) అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు, దొనకొండ మండలం రామాపురం గ్రామానికి చెందిన పత్తి కాశమ్మ బంధువులతో కలిసి త్రిపురాంతకంలో వివాహ కార్యక్రమానికి బయలుదేరారు. మార్గమధ్యలో సాగర్ కాలువ, శివాలయం మధ్యలోకి రాగానే ఆటో వెనుకవైపు డోరుకు ఉన్న తాడు తెగింది. ఆటోలో వెనుకవైపు కూర్చునివున్న కాశమ్మ, కోటేశ్వరరావులు కిందపడిపోయారు. దీంతో కాశమ్మ ఘటనా స్థలంలోనే మృతిచెందారు. కోటేశ్వరరావుకు స్వల్పగాయాలు కావడంతో 108 వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు మహిళ మృతి

త్రిపురాంతకం, ఆగస్టు 18: పిడుగుపాటుకు గురై ఓ మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని దూపాడు గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన సభినాబీ (60) మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు దూపాడు గ్రామానికి చెందిన సభినాబీ వ్యవసాయ పనులకు పొలానికి వెళ్లారు. ఈ క్రమంలో సాయంత్రం వర్షంపడే సమయంలో పిడుగులు పడ్డాయి. పిడుగుపాటుకు గురైన సభినాబీ పొలంలోనే మృతిచెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు, ట్రాలీవాహనం ఢీ - ఇరువురికి గాయాలు

మార్కాపురం రూరల్, ఆగస్టు 18: మండలంలోని నికరంపల్లి వద్ద అమరావతి-అనంతపురం జాతీయ రహదారిపై కారు-బొలెరో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బొలెరోలో ప్రయాణిస్తున్న ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. బ్రహ్మంగారిమఠం నుంచి శ్రీశైలం వెళుతున్న బొలెరో వాహనం ఆదే సమయంలో శ్రీశైలం నుంచి తిరుపతి వెళుతున్న కారు జాతీయ రహదారిపై నికరంపల్లి వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఘటనా స్థలాన్ని రూరల్ పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు.

ఎస్సైలుగా సైదాబాబు, అంకమ్మరావు




సైదాబాబు, అంకమ్మరావు

మార్కాపురం, ఆగస్టు 18: మార్కాపురం టౌన్, రూరల్ ఎస్సైలుగా ఎం.సైదాబాబు, పి.అంకమ్మరావులను నియమిస్తూ జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. పామూరు ఎస్సైగా పనిచేస్తున్న సైదాబాబును టౌన్‌స్టేషన్‌కు, దోర్నాల ఎస్సైగా పనిచేస్తున్న అంకమ్మరావును రూరల్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ టౌన్, రూరల్ ఎస్సైలుగా పనిచేస్తున్న అబ్దుల్ రెహమాన్, వెంకటేశ్వర్లునాయక్‌లను వీఆర్‌కు పంపారు.

నల్లమల ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జామ్

• గంటపాటు వాహనచోదకుల అవస్థలు

పెద్దదోర్నాల, ఆగస్టు 18: కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి నల్లమల ఘాట్ రోడ్డులో ఆదివారం వాహనాల రాకపోకలు గంటపాటు స్తంభించాయి. ఈ ఘటన మండల పరిధిలోని పిల్లల ఘాట్‌గా పిలువబడే ప్రాంతం వద్ద చోటు చేసుకొంది. కర్నూలు నుండి దోర్నాల వైపు లోడుతో వస్తున్న లారీ ఘాట్ ఎక్కలేక రోడ్డుకు అడ్డంగా తిరిగింది.దీంతో రెండు వైపులా వాహనాలు నిలిచి పోయాయి. గంట పాటు ప్రయాణికులు అవస్థలు పడ్డారు. దీంతో వాహనాల డ్రైవర్లు కలుగజేసుకుని లారీని ప్రక్కకు తొలగించారు. దాంతో వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయరూ!



పొదిలి ఆర్టీసీ డిపోలో ఉన్న ప్రయాణికులు

పొదిలి, ఆగస్టు 18 : పొదిలి ఆర్టీసీ డిపోలో గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు మరమ్మతులు గురయ్యాయని వాటిని రిపేరు చేయించి ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఆర్టీసీ డిపోలో ప్రతిరోజు ఏదో ఒక దొంగతనం జరుగుతుందని ప్రజలు, ప్రయాణీకులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు. డిపోలో తరచూ దొంగతనాలు జరుగుతున్నాయని సీసీ కెమేరాలు లేకపోవడంతో దొంగలను పట్టుకోవడం ఇబ్బందిగా మారుతుందని ప్రయాణీకులు చెబుతున్నారు. అదే సీసీ కెమెరాలు ఉంటే గత నెలలో సెల్‌ఫోన్, రెండురోజుల క్రితం కనిగిరి బస్సుకోసం వేచి ఉన్న మహిళ నగదు మాయమైన ఘటనలు ఉన్నాయి. అదే సీసీ కెమెరాలు ఉంటే దొంగలను పట్టుకునేందుకు ఒక ఆధారం ఉండేదని వారంటున్నారు. అదే విధంగా వ్యాపారులు అధిక ధరలకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని ఇదేమని అడిగితే దాడికి దిగుతున్నారని వారు విమర్శించారు. ప్రయాణీకుల ఇబ్బందులను గమనించి ఉన్నతాధికారులు డిపోలో జరుగుతున్న దొంగతనాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తేవాలని పులువురు ప్రయాణికులు కోరుతున్నారు. దీనిపై డీఎం సుందర రావును వివరణ కోరగా అధిక ధరలకు అమ్మే వారిని పరిశీలిస్తామన్నారు. అదేవిధంగా గతంలో ఒకసారి సీసీ కెమెరాలను రిపేరు చేయించామని మళ్లీ మరమ్మతులకు గురయ్యా యని పరిశీలించి రిపేరు చేసి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.

ప్రతి ఒక్కరూ సమాజసేవలో భాగస్వాములు కావాలి

మానవత స్వచ్ఛందసేవాసంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి



ఎన్నికైన నూతన కమిటీ

పొదిలి, ఆగస్టు 18 : సమాజసేవలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని మానవత స్వచ్ఛందసేవ సంస్థ వ్యవస్థాపకుడు ఎస్ రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక వాసవి కల్యాణ సదన్‌లో మాజీ అధ్యక్షుడు కల్లం సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన ద్వితీయ నూతన కమిటి ఎన్నిక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలనేదే మానవత స్వచ్ఛందసేవ సంస్థ లక్ష్యమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛందంగా సేవసంస్థ చేస్తున్న సేవలకు కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కమిటీలో ఉన్న ప్రతి ఒక్కరు కులమతాలకు అతీతంగా ఆపదలో ఉన్న ప్రజలకు సేవ చేసేందుకు ముందుండాలని కోరారు. పొదిలిలో అత్యధికంగా సభ్యులు ఉన్నారని వారుచేస్తున్న సేవలను కొనియాడారు. అదేవిధంగా నూతన కమిటీ మరింత ఉత్సాహంతో సేవలను కొనసాగించాలని ఆయన సూచించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకొని వారితో ప్రమాణం చేయించారు. అదేవిధంగా ఆటలపోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. నూతన కమిటీ చైర్మన్‌గా ముప్పల పార్థసారధి, వైస్‌చైర్మన్‌గా షేక్ నూర్జహాన్, కన్వీనర్‌గా కల్లం సుబ్బారెడ్డి, జిల్లా కన్వీనర్‌గా కే.యల్లమందారెడ్డి, అధ్యక్షుడిగా సామంతపూడి నాగేశ్వరరావు, కార్యదర్శిగా బండి అశోక్, కోశాధికారి సోమిశెట్టి చిరంజీవి, సంయుక్త కార్యదర్శి భూమా సుమంత్, వైద్యశాఖ ప్రతినిధి గూడూరి వినోద్, విద్యాశాఖ ప్రతినిధి బీవీ.రెడ్డి, మీడియా ప్రతినిధి షేక్ బాజీ, పర్యావరణ కమిటీ మేడా నరసింహారావులను ఎన్నుకున్నారు. అడ్మినిస్ట్రేటివ్ కమిటీ, శాంతి కమిటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పలువురు మానవత స్వచ్ఛంద సేవ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ ఇండస్ట్రీలో చోరీ

రూ.25 లక్షల విలువైన సామగ్రి అపహరణ



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

కొమరోలు, ఆగస్టు 18 : మండలంలోని ఇడమకల్లు క్రాస్ రోడ్డు సమీపంలోని శ్రీలక్ష్మినారాయణ ఇండస్ట్రీలో ఆదివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ప్యాక్టరీలోని 33 కేవీ 500 కిలోవాట్ కెపాసిటీ ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులోని రాగితీగను దొంగిలించారు. ఫ్యాక్టరీలోని 17 త్రీఫేస్ ఇన్‌డిగేషన్ మోటార్లును పూర్తిగా తీసుకెళ్లారు, ఫ్యాక్టరీలోని ప్యానల్ బోర్డులోని తీగలు కూడా కట్‌చేశారు, కార్యాలయంలోని రెండు టీవీలు కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. చోరీకి గురైన వస్తువుల విలువ సుమారు రూ.25లక్షలు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కంపెనీకి నెలకు ఐదు లక్షల విద్యుత్ బిల్లులు వస్తున్నందున ఆరు నెలల నుంచి ఫ్యాక్టరీని మూత వేశారు. విద్యుత్ సరఫరా కూడా పూర్తిగా నిలుపుదల చేశారు. ఫ్యాక్టరీలో విద్యుత్ లేకపోవడంతో సీసీ కెమెరాలు కూడా పనిచేయడంలేదు. ఫ్యాక్టరీలో ఇడమకల్లుకు చెందిన భార్యాభర్తలను కాపలాగా ఉంచారు. వారు శనివారం రాత్రి గ్రామంలో వారి బంధువుల వివాహానికి హాజరైన క్రమంలో ఈ చోరీ జరిగిందని పోలీసులు అభిప్రాయ పడ్డారు. ఈ మేరకు మార్కాపురం నుంచి క్లూస్‌టీం వచ్చి వేలిముద్రలు సేకరించింది. కేసు నమోదుచేసుకుని విచారిస్తున్నట్లు ఎస్సై మధుసుదన్‌రావు తెలిపారు. నిర్వాహకులు తుమ్మలపెంట వెంకట రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ రామకోటయ్య ఫ్యాక్టరీకి వెళ్లి పరిశీలించారు.

అధ్వానంగా రహదారులు



రాళ్లు తేలిన రహదారి

గిద్దలూరు, ఆగస్టు 18 : వైసీపీ ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాల రహదారుల అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో తారురోడ్లన్నీ రాళ్లుతేలాయి. ఆ రోడ్లు మట్టిరోడ్ల కంటే హీనంగా తయారయ్యాయి. రాకపోకలకు ఇబ్బందిగా తయారైంది. గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలోని గిద్దలూరు-పాములపల్లి రోడ్డు, మోడంపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయమై అధ్వానంగా తయారైంది. తారురోడ్డు చాలాభాగం రాళ్లుతేలి గుంతలమయమైంది. చిన్నపాటి వర్షం కురిసినా ఆ గుంతల్లో నీరు చేరుకొని రాకపోకలకు ఇబ్బందిగా తయారైంది. ద్విచక్ర వాహనచోదకులు గ్రామాలకు నడిచి వెళ్ళేవారు, గుంతల లోతు తెలియక కిందపడి గాయాల ఘటనలు అనేకం ఉన్నాయి. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో కనీసం వీటిని పూడ్చిన పాపాన పోలేదు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ రోడ్లన్నీ బాగుపడతాయన్న ఆశలో ఆయా గ్రామాల ప్రజలు ఉన్నారు. అధికారు లు, ప్రజాప్రతినిధులు త్వరితగతిన ఎస్టిమేషన్లు పూర్తి చేయించి గుంతలమయమైన రహదారిని బాగు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం



కల్యాణమూర్తిగా వేంకటేశ్వరుడు

మార్కాపురం వన్‌టౌన్ : గుండ్లకమ్మ నదీ తీరాన వెలసిన కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామికి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామి జన్మనక్షత్రం శ్రవణానక్షత్రం పురస్కరించుకుని అర్చకులు ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. లక్ష్మీ పద్మావతి సమేత కళ్యాణ వేంకటేశ్వరుని ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించి కల్యాణ ఘట్టాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు చెక్కా మాలకొండ నరసింహారావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

ఎర్రగొండపాలెం : మండలంలో వీరభద్రాపురం గ్రామంలో ఆదివారం జరిగిన రామాలయం ధ్వజస్తంభం ప్రతిష్ట, బొడ్డురాయి ప్రతిష్ట కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొని పూజలు చేశారు. అనంతరం గ్రామశివారులో కొత్తగా నిర్మించిన బ్రహ్మంగారి ఆలయం ప్రారంభోత్సంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, టీడీపీ నాయకులు మంత్రునాయక్, శనగా నారాయణరెడ్డి, చిట్యాల వెంగళరెడ్డి, తోట మహేష్, ఎంపీటీసీ సభ్యులు పి వెంకటనారాయణ, మేకల శ్రీను పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : మండలంలోని యడవల్లి గ్రామంలో గ్రామ కమిటి ఆధ్వర్యంలో పోలేరమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖరీఫ్ సీజను దాటిపోతున్నా వానలు కురవక వ్యవసాయ భూములు బీళ్లుగా మారడంతో అమ్మవారికి పూజలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున హాజరయి బోనాలతో దేవాలయానికి తరలివెళ్లారు. నైవేద్యాలు సమర్పించారు. కరుణించి వానలు సమృద్ధిగా కురిపించాలని, పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు.



యడవల్లిలో పోలేరమ్మకు బోనాలు తీసుకెళుతున్న మహిళలు

19 నుంచి ప్రతిష్ట మహోత్సవాలు

పెద్ద దోర్నాల : మండలంలోని కటకానిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీబాలా త్రిపుర సుందరీదేవి గంగమ్మ, పోతురాజుస్వామి, నాగేంద్రస్వామి, చెంచు దేవతల పునఃప్రతిష్ట వేడుకలను ఈనెల 19వ తేదీ నుండీ 22వరకు నిర్వహించనున్నట్లు గ్రామ కమిటి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది.

అవీ..ఇవీ..

తాగునీటికోసం మహిళల రాస్తారోకో



రోడ్డుపై నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

పెద్దారవీడు, ఆగస్టు 18: తాగునీటి కోసం మహిళలు ఆదివారం అమరావతి-అనంతరపురం జాతీయ రహదారిపై మండలంలోని గొబ్బూరు వద్ద రాస్తారోకో నిర్వహించారు. తాగుటానికి నీరు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. గతంలో మాదిరిగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. తాగడానికి నీరులేక ఇబ్బందులు పడుతుంటే అధికారులు పంటించుకోవడం లేదని వాపోయారు. నీటి సమస్య పరిష్కారానికి త్వరలో చర్యలు చేపడతామని సర్పంచ్ ఆదినారాయణ హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

వైభవంగా గాయత్రీ మహాయజ్ఞం

గిద్దలూరు, ఆగస్టు 18 : పట్టణంలోని గాయత్రీదేవి దేవాలయంలో గాయత్రి మహాయజ్ఞం అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున సామూహికంగా గాయత్రి మహాయజ్ఞంలో పాల్గొని పూజలు నిర్వహించారు. శ్రావణ పౌర్ణమి వేడుకలను మహిళలు నిర్వహించారు. లోకకళ్యాణార్థం గాయత్రి మహాయజ్ఞం నిర్వహించినట్లు గాయత్రి పరివార్ సభ్యులు తెలిపారు.

పురందేశ్వరి నియామకంపై హర్షం

గిద్దలూరు, ఆగస్టు 18 : కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలలో పార్టీని బలోపేతం చేసేందుకు, పార్టీ సభ్యత్వాన్ని పెంచేందుకు వీలుగా ఆయా రాష్ట్రాల ఇన్‌చార్జ్‌గా దగ్గుపాటి పురందేశ్వరిని నియమించడంపై బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ కూటమి రూపంలో అధికారం దిశగా నడిపించిన పురందేశ్వరి రానున్న రోజుల్లో ఈ మూడు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తారని పేర్కొన్నారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర



విశేష అలంకరణలో అమ్మవారు

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 18: మార్కాపురం పట్టణ శివారులలో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగులపుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కరాటేలో ఎంఎస్ స్పోర్ట్స్ ప్రతిభ



బహుమతులు పొందిన విద్యార్థులు

మార్కాపురం వన్ టౌన్, ఆగస్టు 18: మార్కాపురంలోని ఎంఎస్ స్పోర్ట్స్ కరాటే విద్యార్థులు చెన్నైలో జరిగిన సౌత్ కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చారు. మహితారెడ్డి బంగారు, కాంస్య పతకాలు సాధించింది. భార్గవ్ బంగారు, సాయిత్రిష కాంస్య మెడల్, షాకీర్ బాషా, యాసిన్ బాషా కాంస్య పతకాలు సాధించారు. కరాటే అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి కీర్తన, జిల్లా కార్యదర్శి మోహన్‌రావులు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎంఎస్ కరాటే స్కూల్ చీఫ్ మారంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, తోట ప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్తమ తహసీల్దార్‌కు సన్మానం

మార్కాపురం వన్ టౌన్, ఆగస్టు 18: ఉత్తమ తహసీల్దార్ అ వార్డు పొందిన కంభం తహసీల్దార్ విడుదల కిరణ్‌ను ఆదివారం స్థానిక తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చిలో సన్మానిం చారు. కార్యక్రమంలో సంఘ నాయకులు శ్యామ్యూల్, జయరావు, రామస్వామి, సంఘ కాపరి అమృత తేజ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురం సబ్‌కలెక్టర్ బదిలీ



రాహుల్‌మీనా

మార్కాపురం, ఆగస్టు 18: మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. కడప జిల్లాలో ట్రైనీ కలెక్టర్‌గా పనిచేస్తూ గత సంవత్సరం డిసెంబర్‌లో మార్కాపురం సబ్ కలెక్టర్‌గా రాహుల్‌మీనా వచ్చారు. మార్కాపురం డివిజన్‌లో పనిచేసింది కొద్దికాలమే అయినా సమర్థవంతమైన అధికారిగా గుర్తింపు పొందారు. ప్రధానంగా సార్వత్రిక ఎన్నికల సమయంలో సమర్థంగా సేవలందించి ఉత్తమ అధికారిగా ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు పొందారు. ఇటీవల జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఉత్తమ సబ్ కలెక్టర్‌గా అవార్డును పొందారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ వేడుకలు



ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 18: మండలంలో వీరభద్రాపురం గ్రామంలోని రామాలయంలో ఆదివారం ధ్వజస్తంభం ప్రతిష్ఠ, బొడ్డురాయి ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు పాల్గొని పూజలు చేశారు. అనంతరం గ్రామ శివారులో కొత్తగా నిర్మించిన బ్రహ్మంగారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో వేడుకల నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందాలి



మాట్లాడుతున్న డాక్టర్ గేయానంద్

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 18: శాస్త్రీయ దృక్పథం ద్వారానే సుస్థిర అభివృద్ధి సాధ్యమని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డా. ఎం.గేయానంద్ అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక 18వ వార్షిక మహాసభలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, సైన్సును, శాస్త్రీయ పద్ధతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు కట్టుబడి ఉండాలన్నారు. పరిశోధనలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. సమాజంలో మార్పు కోసం జేవీవీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రాష్ట్ర నాయకులు కార్యక్రమంలో జేవీవీ రాష్ట్రనాయకులు డాక్టర్ స్వరూపారెడ్డి నాయకులు డాక్టర్ శ్రీనివాసులు, దేవప్రసాద్, భాస్కర్, బాలకొండారెడ్డి, బషీరూన్ నిషాబేగం, సుబ్రహ్మణ్యాచారి, యూటీఎఫ్ నాయకులు వీరారెడ్డి, హుస్సేన్, తిరుమలయ్య పాల్గొన్నారు.

ఆకట్టుకున్న జేవీవీ మ్యాజిక్ షోలు

ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక నాయకులు చేసిన మ్యాజిక్ షోలు ఆకట్టుకున్నాయి. గాలిలో తేలే రుషి వేషధారణ, గాజుపెంకులపై నడవటం, మండుతున్న కర్పూరాన్ని మింగటం, నీళ్లతో దీపాలు వెలిగించడం ప్రదర్శనల ద్వారా వీటి వెనుక ఉన్న సైన్సు సూత్రాలను వివరించారు.

ఆటో బోల్తా.. ఒకరు మృతి


బోల్తాపడిన ఆటో

దర్శి, ఆగస్టు 18: ఆటో బోల్తాపడి మహిళ మృతి చెందారు. ఈఘటన ఆదివారం ఉదయం మండలంలోని రామచంద్రాపురంలో చోటుచేసుకుంది. జముకులదిన్నె గ్రామానికి చెందిన 16 మంది కూలీ పనుల కోసం ఆటోలో రామచంద్రాపురం వెళ్తున్నారు. ఈక్రమంలో రామచంద్రాపురం గ్రామ సమీపంలో మలుపువద్ద బ్రేక్ వేసేందుకు డ్రైవర్ యత్నించారు. అయితే, బ్రేక్ కింద పొరపాటున అన్నం క్యారేజీ పడటంతో బ్రేక్ పడలేదు. దీంతో వేగంగా వెళ్తున్న ఆటో మలుపు వద్ద బోల్తా పడింది. వీరిలో 12 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను 108 ద్వారా దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ముగ్గురిని మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలుకు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ నాగేంద్రం అనే మహిళ మృతిచెందారు. మిగిలినవారు దర్శిలో వైద్యం పొందుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు


బాధ్యతలు చేపట్టిన మురళి

దర్శి, ఆగస్టు 18: దర్శి నూతన ఎస్ఐగా ఎం.మురళీ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. చీరాలలో పనిచేస్తున్న ఆయన దర్శికి బదిలీ అయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పేకాట, బెట్టింగులు, తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈవ్‌టీజింగ్‌ను ఉక్కుపాదంతో అణిచి వేస్తామన్నారు. దర్శి పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు.

ముండ్లమూరు ఎస్ఐ బదిలీ

ముండ్లమూరు, ఆగస్టు 18: స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న వి.నాగమల్లేశ్వరరావు టంగుటూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఒంగోలు డీసీఆర్‌బీలో పనిచేస్తున్న వై.నాగరాజు నియమితులయ్యారు.

పామూరు ఎస్ఐ మార్కాపురానికి..

పామూరు, ఆగస్టు 18: పామూరు ఎస్ఐ ఎం.సైదుబాబును బదిలీ చేస్తు జిల్లా ఎస్పీ దామోదర్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ఎన్నికల అనంతరం సాధారణ బదిలీల్లో భాగంగా సైదుబాబును మార్కాపురం టౌన్‌కు బదిలీచేశారు. పామూరు సీఐ, ఎస్ఐలు బదిలీలు కావడంతో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

మానవత్వం చాటుకున్న ఎస్ఐ

ముండ్లమూరు, ఆగస్టు 18: మండలంలోని వేముల గ్రామానికి చెందిన షేక్ మౌలాబీ శనివారం రమణారెడ్డిపాలెంలో వద్ద జరిగిన ఆటో ప్రమాదంలో మృతి చెందారు. పది సంవత్సరాల క్రితం ఆమె భర్త కాలేషా మృతి చెందారు. వీరికి ఫరీద్, కరిష్మా అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలయ్యారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వి.నాగమల్లేశ్వరరావు ఆ చిన్నారులను చూసి చలించిపోయారు. మౌలాబీ కుమారుడు ఫరీద్‌కు రూ.10 వేలు సాయం చేశారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

కనిగిరి ఆగస్టు 18: మండలంలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన బొనం బాబ్జి (42) అనే వ్యక్తి ఆదివారం మృతిచెందారు. ఎస్ఐ త్యాగరాజు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పామూరు రోడ్డులోని బార్ అండ్ రెస్టారెంట్‌లో ఆయన హోటల్ నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి 8గంటల ప్రాంతంలో కుమారుడిని హోటల్ ఉంచి బయటికి వెళ్ళాడు. పొదిలి రోడ్డులోని పొగాకు బోర్డు వెనుక పొలాల్లో స్పృహ తప్పి పడిపోయి ఉండటంతో ఆప్రాంతంలో నివసించే గిరిజనులు గమనించి బంధువులకు సమాచారం అందించారు. స్థానికుల సాయంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందిస్తుండగా అధిక రక్తపోటుతో మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి గతంలోనే నరాల సంబంధించిన వ్యాధి కారణంగా తలకు ఆపరేషన్ నిర్వహించినట్లు బంధువులు తెలిపారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

'రక్షా'నుబంధం

» సోదరీసోదరుల ప్రేమకు ప్రతిరూపం » నేడు రాఖీపౌర్ణమి

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 18: హిందూ సంప్రదాయ పండుగల్లో ప్రకృతి శక్తులు, దేవతల అనుగ్రహం, ఆధ్యాత్మిక దృక్పథంతో పాటు ఆత్మీయాను రాగాలకు ఎంతో పెద్దపీట వేశారు. వీటన్నింటి కలయికతో శ్రావణమాసంలో వచ్చేటువంటి పౌర్ణమి రోజును తరతమ భేదం లేకుండా ప్రతి ఒక్కరూ ఎంతో ఆనందంగా, ఆత్మీయంగా జరుపుకునే పండుగ రాఖీపౌర్ణమి. దీన్నే 'రక్షాబంధన్' అని కూడా పిలుస్తుంటాం. అన్నా చెల్లెళ్ళ, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ పండుగ. సోదరుల చేతికి రాఖీ కట్టి, వారు చేపట్టే ప్రతి పని విజయవంతం కావాలని సోదరి ఆశిస్తుంది. అదేవిధంగా తన విజయాన్ని కాంక్షించే సోదరికి తాను అన్ని వేళలా రక్షగా నిలుస్తానని సోదరుడు తన ప్రేమను చాటుకుంటూ జరుపుకునే ప్రేమానుబంధాల ముడి ఈ రాఖీలో ఉంది.

అన్నదమ్ములు లేనివారు కూడా తాము సోదరులుగా భావించే వ్యక్తులకు రాఖీని కడతారు. అన్నయ్య కలలు పండాలన్నా.. చెల్లాయి మనసు నిండాలన్నా అది స్వచ్ఛమైన ప్రేమతో కూడిన 'రక్షాబంధన్'కే సాధ్యం. ఆడపిల్లకు తండ్రి తర్వాత అంతటి రక్షణగా నిలిచే వ్యక్తి సోదరుడు. అందుకే తన సోదరుడు ఉన్నతస్థితిలో ఉండాలని ప్రతి సోదరి ఆకాంక్షిస్తుంది. తండ్రి ఉన్నా లేకపోయినా పుట్టినింటి ప్రేమను పంచే వ్యక్తి సోదరుడు. ఆ సోదరుడి క్షేమాన్ని, ఉన్నతిని కోరుకుంటూ సోదరుని చేతికి రక్షను సోదరి కడితే, ఆ రక్ష కట్టిన సోదరికి జీవితాంతం రక్షణగా నిలుస్తానని, తన సోదరి జీవితం తియ్యగా సాగిపోవాలని ప్రేమతో మిఠాయి తినిపిస్తాడు సోదరుడు. ఈ అద్భుత అనురాగ ఘట్టానికి సాక్షీభూతంగా నిలిచేదే రాఖీపండుగ.

రక్షాబంధన్

రక్షాబంధన్‌గా పిలుచుకునే రాఖీపండుగ ఈనాటిది కాదు. ఇది యుగయుగాలుగా వస్తున్న పవిత్రమైన పర్వదినం. ఒకనాడు దేవతలందరూ దేవేంద్రుడి చేతికి కట్టిన రక్షతో అతనిలో సమరోత్సాహం కలిగి రాక్షసరాజును సంహరిస్తాడు. అదేవిధంగా ద్వాపరయుగంలో ద్రౌపది తన సోదరుడైన శ్రీకృష్ణుని చేతికి రక్షను కడుతుంది. దుర్యోధనుని అహంకారంతో దుశ్శాసనుడు ద్రౌపది వస్త్రాపహరణానికి పూనుకున్నప్పుడు ఆమెను శ్రీకృష్ణుడు అభయమిచ్చి కాపాడి ఈ జగతిలో అన్నాచెల్లెళ్ల బంధం ఎంతగొప్పదో చాటిచెబుతాడు. అలాగే, బలిచక్రవర్తి చేతికి శ్రీమహాలక్ష్మి రక్ష కట్టి, పాతాళంలో ఉండిపోయిన తన భర్త శ్రీమహావిష్ణువును వైకుంఠానికి తీసుకెళ్తుంది. అందుకే రాఖీపండుగ రోజున సోదరి సోదరుని చేతికి రాఖీ కట్టేటప్పుడు 'యేన బద్ధో బలీ రాజా దానవేంద్రో మహాబలః తేన త్వా మభిబధ్నామి రక్షే మా చల మా చల' అని చదువుతూ కట్టాలంటారు. ఇక చరిత్రపరంగా చూసినపుడు ఈ రాఖీకి ఎంతో ప్రాధాన్యం ఉంది. అలెగ్జాండర్ మహాచక్రవర్తి భార్య రోక్సానా, తక్షశిల రాజైన పురుషోత్తముడిని తన సోదరునిగా భావించి రాఖి పంపుతుంది. జీలం, చినాబ్ నదుల మధ్య ఉన్న దేశాలపై దండయాత్ర చేస్తున్న అలెగ్జాండర్, పురుషోత్తముడికి చిక్కినప్పటికి సోదరిసమానురాలైన రోక్సానా కోరిక మీద అతను అలెగ్జాండర్‌ను విడిచిపెడతాడు. ఆవిధంగా అలెగ్జాండర్‌ను కాపాడింది కూడా ఈ రాఖీనే. ఈ రాఖీకి యుగయుగాలుగా ఎంతో ప్రాధాన్యం ఉంది.

కాలానికి అతీతంగా..

కాలం మారేకొద్ది కొన్ని సంప్రదాయాలు, పండుగలు ప్రాధాన్యతను కోల్పోతాయి. రాఖీపండుగ మాత్రం ఆధునిక కాలంలో మరింత విశిష్టతను సంతరించుకుందని చెప్పొచ్చు. ఒకప్పుడు కేవలం ఉత్తర భారతదేశంలోనే జరుపుకునే ఈ అన్నాచెల్లెళ్ల పండుగ గత కొన్ని దశాబ్దాలుగా మనదగ్గర ఎంతో ఘనంగా జరుపుకుంటున్నారు. గతంలో గ్రామాల్లో ఉమ్మడికుటుంబ వ్యవస్థ ఉన్నప్పుడు అన్నాచెల్లెళ్లు ఒకేచోట ఉండేవారు. ప్రస్తుతం పరిస్థితులు మారాయి. చెరొకచోట ఉద్యోగాలు, చదువుల్లో ఉంటున్నారు. అయినప్పటికీ వారు ఈ రాఖీపండుగను ఘనంగా జరుపుకుంటున్నారు.

జంధ్యాల పౌర్ణమి

శ్రావణ పౌర్ణమి కేవలం సోదరీసోదరుల అనురాగ బంధానికి చిహ్నంగా మాత్రమే కాకుండా వేద పరిరక్షణను గుర్తుచేసే ఒక పవిత్రదినంగా కూడా పురాణాల్లో చెప్పబడింది. ఈ శ్రావణపౌర్ణమి రోజునే వేదాధ్యయనం, వేదపఠనం వంటి కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. శ్రావణమాసానికి ముందు 'ఉపనయనం' అయిన వారు రోజున ముంజవిడుపు అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

రాఖీపౌర్ణమి సందర్భంగా గత నాలుగైదు రోజులుగా దుకాణాలు కళకళలాడుతున్నాయి. వివిధ రకాల స్వీట్లు కొనేందుకు సైతం ప్రజలు పెద్దసంఖ్యలో ఆసక్తి చూపుతున్నారు.

ఆలయ భూములకు రక్షణ కరువు

» రూ.వంద కోట్లకుపైగా ఆస్తుల ఆక్రమణ
» పట్టించుకోని అధికారులు
» యథేచ్ఛగా భూముల అన్యాక్రాంతం


భజంత్రీల మాన్యంలో వేసిన లేఔట్లు

పామూరు, ఆగస్టు 18: దేవుడి భూములకు రక్షణ కరువైంది. యథేచ్ఛగా భూములను ఆక్రమించుకొని రికార్డుల్లో పేర్లు మార్చుకొని సొమ్ము చేసుకొంటున్నారు. పామూరులోని మదనవేణుగోపాల స్వామి దేవస్థానానికి సంబంధించిన కోట్లాది రూపాయల విలువ కలిగిన భూములు ఈపాటికే ఆక్రమణకు గురయ్యాయి. వాటిల్లో పక్కా భవనాలతోపాటు, వెంచర్లు వేశారు. తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటూ రెవెన్యూ, ఎండోమెంట్ అధికారులు మమ అనిపిస్తున్నారు.


సర్వేనెంబర్ 176/2లో ఆక్రమించి ప్లాట్లకు ఏర్పాటు చేసిన రహదారి

పామూరులోని శ్రీమదనవేణుగోపాలస్వామి, శ్రీవల్లీ భుజంగేశ్వరస్వామి, వరదరాజులస్వామి, ఆంజనేయ స్వామి దేవస్థానాలకు చెందిన సుమారు 395 ఎకరాల భూములు, ఉన్నాయి. అందులో ఇప్పటివరకు వివిధ రూపాల్లో 75 ఎకరాలకు పైగా ఆక్రమణలకు గురయ్యాయి. ఆక్రమణకు గురైన భూముల విలువ మార్కెట్‌లో రూ.వంద కోట్లకు పైగా ఉంటుంది. కొందరు ఆక్రమణదారులు తప్పుడు పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. పామూరు రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 176/2లో 13.80 ఎకరాల భూములు ఉన్నాయి. అందులో ఒకటిన్నర ఎకరా భూమిని ఓ ప్రయివేట్ వెంచర్ సంస్థ ఆక్రమించి రహదారి ఏర్పాటుచేసుకున్నారు. ఇక్కడ ఎకరా భూమి విలువ రూ.2 కోట్లకు పైగా ఉంది. సర్వే నెంబర్ 329/2లో 2.41 ఎకరాల భూమిలోను ఎకరా భూమిని ఆక్రమించి ప్లాట్లు వేసి సొమ్ము చేసుకొన్నారు. మరి కొందరు కట్టడాలు నిర్మించుకొన్నారు. సర్వే నెంబర్ 439/5లో 1.97 ఎకరాల భూమిలో ప్లాట్లు వేశారు.

వేణుగోపాలస్వామి ఆలయానికి సంబంధించి నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం వేంపాడు రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 78/1లో ఉన్న 6.06 ఎకరాల భూమి అర్చకుల దగ్గర కొనుగోలు చేశామంటూ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. జాతీయ రహదారికి పక్కనే ఉన్న ఈ భూమి విలువ రూ.20 కోట్లు ఉంటుంది. ఈ భూమికి కమిటీతో సంబంధం లేకుండా అర్చకులు తమకు విక్రయించినట్లు అధికారులను లోబరుచుకొని బినామీ రికార్డులు సృష్టించి 2016లో రిజిస్ట్రేషన్ చేయించుకొన్నారు.

దేవస్థాన అధికారులు తమకు ఎన్‌వోసీ ఇచ్చేందుకు సహకరించడం లేదని పట్టాలు పొందినారు గతేడాది జూన్ 2న జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో అప్రమత్తమైన ఎండోమెంట్ అధికారులు విచారణ చేపట్టి పట్టాలు పొందిన వ్యక్తుల పేర్లు తొలగించి ఆలయ భూమిగా నమోదు చేయాలని అక్టోబర్ 26న తీర్పు ఇచ్చారు. దాంతో స్థానిక అధికారులు ఆ భూమిలో బోర్డులు ఏర్పాటుచేశారు.


వల్లీ భుజంగేశ్వరస్వామి ఆలయం

వల్లీ భుజంగేశ్వర దేవస్థానానికి సంబంధించి సర్వే నెంబర్ 438/2లో 7.66 ఎకరాల భూములు ఉన్నాయి. వీటిలో ఆక్రమణదారులు జామాయిల్ తోటలు సాగు చేస్తున్నారు. పామూరు కొత్త చెరువు వెనుక భాగం జాతీయ రహదారికి పక్కన సర్వే నెంబర్ 399/6లో 1.55 ఎకరాల విలువైన భూమిపై ఆక్రమణదారులు కన్నేశారు. తప్పుడు పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకొని వెబ్‌ల్యాండ్‌లో పేర్లు నమోదు చేసుకున్నారు. ఎఫ్ఎల్ఆర్‌లో మాత్రం భజింత్రీల మాన్యంగా నమోదై ఉంది. దీని విలువ మార్కెట్‌లో రూ.4 కోట్లకు పైగా ఉంది. ప్రస్తుతం ఆక్రమణ దారులు లేఅవుట్ వేసి అమ్మకాలు జరుపుతున్నారు. 256/2, 256/1, 441లో 1,2,3, 442 1,2,3, లోని భూములు ఆక్రమణదారుల చెరలో ఉన్నాయి.

ఇప్పటికైనా సంబంధిత శాఖ జిల్లా అధికారులు స్పందించి దేవస్థాన భూములను 22ఏ1సి రిజిస్ట్రేషన్ చట్టం 1908లోని నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్పించి రక్షణ చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

డంపింగ్ యార్డులుగా రహదారులు

» చోద్యం చూస్తున్న పంచాయతీ కార్యదర్శులు
» ఇబ్బందులు పడుతున్న ప్రజలు


ముండ్లమూరు నుంచి తమ్మలూరు వెళ్ళే ప్రధాన రహదారి పక్కన పారబోసిన వ్యర్థపదార్థాలు

ముండ్లమూరు, ఆగస్టు 18: మండల కేంద్రమైన ముండ్లమూరుతో పాటు పలు గ్రామాల్లో ప్రధాన రహదారులు డంపింగ్ యార్డులుగా మారాయి. రహదారుల మీదనే చెత్తాచెదారం పడవేస్తుండటంతో దుర్వాసన భరించలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టించు కోవాల్సిన పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు ఆవైపు దృష్టి సారించాల్సిన దాఖలాలు లేవు. దీంతో వ్యాధులు ప్రబలుతాయామోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పేరుకే ప్రతి పంచాయతీలో డంపింగ్ యార్డు ఉంది. అవి నిరుపయోగంగా మారిపోయాయి. గ్రామంలో చెత్తాచెదారం అంతా రోడ్ల వద్ద పడవేస్తున్నారు. దీంతో వీధి కుక్కలు వ్యర్థపదార్థాలను రోడ్ల పైకి తీసుకురావటంతో ఆటువైపు వెళ్ళేవారు ముక్కు మూసు కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ముండ్లమూరు నుంచి తమ్మలూరు వెళ్ళే ప్రధాన రహదారి, పసుపుగల్లులోని ఎస్సీ కాలనీ సమీపంలో, శంకరాపురంలో రోడ్డుకు ఇరువైపులా, వేంపాడులో రోడ్డుకు ఇరువైపులా, పెద ఉల్లగల్లు నుంచి కెల్లంపల్లి వెళ్ళే ప్రధాన రహదారి పక్కన, ఉమామహేశ్వర అగ్రహారం, మారెళ్ళ నుంచి జమ్మలమడక వెళ్ళే ప్రధాన రహదారి పక్కన వ్యర్థ పదార్థాలను పడవేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రీన్ అంబాసిడర్లను నియమించింది. వారికి నెలల తరబడి జీతాలు ఇవ్వలేక పోవటంతో పలు గ్రామ పంచాయతీల్లో మానుకున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారుల మీదఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి, అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా ఆరోగ్యకేంద్రం రహదారి

» పట్టించుకోని పాలకులు
» ప్రజలకు తప్పని పాట్లు


కొద్దిపాటి వర్షానికే బురదమయమైన ఆరోగ్యకేంద్రానికి వెళ్లే రహదారి

దొనకొండ, ఆగస్టు 18: దొనకొండలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లే రహదారి కొద్దిపాటి వర్షానికే బురదమయమై అధ్వానంగా మారుతుంది. ఈ మట్టి రోడ్డులో వర్షం కురిసిన కొద్దిరోజుల వరకు అడుగుతీసి అడుగు వేసేందుకు, వాహనాలపై రాకపోకలు జరుపుకునేందుకు ప్రజలు, ఆరోగ్యసిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిమెంట్ రోడ్డు సిమెంట్ రోడ్డు వేయాలంటూ గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులను ప్రజలు, వైద్య సిబ్బంది ఎన్నోసార్లు విన్నవించుకున్నారు. పట్టించుకున్ననాథుడే లేకపోవటంతో ప్రజలు, సిబ్బంది ఇబ్బందులు పడుతూనే రాకపోకలు జరుపుకుంటున్నారు. ఎన్నోసార్లు పలువురు బురదలో జారిపడి గాయాలపాలైన సంఘటనలు చోటుచేసుకున్నాయి.

మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజలు, ఆరోగ్యకేంద్రంలో విధులు నిర్వహించే సిబ్బంది, బాదాపురం, రామిరెడ్డిపల్లి, పోలేపల్లి తదితర గ్రామాలకు చెందిన ప్రజలు దొనకొండకు ఈ రహదారిపైనే ప్రతినిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం ప్రతిరోజు కురుస్తున్న కొద్దిపాటి వర్షానికి రహదారి బురదమయమై అధ్వానంగా మారింది. టీడీపీ కూటమి ప్రభుత్వ పాలకులైనా ఈ రహదారి దుస్థితి గుర్తించి సిమెంట్‌రోడ్డు నిర్మాణం జరిగేలా చర్యలు చేపట్టి తమ ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ

పామూరు, ఆగస్టు 18: మండలంలోని దూబగుంట గ్రామంలో వెలసి యున్న పోలేరమ్మ తిరుణాళ్ల వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఈసందర్భంగా మహిళలు అమ్మవారికి పొంగళ్లు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. వర్షాలు సంవృద్ధిగా కురిసి పాడిపంటలతో గ్రామాలు కళకళలాడాలని పూజలు చేశారు. అనంతరం శాంతి పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, మన్నం రమణయ్య, పువ్వాడి రామారావు, గుంటుపల్లి శ్రీనివాసులు, ఉపసర్పంచ్ కందుల శ్రీనివాసులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తమ్మలూరులో అమ్మవారికి పొంగళ్లు

ముండ్లమూరు, ఆగస్టు 18: మండలంలోని తమ్మలూరులో గ్రామ దేవత పోలేరమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం పొంగళ్ళు పెట్టి నైవేద్యంగా అమ్మవారికి సమర్పించారు. తమ పిల్లా పాపలను చల్లంగా చూడాలంటూ వేడుకున్నారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

ఘనంగా ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు

పామూరు, ఆగస్టు 18: మండలంలోని ఇనిమెర్ల గ్రామంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. గురువారం వరకు వేడుకలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. తొలిరోజు కలశ స్థాపన, అగ్నిప్రతిష్ఠ హోమాలు నిర్వహించారు. సాయంత్రం, విష్ణు సహస్రనామ పారాయణం, పూజలు నిర్వహించారు. ఐదురోజుల పాటు భక్తులకు అన్నదాన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బోడవాడలో గ్రామోత్సవం

పామూరు, ఆగస్టు 18: మండలంలోని బోడవాడలో ఆదివారం పోలేరమ్మ తల్లికి గ్రామస్థులు పొంగళ్లను నైవేద్యంగా పెట్టి మొక్కుబడులు చెల్లించుకొన్నారు. ఈసందర్భంగా మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. పాడి పంటలతో గ్రామాలు కళకళలాడాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి అనుగ్రహం గ్రామంపై ఉండాలంటూ శాంతి పూజలు నిర్వహించారు.

నారాయణ స్వామి దేవస్థానంలో పూజలు

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 18: సీఎస్‌పురం మండలం మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పామూరుకు చెందిన టీడీపీ నాయకుడు యారవ శ్రీనివాసులు తన మిత్రబృందంతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కొప్పల్లి సురేష్, తిరివీధి జనార్దనరావు, పిడుగు శ్రీనివాసులు, ధనేంకుల రవి, వాయినేని రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపాలెంలో నాగార్పమ్మ తల్లి కొలుపులు


నాగార్పమ్మకు పూజలు చేస్తున్న ఎంపీపీ తాటికొండ

తాళ్లూరు, ఆగస్టు 18 : మండలంలోని తాళ్లూరు పంచాయతీ కొత్తపాలెంలో పునఃప్రతిష్ఠించిన నాగార్పమ్మ కొలుపులు ఆదివారం ఘనంగా జరిగాయి. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరిగాయి. ఆదివారం నాగార్పమ్మకు భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకోవటంతో కొలుపులు ముగిశాయి. సుదూరప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. నాగార్పమ్మ కొలుపుల్లో ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మండల రజక సంఘం నేత కురిచేటి శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం


విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి ఆగస్టు 18: వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ గఫార్ అన్నారు. పట్టణంలోని జూనియర్ కళాశాలలో ఉన్న బాలికల సమీకృత హాస్టల్‌ను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఆయన పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. మంచినీటి సౌకర్యం గురించి ఆరా తీశారు. హాస్టల్ గదులను శుభ్రంగా ఉంచటంపై ఆయన విద్యార్థినులతో మాట్లాడారు. ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి హాస్టల్‌ను బాగు చేయించి తమ ఇబ్బందులను తీర్చారని తెలిపారు. మంచినీటి వసతి కూడా కల్పించా రన్నారు. బాగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని విద్యార్థినులకు చైర్మన్ గఫార్ సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, వార్డెన్ ఎస్.జయలలిత పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు, ఆగస్టు 18: సోమవరప్పాడుపరిధిలోని గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గంగాభవానీ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి కరుణించమని వేడుకున్నారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెందిన భక్తులతోపాటు వివిధప్రాంతాల నుంచి మొక్కులు తీర్చుకునేందుకు రావటంతో ఆప్రాంతం సందడిగా మారింది. చల్లంగ చూడమ్మ గంగమ్మ తల్లి అంటూ వేడుకున్నారు. ఆలయబ్రాహ్మణ అర్చకులు ఎస్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్ పంతులు, బాలరాజు అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో పి.కార్తిక్, ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.


కాగా, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గుంటి గంగమ్మ తల్లిని ఆదివారం దర్శించున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ పూజారులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా నాగభైరవ సాహిత్య పురస్కార సభ

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 18: నాగభైరవ సాహిత్యపీఠం ప్రతి ఏడాది డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు పేరిట అందిస్తున్న సాహిత్య పురస్కార ప్రదాన సభ ఆదివారం స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో ఘనంగా జరిగింది. సాహిత్యపీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) మాట్లాడుతూ నాగభైరవ కోటేశ్వరరావు ఎంతో మందిని సాహిత్యరంగంలో తీర్చిదిద్దారన్నారు. అటువంటి మహనీయుని పేరిట పురస్కారాలు అందజేయటం అభినందనీయమన్నారు. నాగభైరవ కోటేశ్వరరావు మంచి మనసున్న కవి అని, తన లాంటి ఎందరినో సాహిత్యరంగంలో ప్రోత్సహించారని తేళ్ల అరుణ పేర్కొన్నారు. ఈసందర్భంగా సాహిత్యపురస్కారాల ప్రథమ బహుమతిని పూలపూల వాన రచయిత ఏనుగు నరసింహారెడ్డికి, ద్వితీయ బహుమతిని మణిపూసలు రచయిత డాక్టర్ వూటుకూరి వరప్రసాద్‌కు, కళాపురస్కారాలను నాటక సినీ రచయిత వై.కృష్ణేశ్వరరావుకు, ఆత్మీయ పురస్కారాన్ని డాక్టర్ బీరం సుందరరావుకు అందజేశారు. కార్యక్రమంలో గుత్తికొండ సుబ్బారావు, డాక్టర్ నూనె అంకమ్మరావు, కుర్రా ప్రసాద్‌బాబు, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, గుళ్లపల్లి సుబ్బారావు, జక్కంపూడి సీతారామారావు, డాక్టర్ సింగారావు, సింహాద్రి జ్యోతిర్మయి, బెజవాడ వెంకట్రావు, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, డాక్టర్ నాగభైరవ ఆంజనేయులు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.


ఉపాధి పనులను ప్రారంభించాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 18: గత రెండునెలలుగా నిలిచిపోయిన ఉపాధి హామీ పథకం పనులను ప్రారంభించి గ్రామీణ పేదలను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు కోరారు. ఆదివారం రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామిని స్వగ్రామం తూర్పునాయుడు పాలెంలో కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన మంత్రి డాక్టర్ స్వామి మాట్లాడుతూ నిలిచిపోయిన ఉపాధి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సోమవారం నుంచి విస్తృతంగా పనులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, నాయకులు కేజీ.మస్తాన్, వి.మోజేష్ పాల్గొన్నారు.



బదిలీల.. సందడి

- నేటి నుంచి అమల్లోకి ప్రక్రియ
- కోరుకున్న చోటు కోసం జోరుగా పైరవీలు
- ఎమ్మెల్యేల ఆశీస్సులు ఉంటేనే పోస్టింగ్‌లని ప్రచారం
- కూటమి నేతల ద్వారా లేఖల కోసం ఉద్యోగుల ప్రయత్నాలు
- కొందరు ఎమ్మెల్యేలు ఇప్పటికే భారీగా లేఖలు జారీ చేసినట్లు సమాచారం
- వైసీపీతో అంటకాగిన వారి జాబితాలు సిద్ధం చేస్తున్న టీడీపీ నేతలు



కూటమి అధికారం చేపట్టి రెండు నెలలు దాటగా.. బదిలీలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇప్పటికే ఐఏఎస్, ఐపీఎస్‌లతో పాటు కొన్ని స్టేషన్లలో డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐల స్థాయి వరకు బదిలీలు చేసింది. ఈ క్రమం లో అందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోన్న మిగిలిన ప్రభుత్వ శాఖల్లో వివిధ స్థాయిల్లోని ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం సిద్ధమైంది. బదిలీలకు సంబంధించి మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నెల చివరి వరకు కూడా బదిలీలపై నిషేధాన్ని ప్రభుత్వం తొలగించింది. దీంతో సోమ వారం నుంచి బదిలీల సందడి మొదలుకానున్నది. 15 శాఖల్లో అధికారులు, ఉద్యోగుల బదిలీలు జరగ నున్నాయి. బదిలీలకు ఎమ్మెల్యేల లేఖ తప్పని సరి అన్న ప్రచారంతో ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు ఎవరిస్థాయిలో వారు ప్రయ త్నాలు మొదలుపెట్టారు. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలు కొందరికి సిఫార్సు లేఖలు ఇవ్వగా మిగిలిన వారు కూటమి నేతల ద్వారా ఎమ్మెల్యేలపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నా ల్లో నిమగ్నమ య్యారు. అదేవిధంగా గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతలతో అంటకాగి వారు చెప్పినట్లు చేసి.. వారి అక్రమాలకు సహకరించిన అధికారులు, ఉద్యోగుల జాబితాలను టీడీపీ నేతలు సిద్ధం చేసి బదిలీల్లో వారికి ప్రాధాన్యం లేకుండా చేసేందుకు సిద్ధమవుతున్నారని తెలిసింది.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వైసీపీ ఓడిపోయింది.. కూటమికి ప్రజలు అధికారం ఇచ్చారు.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా రెండు నెలల క్రితం బాధ్యతలు చేపట్టారు. వైసీపీ ప్రభుత్వంలో కొందరు అధికారులు, ఉద్యోగుల తీరుతో పలువురు ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితుల్లో అలా ఇబ్బందులు పడిన వారితో పాటు కూటమి నేతలు కూడా అధికారులు, ఉద్యోగుల బదిలీ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఎట్టకేలకు ప్రభుత్వం బదిలీల ప్రక్రియను సోమవారం నుంచి అమలు చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ఈ నెల 31 వరకు బదిలీల ప్రక్రియ జరగనున్నది. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో బదిలీలకు రంగం సిద్ధమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే బదిలీలు ఉంటాయని ఉద్యోగులు, అధికారులు భావించారు. అయితే ప్రభుత్వం కుదురుకున్న తర్వాత కింది స్థాయిలో బదిలీలు ప్రక్రియ మొదలు పెట్టాలని పాలకులు నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే రెండు నెలల తర్వాత బదిలీల ప్రక్రియకు ప్రభుత్వం ఆమోదం తెలిపి మార్గదర్శకాలను జారీ చేసింది. ఎన్నికల విధుల్లో భాగంగా ఇతర జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు ఇప్పటికే జిల్లాలకు రాగా వారికి పోస్టింగ్‌లు ఇచ్చారు. రెవెన్యూ శాఖలో డీటీ, ఆర్‌ఐలు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, వీఆర్వోల బదిలీలు మిగిలాయి. వీఆర్వోల సంఖ్య వందల్లోనే ఉంది. పొరుగు జిల్లాలకు వెళ్లిన ఎంపీడీవోలు ఇటీవలే జిల్లాలకు చేరుకున్నారు. వివిధ మండలాలకు వారిని కేటాయించగా వారు విధుల్లో చేరారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. వీరందరికీ స్థానచలనాలు తప్పేలా లేవు. గ్రామాల్లో కీలకంగా వ్యవహరించే వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శుల బదిలీలపై గ్రామ స్థాయిలో టీడీపీ నేతలు ప్రత్యేక దృష్టి సారించారు. వైసీపీతో అంటకాగిన ఉద్యోగుల జాబితాలను సిద్ధం చేశారు. దీంతో సదరు ఉద్యోగులు కంగుతింటున్నారు. పోలీసు శాఖలో సీఐ, ఎస్‌ఐల బదిలీలు కొంత మేర పూర్తి చేశారు. ఏఎస్‌ఐలు, కానిస్టేబుళ్ల బదిలీలు కూడా పెద్ద ఎత్తును జరగనున్నాయి. కొన్ని చోట్ల సీఐ, ఎస్‌ఐల బదిలీలు చేయాల్సి ఉంది.

అధికారుల లాబీయింగ్‌లు..

పలువురు అధికారులు, ఉద్యోగులు కోరుకున్న చోటకు బదిలీ అయ్యేలా ఎవరి ప్రయత్నాల్లో వారు నిమగ్నమయ్యారు. బదిలీలకు ఎమ్మెల్యేల లేఖ తప్పని సరి అన్న ప్రచారం జరుగుతోంది. దీంతో వారి లేఖలు పొందేందుకు అధికారులు లాబీయింగ్ చేసుకుంటున్నారు. ఇందుకోసం ప్రజాప్రతినిధుల ఇళ్లకు క్యూ కడుతున్నారు. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలు బదిలీల సిఫార్సు లేఖలు పెద్దఎత్తున జారీ చేశారని సమాచారం. కొందరు అధికారులు అనుకూల పోస్టింగ్‌లకు సిఫార్సు లేఖల కోసం టీడీపీ నేతల ద్వారా ఎమ్మెల్యేలపై ఒత్తిడి తెస్తున్నారు. నాలుగైదు రోజుల్లో సిఫార్సుల లేఖ జారీ ప్రక్రియ పూర్తవుతుందని టీడీపీ నేతలు చెబుతున్నారు. వైసీపీ నేతలతో కలిసి పనిచేసిన అధికారులకు కూడా కొన్ని చోట్ల వారు కోరుకున్న చోట పోస్టింగ్ కోసం లేఖలు జారీ చేశారన్న విమర్శలు టీడీపీ వర్గాల నుంచి వస్తున్నాయి.

అక్రమాలపైనా నేతల దృష్టి..

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని వివిధ శాఖలకు చెందిన ఇంజనీరింగ్ విభాగాల్లోని కొందరు ఉద్యోగులు, అధికారులు ఇష్టారాజ్యంగా చెలరేగారు. వైసీపీ నేతల అవినీతికి పూర్తి స్థాయిలో సహకరించారు. ఈ ఫిర్యాదులపై ఇప్పటికే కూటమి నేతలు ఫిర్యాదులు చేశారు. కొన్ని చోట్ల అక్రమాలకు పాల్పడిన ఇంజనీర్లపై విజిలెన్స్ విచారణ జరపాలని టీడీపీ నేతలు సదరు శాఖల ఉన్నతాధికారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో విజిలెన్స్ విచారణ తప్పదని ఆయా అధికారులు, ఉద్యోగులకు భయం పట్టుకుంది. కొందరు ఇంజనీర్ల అవినీతి, అక్రమాల చిట్టాను ఇప్పటికే విజిలెన్స్ అధికారులకు అందించారు. టిడ్కోలో పొరుగు జిల్లాల్లో విజిలెన్స్ విచారణ జరుగుతోంది. మున్సిపాల్టీలను కొందరు వైసీపీ నేతలు జేబు సంస్థలుగా వాడుకున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పలు మున్సిపాల్టీల్లో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయి. రూ.కోట్లలో నిధులు స్వాహా చేశారు. పచ్చదనం మాటున నిధులు కాజేశారు. సీ బిల్లుల పేరుతో పెద్దఎత్తున నిధులను గోల్‌మాల్ చేశారు. మున్సిపాల్టీలపై కూడా విజిలెన్స్ విచారణ జరుగుతుందన్న ప్రచారంతో సదరు అధికారులు బదిలీలపై వెళ్లే పనిలో ఉన్నారు. సచివాలయ కార్యదర్శులకు కూడా స్థానచలనం ఉన్న నేపథ్యంలో ఈ పోస్టింగ్‌లపై కూడా కూటమి నేతలు ప్రత్యేకంగా దృష్టి సారించారు.



సం క్షేమం క్షోభం

- వసతిగృహాల్లో విద్యార్థుల అవస్థలు
- హాస్టళ్లలో సౌకర్యాల లేమి భద్రత గాలిలో దీపం
- ఐదేళ్లుగా యువత స్వయం ఉపాధి పథకాలు నిర్వీర్యం
- శాఖలో పాతుకు పోయిన అధికారులు..
- పనితీరుపై విమర్శలు
- బినామీల చేతుల్లో ఎస్సీ కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్సులు
- వైసీపీ హయాంలో శాఖపై ఒక్కసారి కూడా జరగని సమీక్ష
- కూటమి ప్రభుత్వంలోనైనా సాంఘిక సంక్షేమ శాఖ పనితీరు గాడిలో పడేనా?
- నేడు నాగార్జున వర్సిటీలో మంత్రి డోలా సమీక్ష

గుంటూరు(విద్య), ఆగస్టు 18: ఐదేళ్లుగా సంక్షేమం సంక్షోభంలో చిక్కుకుంది. వసతిగృహాల్లోని విద్యార్థుల సంక్షేమం గురించి ఆలోచించలేదు. ఎస్సీ యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించలేదు. సాంఘీక సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థుల భద్రత గాలిలో దీపంలా మారినా.. ఆకలి కేకలతో అలమటిస్తున్నా.. కాస్మోటిక్స్, డైట్‌చార్జీలు చెల్లింపుల్లో జాప్యం.. ఇలా ఎన్నో సమస్యలతో సతమతం అవుతున్నా వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. వైసీపీ పాలనలో ఐదేళ్ల సంక్షేమ శాఖపై సమీక్షే జరగలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పట్టించుకోని పాలకుల హయాంలో యథా రాజా తథా ప్రజ అన్నట్లుగా అధికారులు కూడా తమకెందుకులే అన్న ధోరణిలో సంక్షేమ శాఖలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం సాంఘీక సంక్షేమ శాఖను తిరిగి గాడిలో పెట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. ఈ క్రమంలో అనేక సమస్యలతో కునారిల్లుతోన్న సాంఘిక సంక్షేమశాఖపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా సోమవారం గుంటూరు సమీపంలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి సమీక్షించనున్నారు.

సంక్షేమంలో.. సమస్యలు

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 70కిపైగా ఉన్న వసతిగృహాల్లో 3 నుంచి 10వ తరగి చదిదే విద్యార్థులు 15 వేల మంది వరకు ఉన్నారు. అయితే ఆయా వసతి గృహాల్లో ప్రవేశాలు, సౌకర్యాలపై ఐదేళ్లలో ఒక్కసారి కూడా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. గతంలో డీడీ, కలెక్టర్ స్థాయిలో మూడు నెలలకు ఒకసారి హాస్టళ్లపై సమీక్ష నిర్వహించేవారు. ఫలితంగా విద్యార్థుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి వచ్చేవి. అయితే గడిచిన ఐదేళ్లలో ఒక్కటంటే ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదు.
- సాంఘిక సంక్షేమశాఖ హాస్టళ్లను నాడు నేడు పథకంలో అభివృద్ధి చేస్తామని, సొంత భవనాలు నిర్మిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే ఇందులో ఒక్కటి కూడా నెరవేరలేదు. దాదాపు 40శాతం హాస్టళ్ల అద్దె భవనాల్లోనే ఉన్నాయి.
- సాంఘిక సంక్షేమశాఖ హాస్టళ్ల వెల్ఫేర్ అధికారులు ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో ఎవరికీ తెలియదు. ఫలితంగా ఇక్కడ వసతి పొందే విద్యార్థినుల భద్రత గాల్లోదీపంలా మారింది. గుంటూరు నగర నడిబొడ్డున ఉన్న సాంఘిక సంక్షేమశాఖ హాస్టల్ విద్యార్థినుల్ని యువకులు మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేసిన సంఘటన ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దీనిని బట్టి వసతి గృహాల్లో విద్యార్థినుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.
- విద్యార్థినుల చేత మ్యాట్రిన్లు పనులు చేయిస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. గుంటూరుతో పాటు వివిధ ప్రాంతాల్లోని కొన్ని హాస్టళ్లలో విద్యార్థినులు ఈ సమస్యలు ఎదుర్కొంటున్నారు.



- సాంఘిక సంక్షేమశాఖలో పనిచేసే కొంతమంది అధికారులపై తీవ్రస్థాయిలో ఆరోపణలు ఉన్నాయి. ఉద్యోగన్నతులు, సర్వీసులు, కాంట్రాక్టు ఉద్యోగుల నియామకం వంటి విషయాల్లో ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు వార్డెన్లు, మ్యాట్రిన్ల నుంచి అధికారులు మామూళ్ల వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి.
- ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో అనేక ప్రాంతాల్లో షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. ఈ కాంప్లెక్సులోని దుకాణాలు బినామీ పేర్లతో సబ్ లీజుల్లో నడుస్తున్నాయి. వేలాది రూపాయలు అద్దెవసూలు చేస్తూ పైసా కూడా శాఖకు చెల్లించని ప్రబుద్ధులు ఉన్నారు.
- ఎస్సీ కార్పొరేషన్ ద్వారా యువతకు అందే స్వయం ఉపాధి పథకాలు ఐదేళ్లుగా నిర్వీర్యమయ్యాయి. భూమి కొనుగోలు పథకం, మహిళా స్వయం ఉపాధి వంటి రాష్ట్రస్థాయి పథకాలతో పాటు కేంద్రం అమలు చేసే సఫాయికర్మచారి పథకాల్ని గత వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది.
- వసతిగృహాల్లోని విద్యార్థులకు డైట్, కాస్మోటిక్స్ చార్జీలు కోట్లులో పెడింగ్‌లో ఉన్నాయి.

197 మందికి ఒకే ఉపాధ్యాయుడు

- గురుకులంలో బాలికల విద్యకు గ్రహణం
- గిరిజన బాలికల పాఠశాలపై ప్రభుత్వం శీతకన్ను
- పెదతురకపాలెం పాఠశాలలో అటకెక్కిన చదువులు
- టీసీలు తీసుకు వెళుతున్న పదో తరగతి విద్యార్థినులు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 18: ఇటీవలే ఆదివాసీ దినోత్సవాన్ని ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. అయితే ఆ స్థాయిలో వారి సమస్యలపై అధికారులు కానీ, పాలకులు కానీ దృష్టి సారించడంలేదని ఆ వర్గాల నుంచి విమర్శలు వస్తున్నాయి. నరసరావు పేట మండ లం పెదతురకపాలెం గ్రామం వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాల దుస్థితే ఇందుకు నిదర్శనంగా కనిపిస్తోంది. 2016లో టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన గిరిజన గురుకుల బాలికల పాఠశాల గురించి వైసీపీ ప్రభుత్వం నాలుగేళ్లుగా పట్టించుకోలేదు. గురుకుల గిరిజన బాలికల విద్యకు గ్రహణం పట్టినా నాటి ప్రభుత్వం పట్టిం చుకోలేదు. 197 మంది విద్యార్థినులున్న



పాఠశాలపై నాటి ప్రభుత్వం శీత కన్ను వేయగా, కూటమి ప్రభుత్వ హయాంలోనూ అదే పరిస్థితి నెలకొందని తల్లిదండ్రులు వాపోతున్నారు.

ప్రారంభించి.. పట్టించుకోలేదు..

పల్నాడు జిల్లా పరిధిలోని ఆదివాసీ గిరిజన బాలికల కోసం కేంద్ర ప్రభుత్వ నిధులతో టీడీపీ హయాంలో పాఠశాలను ఏర్పాటు చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వం కేంద్రం విడుదల చేసిన నిధులను రాష్ట్ర ఖజానాకు మళ్లించుకుని పాఠశాల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయలేదు. ఎన్నికలకు ముందు పాఠశాలను ప్రారంభించి చేతులు దులుపుకుంది. ఇక్కడ ఆరు నుంచి 10 వరకు తరగతులకు 197 మంది బాలికలు చదువుతున్నారు. ఆరంభంలోనే అడ్మిషన్లు బాగా ఉన్నా, పాఠశాలలో అన్ని వసతులు ఉన్నా చదువు చెప్పేందుకు ఉపాధ్యాయులు లేకపోవడం విశేషం. ఉపాధ్యాయ నియామకాలను ప్రభు త్వం విస్మరించింది. దీంతో తరగతులు జరగక బాలికలు విద్యకు దూరమవుతున్నారు. ఉపాధ్యాయులు లేకపోవ డంతో పదోతరగతి విద్యార్థునులు టీసీలు తీసుకు వెళ్తున్నారు.

ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుడు ఒకరే..

గిరిజన గురుకుల బాలికల పాఠశాలకు ప్రిన్సిపల్, ఉపా ధ్యాయుడు ఒకరే. ఆయనే అన్ని తరగతులు నిర్వహించా ల్సిన దుస్థితి నెలకొంది. కాంట్రాక్ట్ విధానంలో మరొకర్ని నియమించినా సదరు ఉపాధ్యాయుడు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని తల్లిదండ్రులు తెలిపారు. బాలి కల పాఠశాలకు గతంలో ఉన్న మహిళా ప్రిన్సిపాల్‌ను బదిలీ చేసి పురుషుడ్ని ఇక్కడ నియమించారు. ఉపాధ్యా యుల కొరతపై గిరిజన సంక్షేమ శాఖ అధికారులను వివ రణ కోరగా ఇది గిరిజన శాఖ కార్యదర్శి పరిధిలో అం శమని తామేమీ చెప్పలేమన్నారు.

నీరున్నా.. సాగు సంకటమే

- నెంబర్ వన్ కాల్వ నిండా పూడిక
- సాగునీరు విడుదలైనా అందని వైనం
- నెర్రెలిస్తున్న వెదనాట్ల పొలాలు.. రైతుల ఆందోళన



పిచ్చి మొక్కలతో పూడుకుపోయిన నెంబర్ వన్ కాల్వ

వేమూరు, ఆగస్టు 18: పుష్కలంగా వర్షాలు కురిశాయి.. కాల్వల ద్వారా పుష్కలంగా అందుతున్న సాగునీరు. అయితే వేమూరు పరిధిలోని రైతులు సాగునీటి కోసం తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ముందస్తుగా వెదనాట్లు వేసిన భూములు నీరు లేక నెర్రెలిస్తున్నాయి. దీంతో రూ.వేలల్లో వ్యయం చేసిన అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సాగుకు అధికారులు ముందస్తుగా చర్యలు తీసుకోని కారణంగా రైతులకు శాపంగా మారింది. కొల్లిపర చానల్ ద్వారా నీరు వస్తున్నా నెంబర్ వన్ కాల్వకు అందడం లేదు. దీంతో ఈ కాల్వ పరిధిలోని అబ్బనగూడవల్లి, తాడిగిరిపాడు, బలిజేపల్లి, రావికంపాడు, పెనుమర్రు గ్రామాలకు చెందిన 6వేల ఎకరాల్లో సాగు సంకటంగా మారింది. ఖరీఫ్ సాగుకు ముందుగానే మరమ్మతులు చేపట్టాలని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోకుండనే ప్రస్తుత దుస్థితి అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం నిధులు కేటాయించని కారణంగా తాము ఏమీ చేయలేకపోతున్నామని నీటిపారుదల శాఖ అధికారులు మౌనం పాటించారు. ఈ కారణంగా భూములకు సాగునీరు అందడం లేదు. 95 శాతం మంది రైతులు వర్షపు నీరు ఆధారంతో వెద నాట్లు వేశారు. అయితే ప్రస్తుతం కాల్వ ద్వారా సాగునీరు అందడం లేదు. ఎండల తీవ్రత కూడా అధికంగా ఉంది. దీంతో భూములు బీటలు వారాయి. నాటిన మొక్కలు దెబ్బతింటున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొల్లిపర చానల్ నుంచి ఈ కాల్వకు 220 క్యూసెక్కుల నీటిని వదిలినా ప్రయోజనం లేకుండా ఉంది. కాల్వలో పెరిగిన మొక్కలు, పూడిక సాగునీటి ప్రవాహానికి అడ్డంకి మారాయి. దీంతో కొంచెం కూడా సాగునీరు పంట భూములకు చేరడంలేదు. ఈ పరిస్థితుల్లో ఎండిపోతున్న వరిని కాపాడుకునేందుకు అవకాశం ఉన్న రైతులు భూగర్భ జలాలను మోటార్ల సాయంతో వాడుకుంటున్నారు. అవకాశం లేని రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు గత నెలలో సమీక్ష నిర్వహించి సాగుకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అయినా ఇంతవరకు అధికారుల్లో స్పందన లేదు. ఇప్పటికైనా నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టి సహకరించాలని రైతులు కోరుతున్నారు.



అబ్బనగూడవల్లి వద్ద సాగునీరు అందక నెర్రెలిచ్చిన వెదనాటు భూములు

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా

ఎస్‌బీ అధికారులకు ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాలు

బాపట్ల, ఆగస్టు 18: గంజాయి, జూదం ఇతర అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని స్పెషల్ బ్రాంచ్ పోలీసులను ఎస్పీ తుషార్ డూడీ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఎస్‌బీ విభాగం పోలీసులతో ఎస్పీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు శాఖకు ఎస్‌బీ విభాగం కళ్లు, చెవులు లాంటిదన్నారు. ముందస్తు సమాచారంతో నేరాలను సమర్థంగా నియంత్రించవచ్చని చెప్పారు. అన్నివర్గాల వారితో మమేకమై వేగంగా సమాచారం సేకరించాలన్నారు. పోలీసుశాఖ సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు, అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయడానికి ఎస్‌బీ విభాగం అందించే ముందస్తు సమాచారం కీలకమని ఎస్పీ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఘటనలు చోటు చేసుకునే అవకాశం ఉంటే త్వరితగతిన ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. పేకాట, కోడి పందాల గురించిన సమాచారం ఉన్నతాధికారులకు అందించాలన్నారు. ప్రతిఒక్కరు నిబద్ధతతో, అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించిన, నిగూఢ రహస్య సమాచారం సేకరించడంలో అలసత్వం ప్రదర్శించిన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో మాదక ద్రవ్యాలు, అసాంఘిక కార్యకలాపాలు వంటి వాటి మీద నిఘా ఉంచటం జరిగిందన్నారు. ప్రజలు కూడా సహకరించి వారి ప్రాంతాలలో ఎవ్వైన శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యక్రమాలు జరుగుతుంటే వెంటనే స్థానిక పోలీసుస్టేషన్‌లో కాని 100, 112 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. సమావేశంలో ఎస్‌బీ ఇన్‌చార్జి సీఐ బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడి

ఇద్దరి అరెస్టు.. 400 గ్రాముల గంజాయి స్వాధీనం

బాపట్ల, ఆగస్టు 18: బాపట్లలోని ఉప్పరపాలెం పాలెంలో ఆదివారం గంజాయితో వెళ్తున్న ఇద్దరు యువకులను పట్టుకుని వారి నుంచి 400 గ్రాముల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ ఆర్.అహ్మద్‌జానీ తెలిపారు. బాపట్ల క్రిస్టియన్‌పేటకు చెందిన బెజ్జం సువర్ణ రాజు, నూజెండ్ల మండలం జంగాలపల్లికి చెందిన వల్లెపు చాణిక్య అనే ఇద్దరు బాపట్ల రైల్వే స్టేషన్‌లో దిగి బైక్‌పై గంజాయి ప్యాకెట్లతో వెళుతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో తహసీల్దార్ శ్రీదేవితో కలిసి సీఐ వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. వారి వద్ద చిన్న చిన్న ప్యాకెట్లలో గంజా యిని గుర్తించారు. వీరిద్దరూ వైజాగ్‌లో చదువుకుంటూ గంజాయిని తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పొగాకు రహిత సమాజ స్థాపన జరగాలి

అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూన రాణి

బాపట్ల, ఆగస్టు 18: పొగాకు రహిత సమాజ స్థాపన విద్యార్థుల లక్ష్యం కావాలని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనరాణి తెలిపారు. కళాశాలలో ఆదివారం టుబాకో ఫ్రీ యూత్ 2.0 కార్యక్రమంలో డీన్ ప్రసంగించారు. విద్యార్థి దశ అత్యంత కీలకమైనదని, ఈ వయస్సులో విద్యార్థులు వివేకంతో మెలగాలని వ్యవసనాలకు బానిసలు కాకుండా జాగ్రత్త పడాలని తెలిపారు. టుబాకో సంబంధిత పదార్థాలను వాడరాదన్నారు. సరదాగా ప్రారంభమైన వ్యసనం ప్రాణాంతకం అవుతుందని హెచ్చరించారు. దుర్వ్యసనాలకు దూరంగా ఉన్న విద్యార్థులను సమాజం హర్షిస్తుందన్నారు. అందువల్ల ప్రతి విద్యార్థి ఆదర్శజీవనం గడపాలన్నారు. పొగాకు రహిత సమాజం ఏర్పాటు దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పొగాకుపై అప్రమత్తంగా ఉంటామని ఎట్టి పరిస్థితుల్లో వాటిని వినియోగించమని విద్యార్థులతో ఆమె ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ కాట్రగడ్డ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు ఎయిర్ పోర్టు మళ్లీ తెరపైకి

- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రకటనతో విస్తృత చర్చ
- పదిరోజుల క్రితం పార్లమెంట్‌లో మాట్లాడిన ఎంపీ మాగుంట
- మూడు రోజులకే ప్రతిపాదన
- 20 ఏళ్ల క్రితమే భూముల గుర్తింపు
- అనంతరం మరుగునపడిన వైనం
- సీఎం చంద్రబాబు జోక్యంతో కదలిక

ఒంగోలులో విమానాశ్రయం ఏర్పాటు అంశం మరోసారి తెరపైకి వచ్చింది. రాష్ట్రంలో ఎయిర్ పోర్టుల అభివృద్ధిపై కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తాజాగా చేసిన ప్రకటనతో దానిపై మళ్లీ చర్చ మొదలైంది. రెండు దశాబ్దాల క్రితమే ఒంగోలులో ఎయిర్‌పోర్టు ఏర్పాటు ప్రతిపాదన తెరపైకి వచ్చింది. అప్పట్లో కొత్తపట్నం మండలం అల్లూరు, ఆలూరు వద్ద భూములను కూడా గుర్తించారు. అనంతరం అది మరుగునపడింది. ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటన సందర్భంగా వివిధ అంశాలపై కేంద్రంతో చర్చించారు. అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఏడు విమానాశ్రయాలను 14కు పెంచనున్నట్లు ప్రకటించారు. అందులో ఒంగోలు కూడా ఉంది.



ఒంగోలు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు 20 ఏళ్ల క్రితమే బీజం పడింది. అయితే అది ప్రతిపాదనలకే పరిమితమై అనంతరం మరుగునపడింది. ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వ చొరవతో మళ్లీ తెరపైకి వచ్చింది. ఉమ్మడి రాష్ట్రంలో 2004–07 మధ్య ఉన్న నాటి కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో విమానాశ్రయాల విస్తరణపై ప్రకటన చేసింది. ఆ సమయంలో ఒంగోలుకు ఎయిర్‌పోర్టు ప్రకటించింది. ఆవెంటనే ఒంగోలు సమీపంలోని కొత్తపట్నం మండలం అల్లూరు, ఆలూరు ప్రాంతాల్లో భూములను పరిశీలించారు. సుమారు 650 ఎకరాలు అవసరమని తేల్చారు. ఆమేరకు భూములను కూడా గుర్తించారు. ఒంగోలు చిన్న పట్టణమే అయినప్పటికీ ప్రపంచప్రఖ్యాతి గాంచిన గెలాక్సీ గ్రానైట్, విస్తారంగా తీరప్రాంతం ఉండి భారీగా ఆక్వా సాగు, దేశంలోనే అత్యధికంగా పొగాకు పంట వంటి వ్యాపార సంబంధ అంశాలతోపాటు అప్పట్లో వాన్‌పిక్ ప్రతిపాదన తదితర సానుకూల అంశాలను చూపి ఎయిర్‌పోర్టు ప్రతిపాదన చేశారు. కేంద్ర విమానయానశాఖకు చెందిన అధికారులు పరిశీలన కూడా అప్పట్లోనే పూర్తయ్యింది. భూ సంబంధ వివాదాలు కొంత, ఇతరత్రా కారణాలతో ఆ అంశం ప్రతిపాదనలకే పరిమితమైంది.

గతంలో మరుగునపడిన ప్రతిపాదనలు

ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దలు 2009-14 మధ్య నాటి నెల్లూరు జిల్లాలో దగదర్తి వద్ద ఎయిర్ పోర్టు, దుగరాజపట్నం వద్ద పోర్టు.. అలాగే ప్రకాశం జిల్లాలో రాయమపట్నం వద్ద పోర్టు, ఒంగోలు వద్ద ఎయిర్ పోర్టు ప్రతిపాదనలు పరిశీలన చేసి ఒకే జిల్లాలో అటు పోర్టు, ఇటు ఎయిర్‌పోర్టు రెండూ నిర్మాణం సాధ్యం కాదన్న అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. నెల్లూరు జిల్లాలో ఎయిర్ పోర్టు, ప్రకాశం జిల్లాలో పోర్టు నిర్మించాలని అనధికారికంగా ఒక అవగాహనకు వచ్చినట్లు అప్పట్లో విస్తృత ప్రచారం జరిగింది. ఆ నేపథ్యంలో ఒంగోలు ఎయిర్‌పోర్టు మరుగునపడి నెల్లూరు జిల్లా దగదర్తి ఎయిర్ పోర్టు ముందుకు కదిలింది. దీంతో ఒంగోలు ఎయిర్‌పోర్టు లేనట్లేనన్న భావన వచ్చింది. ఆతర్వాత దొనకొండలోని పురాతన విమానశ్రయ పునరుద్ధరణ చర్యలు, కదలికతో ఇక ఒంగోలు విమానాశ్రయం లేనట్లేనన్న అభిప్రాయం అందరిలోనూ వ్యక్తమైంది.

ఒంగోలులో ఎయిర్‌పోర్టుపై అధ్యయనం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం ఢిల్లీ పర్యటన సందర్భంగా రాష్ట్రానికి చెందిన పలు కీలక రంగాలపై కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. అందులో ప్రస్తుతం ఉన్న విమానాశ్రయాల అభివృద్ధి, కొత్తవి ఏర్పాటు వ్యవహారంపై సంబంధిత మంత్రి రామ్మోహన్‌నాయుడుతో కూడా సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఏడు విమానాశ్రయాలను 14కు పెంచనున్నట్లు ప్రకటించారు. అందులో ఒంగోలు కూడా ఉంది. ఒంగోలులో ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై అధ్యయనం చేయనున్నట్లు ప్రకటించారు. దీంతో మరోసారి ఈ అంశం తెరపైకి వచ్చింది. వివిధ వర్గాల ప్రజల్లో దీనిపై విస్తృత చర్చ సాగుతోంది. గతంలోనే భూములు గుర్తింపు కూడా జరిగిన నేపథ్యంలో పాలకపక్ష నేతలు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

టీడీపీ కూటమి ప్రభుత్వంలో మళ్లీ కదలిక

రాష్ట్రంలో తాజాగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం మౌలిక రంగాల అభివృద్ధి, అందులోనూ కేంద్రం సహకారంతో చేపట్టే రోడ్లు, రైలు, ఎయిర్‌వేస్, జల రవాణాపై ప్రత్యేక దృష్టి సారించింది. పాత ప్రతిపాదనల ఫైళ్లు దుమ్ముదులిపి తిరిగి కేంద్రం వద్ద చర్చకు పెడుతోంది. ఈ క్రమంలో ఒంగోలు ఎయిర్ పోర్టు అంశం తిరిగి తెరపైకి వచ్చింది. పది రోజుల క్రితం పార్లమెంట్‌లో విమానాశ్రయాల విస్తరణపై జరిగిన చర్చలో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఒంగోలు ఎయిర్ పోర్టు అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. గతంలో ఉన్న ప్రతిపాదనలు, మినీ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అనువుగా భూముల గుర్తింపు తదితరాలను వివరించి 60శాతం కేంద్రం, 40శాతం రాష్ట్ర నిధులతో నిర్మించాలని కోరారు.

21 మంది ఎస్సైల బదిలీ

వీఆర్‌కు పది మంది

ఒంగోలు (క్రైం), ఆగస్టు 18: జిల్లాలో భారీగా ఎస్సైలను బదిలీ చేశారు. 21 మందికి స్థానచలనం కల్పించారు. ఈమేరకు ఎస్పీ దామోదర్ ఉత్తర్వులు ఇచ్చారు. 10 మందిని వీఆర్‌కు పిలిచారు.

బదిలీ అయిన ఎస్సైల వివరాలు

ఎస్సై పేరు	పనిచేస్తున్న స్థానం	బదిలీ అయిన స్థానం
కె.విజయకుమార్	తాళ్లూరు	దొనకొండ
సాంబశివరాజు	మర్రిపూడి	త్రిపురాంతకం
ఎం.సైదాబాబు	పామూరు	మార్కాపురం టౌన్
పి.అంకమ్మరావు	దోర్నాల	మార్కాపురం రూరల్
టి.రమేష్ బాబు	పీసీపల్లి	మర్రిపూడి
ఎం.మురళి	అటాచ్డ్ దర్శి	దర్శి
వై.నాగరాజు	పీటీసీ ఒంగోలు	ముండ్లమూరు
నాగమల్లేశ్వరరావు	దిశ పోలీస్‌స్టేషన్	టంగుటూరు
వి.సుధాకర్	తర్లుపాడు	కొత్తపట్నం
వి.వేమన	వీఆర్	పొదిలి
బి.మహేంద్ర	అటాచ్డ్ పుల్లలచెరువు	సింగరాయకొండ
యు.పున్నారావు	టంగుటూరు	జరుగుమల్లి
ఎస్.మల్లికార్జునరావు	వీఆర్	తాళ్లూరు
బి.శివరామయ్య	వీఆర్	మద్దిపాడు
బి.నరసింహారావు	బేస్తవారపేట	కంభం
పి.అనిల్‌కుమార్	వీఆర్	పెద్దారవీడు
పి.చౌడయ్య	నెల్లూరు జిల్లా	ఎర్రగొండపాలెం
జి.గిరిబాబు	గుంటూరు జిల్లా	పొన్నలూరు
ఎస్.సుమన్	పల్నాడు జిల్లా	కొండపి
ఎస్.వి.రవీంద్ర రెడ్డి	బాపట్ల జిల్లా	బేస్తవారపేట
పి.కోటేశ్వరరావు	బాపట్ల జిల్లా	రాచర్ల

వీఆర్‌కు పిలిచిన ఎస్సైలు వీరే..

జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌లలో పనిచేస్తున్న 10 మంది ఎస్సైలను వీఆర్‌కు పిలిచారు. వారి స్థానాల్లో ఇతరప్రాంతాల్లో పనిచేస్తున్న వారికి పోస్టింగ్‌లు ఇచ్చారు. వీఆర్‌కు పిలిచిన వారిలో సింగరాయకొండలో పనిచేస్తున్న టి.శ్రీరాం, మద్దిపాడు ఎస్సై వి.మహేష్, ముండ్లమూరులో పనిచేస్తున్న వి.అంజనేయులు, త్రిపురాంతకం నుంచి వి.సాంబశివయ్య, పెద్దారవీడు నుంచి జి.వెంకటసైదులు, కొత్తపట్నం ఎస్సై బి.సాంబశివరావు, మార్కాపురం టౌన్ ఎస్సై అబ్దుల్ రెహమాన్, కొండపిలో పనిచేస్తున్న ఎం.కృష్ణబాజీబాబు, దొనకొండ ఎస్సై ఎల్.సంపత్‌కుమార్, కంభం ఎస్సై పి.రాజేష్ ఉన్నారు. వీరంతా జిల్లా పోలీసు కార్యాలయంలో రిపోర్టు చేయాలని తన ఉత్తర్వుల్లో ఎస్పీ పేర్కొన్నారు.

పాఠశాల విద్యార్థుల
పరీక్షల షెడ్యూల్ విడుదల

- ఎఫ్ఏ-1 పేరు మార్పు
- ఈనెల 27 నుంచి ప్రారంభం

ఒంగోలు (విద్య), ఆగస్టు 18 : ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లో 1నుంచి పదో తరగతి వరకూ చదువుతున్న విద్యార్థుల పరీక్షల షెడ్యూల్‌ను విద్యా శిక్షణ మండలి పరిశోధనా సంస్థ (ఎస్సీఈఆర్టీ) డైరెక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి విడుదల చేశారు. ఫార్మెటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఏ-1) పేరు సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్-1గా మార్చారు. పరీక్షలు ఈనెల 27నుంచి ప్రారంభమవుతాయి. వచ్చేనెల 4 వరకూ నిర్వహిస్తారు. గతేడాది వరకూ ఈ పరీక్షలను రోజుకు రెండు చొప్పున ఉదయం, మధ్యాహ్నం నిర్వహించేవారు. అయితే ప్రస్తుతం రోజుకు ఒకటి చొప్పున ఏడు రోజులు ఉంటాయి.

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈనెల 27నుంచి సెప్టెంబరు 2 వరకూ ఉదయం 10.45 నుంచి 11.45 వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

ఈనెల 27న 3,4,5తరగతులకు ఓఎస్ఎస్సీ పరీక్ష ఉంటుంది.

28న 1నుంచి 5 తరగతులకు తెలుగు, 30న ఇంగ్లీషు, 31న గణితం, సెప్టెంబరు 2న పరిసరాల విజ్ఞానం పరీక్ష నిర్వహిస్తారు.

ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 6,7,8 తరగతులకు 27వతేదీ మధ్యాహ్నం 1.10నుంచి మధ్యాహ్నం 2.10వరకు ఓఎస్ఎస్సీ పరీక్ష జరుగుతుంది. 28న తెలుగు, 30న హిందీ, 31న ఇంగ్లీషు, సెప్టెంబరు 2న గణితం, 3న జనరల్ సైన్స్, 4న సోషల్ పరీక్షలు ఉంటాయి. ఇవన్నీ మధ్యాహ్నం 1.30నుంచి 2.30 వరకూ జరుగుతాయి.

హైస్కూళ్లలో 9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు 27వతేదీ ఉదయం 10నుంచి 11.15 గంటల వరకు ఓఎస్ఎస్సీ పేపర్-1, 11.15నుంచి 12.15 గంటల వరకు జీఎస్ఎస్సీ పేపర్-2, 28న తెలుగు, 30న హిందీ, 31న ఇంగ్లీషు, సెప్టెంబరు 2న గణితం, 3న జనరల్ సైన్స్, 4న సోషల్ పరీక్షలు జరుగుతాయని ఆ షెడ్యూల్‌లో పేర్కొన్నారు. ప్రశ్నపత్రాలను ప్రభుత్వమే జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు(డీసీఈబీ) ద్వారా పాఠశాలలకు పంపుతుంది.

సర్దుబాటుకు సర్వం సిద్ధం

ఎంఈవోల లాగిన్‌కు సవరణ జాబితాలు

టీచర్లకు నేడు మండలాల్లో కౌన్సెలింగ్

ఒంగోలు (విద్య),ఆగస్టు 18 : జిల్లాలో ఉపాధ్యాయుల పని సర్దుబాటుకు సర్వం సిద్ధమైంది. మండల విద్యాధికారుల లాగిన్‌కు సవరించిన మిగులు టీచర్ల సీనియారిటీ జాబితాలు వచ్చాయి. వాటి ఆధారంగా సర్దుబాటుకు అన్ని ఏర్పాట్లు ఆదివారం రాత్రికే పూర్తి చేశారు. సోమవారం మండల స్థాయిలో మిగులు టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈమేరకు మొదట ప్రకటించిన మిగులు టీచర్ల జాబితాపై అభ్యంతరాలు వెల్లువెత్తడంతో సవరణకు అవకాశం కల్పించింది. పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించి వారి సలహాలు, సూచనలు స్వీకరించారు. కొన్నింటికి ఆయన ఆమోదం తెలిపారు.

794 మంది మిగులు టీచర్లు

జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో ఈనెల 16నాటికి నమోదైన యుడైస్‌లోని విద్యార్థుల సంఖ్య ప్రామాణికంగా 794 మంది టీచర్లు మిగులుగా ఉన్నట్లు గుర్తించారు. వారిలో అత్యధికంగా 500 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు ఉన్నారు. స్కూలు అసిస్టెంట్ తెలుగు 55 మంది, హిందీ 42 మంది, సోషల్ స్టడీస్ 27 మంది, బయోలాజికల్ సైన్స్ 23 మంది, ఉర్దూ 8 మంది, ఇంగ్లీషు 19మంది, పీఎస్ 32మంది తేలారు. మినిమం టైం స్కేలుతో కాంట్రాక్టు టీచర్లుగా పనిచేస్తున్న 43 మంది, ఎల్‌పీ తెలుగు, హిందీ ఒక్కొక్కరు, ఎస్‌జీటీ ఉర్దూ 16మంది మిగులుగా ఉన్నారు. మొదట ప్రకటించిన మిగులు జాబితాలో 906 మంది టీచర్లు ఉండగా సవరించిన జాబితాలో 112 మంది తగ్గారు. మార్కాపురం మండలంలో గరిష్ఠంగా 71 మంది, అర్ధవీడులో 9 మంది, బేస్తవారపేటలో ఆరుగురు, సీఎస్‌పురంలో 16 మంది, చీమకుర్తిలో 29 మంది, కంభంలో 26, దర్శిలో 45, దొనకొండ 15, గిద్దలూరులో 31, హనుమంతునిపాడులో 16, కనిగిరిలో 38 మంది టీచర్లు మిగులు ఉన్నారు. కొమరోలు మండలంలో 47 మంది, కొనకనమిట్లలో 28, కొండపిలో 11, కొత్తపట్నంలో 21 మంది, కురిచేడులో 20 మంది, మద్దిపాడులో 20, మర్రిపూడిలో 15, ముండ్లమూరులో 22, ఎన్‌జీపాడులో 12, ఒంగోలులో 48, పీసీపల్లిలో 17, పెదదోర్నాలలో 7, పామూరులో 9, పెద్దారవీడులో 23 మంది మిగులుగా తేలారు. పొదిలి మండలంలో 23 మంది, పొన్నలూరులో 22, పుల్లలచెరువులో 12, రాచర్లలో 23, సంతనూతలపాడులో 29, సింగరాయకొండలో 16, త్రిపురాంతకంలో 22, తాళ్లూరులో 17, టంగుటూరులో 12, తర్లుపాడులో 18, వెలిగండ్లలో 7, ఎర్రగొండపాలెంలో 22, జరుగుమల్లి మండలంలో ఎనిమిది మంది మిగులుగా టీచర్లు ఉన్నారు.

సీనియారిటీ జాబితాపై 29 అభ్యంతరాలు

సీనియారిటీ జాబితాపై జిల్లాలోని టీచర్ల నుంచి 29 అభ్యంతరాలు రాగా వీటన్నింటినీ కమిషనర్ కార్యాలయానికి పంపించారు. సవరించిన సీనియారిటీ జాబితా ప్రస్తుతం ఎంఈవో లాగిన్‌కు వచ్చింది. వీటిపైన ఏమైనా అభ్యంతరాలు ఉంటే పాఠశాల విద్య కమిషనర్ కార్యాలయంలోని ఐటీ బృందం దృష్టికి తీసుకెళ్తే పరిష్కరిస్తామని ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుతం ఎంఈవో లాగిన్‌కు వచ్చిన సవరించిన సీనియారిటీ జాబితాలపై ఎటువంటి అభ్యంతరాలు లేకపోతే ఈరాత్రికే అన్ని ఏర్పాట్లు చేసుకొని సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించి టీచర్ల సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేయమన్నారు. సర్దుబాటుకు సంబంధించిన సూచనలను విధిగా పాటించాలని, ఏమైనా సమస్యలు ఉంటే వర్క్ అడ్జస్ట్‌మెంట్ గ్రూపులో పోస్టు చేయాలని కోరారు. తాజా సూచనలు ప్రకారం మండల స్థాయికే పనిసర్దుబాటు పరిమితమయ్యేలా ఉంది. డివిజన్ స్థాయిలో సర్దుబాటు అనుమానంగా కన్పిస్తోంది.

కొనసాగిన జూడాల నిరసన

రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 18 : కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని నిరసిస్తూ జూనియర్ డాక్టర్లు చేపట్టిన ఆందోళన మూడోరోజూ కొనసాగింది. ఆదివారం జూడాలు విధులు బహిష్కరించారు. ఆసుపత్రి ఆవరణలో 'రియల్ మెన్.. డోంట్ రేప్' పేరుతో రోడ్డుపై చిత్రాలను గీచి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా జూడాలు మాట్లాడుతూ ఈనెల 9న పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచారానికి గురైతే అక్కడి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య రంగ రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.అజయ్‌కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షురాలు బొగ్గు శృతి, ప్రధాన కార్యదర్శులు చైతన్యసాయి, విష్ణుప్రియ, జాయింట్ సెక్రటరీలు అవినాష్ కుమార్, ఎం.సాయి పవిత్ర, ఇతర జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నుంచి 24 గంటలపాటు నిలిపివేసిన ప్రైవేటు వైద్యులు ఓపీ, వైద్య సేవలు ఆదివారం పునరుద్ధరించారు.

ఘనంగా నాగభైరవ సాహిత్య పురస్కార సభ

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 18: నాగభైరవ సాహిత్యపీఠం ప్రతి ఏడాది డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు పేరిట అందిస్తున్న సాహిత్య పురస్కార ప్రదాన సభ ఆదివారం స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో ఘనంగా జరిగింది. సాహిత్యపీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) మాట్లాడుతూ నాగభైరవ కోటేశ్వరరావు ఎంతో మందిని సాహిత్య రంగంలో తీర్చిదిద్దారన్నారు. అటువంటి మహనీయుని పేరిట పురస్కారాలు అందజేయటం అభినందనీయమన్నారు.

నాగభైరవ కోటేశ్వరరావు మంచి మనసున్న కవి అని, తన లాంటి ఎందరినో సాహిత్యరంగంలో ప్రోత్సహించారని తేళ్ల అరుణ పేర్కొన్నారు. ఈసందర్భంగా సాహిత్యపురస్కారాల ప్రథమ బహుమతిని పూలపూల వాన రచయిత ఏనుగు నరసింహారెడ్డికి, ద్వితీయ బహుమతిని మణిపూసలు రచయిత డాక్టర్ పూటుకూరి వరప్రసాద్‌కు, కళాపురస్కారాలను నాటక సినీ రచయిత వై.కృష్ణేశ్వరరావుకు, ఆత్మీయ పురస్కారాన్ని డాక్టర్ బీరం సుందరరావుకు అందజేశారు.

మానవత్వం చాటుకున్న ఎస్‌ఐ

ముండ్లమూరు, ఆగస్టు 18: మండలంలోని వేముల గ్రామానికి చెందిన షేక్ మౌలాబీ శనివారం రమణారెడ్డిపాలెంలో వద్ద జరిగిన ఆటో ప్రమాదంలో మృతి చెందారు. పది సంవత్సరాల క్రితం ఆమె భర్త కాలేషా మృతి చెందారు. వీరికి ఫరీద్, కరిష్మా అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలయ్యారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వి.నాగమల్లేశ్వరరావు ఆ చిన్నారులను చూసి చలించిపోయారు. మౌలాబీ కుమారుడు ఫరీద్‌కు రూ.10 వేలు సాయం చేశారు.

వైభవంగా తేరాతేజీ

- అధిక సంఖ్యలో తరలివచ్చిన ముస్లింలు
- కంభం చెరువు వద్ద సందడి



తేరాతేజీకి హాజరైన ముస్లింలతో కళకళలాడుతున్న కంభం చెరువు కట్ట

కంభం, ఆగస్టు 18 : జిల్లాలోని చారిత్రాత్మక కంభం చెరువుపై ముస్లింలు తేరాతేజీ (గరిక తొక్కుడు) ఉత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ముస్లింలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కంభం చెరువులో నీరు ఉంటే ఈ పండుగ చేసుకుంటారు. ప్రస్తుతం కంభం చెరువులో మూడు అడుగుల మేర నీరు ఉంది. తేరాతేజీ మాసంలో కొత్తగా పెళ్లైన దంపతులు 13 రోజులపాటు దూరంగా ఉంటారు. పుట్టింటికి చేరే వరకు నూతన వధువుకు వరుడి ముఖం కూడా చూపరు. 13వ రోజు ఆహ్లాదాన్ని కలిగించే కంభం చెరువుకు రావడం ఆనవాయితీగా వస్తోంది. బంధువులంతా కలిసి అక్కడే వంటలు వండుకొని భోజనాలు చేసి ఆనందంగా గడుపుతారు. దీన్షావలి దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. పెళ్లినాటి దండలు, పూలు, ఇతరాలను కంభం చెరువులో వదిలివేస్తారు. ఆదివారం జరిగిన ఉత్సవానికి విజయవాడ, హైదరాబాద్, గుంటూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి పెద్దత్తున భక్తులు తరలివచ్చారు. ఏటా వేలాది మంది భక్తులు వస్తారని తెలిసినా అధికారులు అక్కడ ఎటువంటి సౌకర్యాలు కల్పించలేదు. పోలీసు సిబ్బంది తగినంత మంది లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య పెరిగింది. దీంతో భక్తులు ఇబ్బంది పడ్డారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు, ఆగస్టు 18: సోమవరప్పాడుపరిధిలోని గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గంగాభవానీ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి కరుణించమని వేడుకున్నారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెందిన భక్తులతోపాటు వివిధప్రాంతాల నుంచి మొక్కులు తీర్చుకునేందుకు రావటంతో ఆప్రాంతం సందడిగా మారింది.

చల్లంగ చూడమ్మ గంగమ్మ తల్లి అంటూ వేడుకున్నారు. ఆలయబ్రాహ్మణ అర్చకులు ఎస్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్ పంతులు, బాలరాజు అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో పి.కార్తిక్, ఆలయ కమిటీ ఛైర్మన్ కొసనా గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములకు రక్షణ కరువు

- రూ.వంద కోట్లకుపైగా ఆస్తుల ఆక్రమణ
- పట్టించుకోని అధికారులు
- యథేచ్ఛగా భూముల అన్యాక్రాంతం



భజంత్రీల మాన్యంలో వేసిన లేఔట్లు

పామూరు, ఆగస్టు 18: దేవుడి భూములకు రక్షణ కరువైంది. యథేచ్ఛగా భూములను ఆక్రమించుకొని రికార్డుల్లో పేర్లు మార్చుకొని సొమ్ము చేసుకొంటున్నారు. పామూరులోని మదనవేణుగోపాల స్వామి దేవస్థానానికి సంబంధించిన కోట్లాది రూపాయల విలువ కలిగిన భూములు ఈపాటికే ఆక్రమణకు గురయ్యాయి. వాటిల్లో పక్కా భవనాలతోపాటు, వెంచర్లు వేశారు. తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటూ రెవెన్యూ, ఎండోమెంట్ అధికారులు మమ అనిపిస్తున్నారు.

పామూరులోని శ్రీమదనవేణుగోపాలస్వామి, శ్రీవల్లీ భుజంగేశ్వరస్వామి, వరదరాజులస్వామి, ఆంజనేయ స్వామి దేవస్థానాలకు చెందిన సుమారు 395 ఎకరాల భూములు, ఉన్నాయి. అందులో ఇప్పటివరకు వివిధ రూపాల్లో 75 ఎకరాలకు పైగా ఆక్రమణలకు గురయ్యాయి. ఆక్రమణకు గురైన భూముల విలువ మార్కెట్‌లో రూ.వంద కోట్లకు పైగా ఉంటుంది. కొందరు ఆక్రమణదారులు తప్పుడు పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. పామూరు రెవెన్యూ గ్రామ పరిధి లోని సర్వే నెంబర్ 176/2లో 13.80 ఎకరాల భూములు ఉన్నాయి. అందులో ఒకటిన్నర ఎకరా భూమిని ఓ ప్రయివేట్ వెంచర్ సంస్థ ఆక్రమించి రహదారి ఏర్పాటుచేసుకున్నారు. ఇక్కడ ఎకరా భూమి విలువ రూ.2 కోట్లకు పైగా ఉంది. సర్వే నెంబర్ 329/2లో 2.41 ఎకరాల భూమిలోను ఎకరా భూమిని ఆక్రమించి ప్లాట్లు వేసి సొమ్ము చేసుకొన్నారు. మరి కొందరు కట్టడాలు నిర్మించుకొన్నారు. సర్వే నెంబర్ 439/5లో 1.97 ఎకరాల భూమిలో ప్లాట్లు వేశారు.

వేణుగోపాలస్వామి ఆలయానికి సంబంధించి నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం వేంపాడు రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 78/1లో ఉన్న 6.06 ఎకరాల భూమి అర్చకుల దగ్గర కొనుగోలు చేశామంటూ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. జాతీయ రహదారికి పక్కనే ఉన్న ఈ భూమి విలువ రూ.20 కోట్లు ఉంటుంది. ఈ భూమికి కమిటీతో సంబంధం లేకుండా అర్చకులు తమకు విక్రయించినట్లు అధికారులను లోబరుచుకొని బినామీ రికార్డులు సృష్టించి 2016లో రిజిస్ట్రేషన్ చేయించుకొన్నారు.

దేవస్థాన అధికారులు తమకు ఎన్‌వోసీ ఇచ్చేందుకు సహకరించడం లేదని పట్టాలు పొందినారు గతేడాది జూన్ 2న జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దాంతో అప్రమత్తమైన ఎండోమెంట్ అధికారులు విచారణ చేపట్టి పట్టాలు పొందిన వ్యక్తుల పేర్లు తొలగించి ఆలయ భూమిగా నమోదు చేయాలని అక్టోబర్ 26న తీర్పు ఇచ్చారు. దాంతో స్థానిక అధికారులు ఆ భూమిలో బోర్డులు ఏర్పాటుచేశారు.

వల్లీ భుజంగేశ్వర దేవస్థానానికి సంబంధించి సర్వే నెంబర్ 438/2లో 7.66 ఎకరాల భూములు ఉన్నాయి. వీటిలో ఆక్రమణదారులు జామాయిల్ తోటలు సాగు చేస్తున్నారు. పామూరు కొత్త చెరువు వెనుక భాగం జాతీయ రహదారికి పక్కన సర్వే నెంబర్ 399/6లో 1.55 ఎకరాల విలువైన భూమిపై ఆక్రమణదారులు కన్నేశారు. తప్పుడు పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకొని వెబ్‌ల్యాండ్‌లో పేర్లు నమోదు చేసుకున్నారు. ఎఫ్ఎల్ఆర్‌లో మాత్రం భజంత్రీల మాన్యంగా నమోదై ఉంది. దీని విలువ మార్కెట్‌లో రూ.4 కోట్లకు పైగా ఉంది. ప్రస్తుతం ఆక్రమణదారులు లేఅవుట్ వేసి అమ్మకాలు జరుపుతున్నారు. 256/2, 256/1, 441లో 1,2,3, 442 1,2,3, లోని భూములు ఆక్రమణదారుల చెరలో ఉన్నాయి.

ఇప్పటికైనా సంబంధిత శాఖ జిల్లా అధికారులు స్పందించి దేవస్థాన భూములను 22ఏ1సి రిజిస్ట్రేషన్ చట్టం 1908లోని నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చించి రక్షణ చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

ఆటో బోల్తా.. ఒకరు మృతి



బోల్తాపడిన ఆటో

దర్శి, ఆగస్టు 18: ఆటో బోల్తాపడి మహిళ మృతి చెందారు. ఈఘటన ఆదివారం ఉదయం మండలంలోని రామచంద్రాపురంలో చోటుచేసుకుంది. జముకులదిన్నె గ్రామానికి చెందిన 16 మంది కూలీ పనుల కోసం ఆటోలో రామచంద్రాపురం వెళ్తున్నారు. ఈక్రమంలో రామచంద్రాపురం గ్రామ సమీపంలో మలుపువద్ద బ్రేక్ వేసేందుకు డ్రైవర్ యత్నించారు. అయితే, బ్రేక్ కింద పొరపాటున అన్నం క్యారేజీ పడటంతో బ్రేక్ పడలేదు. దీంతో వేగంగా వెళ్తున్న ఆటో మలుపు వద్ద బోల్తా పడింది. వీరిలో 12 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను 108 ద్వారా దర్శి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ముగ్గురిని మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలుకు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ నాగేంద్రం అనే మహిళ మృతిచెందారు. మిగిలినవారు దర్శిలో వైద్యం పొందుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు



బాధ్యతలు చేపట్టిన మురళి

దర్శి, ఆగస్టు 18: దర్శి నూతన ఎస్ఐగా ఎం.మురళి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. చీరాలలో పనిచేస్తున్న ఆయన దర్శికి బదిలీ అయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పేకాట, బెట్టింగులు, తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈవ్‌టీజింగ్‌ను ఉక్కుపాదంతో అణిచి వేస్తామన్నారు. దర్శి పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు.

ముండ్లమూరు ఎస్ఐ బదిలీ

ముండ్లమూరు, ఆగస్టు 18: స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న వి.నాగమల్లేశ్వరరావు టంగుటూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఒంగోలు డీసీఆర్‌బీలో పనిచేస్తున్న వై.నాగరాజు నియమితులయ్యారు.

నేడు శ్రీనివాస కల్యాణ మహోత్సవం

చినగంజాం, ఆగస్టు 18 : భూ సమేత భావనారాయణస్వామి దేవస్థానంలో వేంకటేశ్వరస్వామి తిరునక్షత్రం (జన్మ నక్షత్రం) శ్రవణం సందర్భంగా సోమవారం రాత్రి 7గంటలకు శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జీ పిచ్చయ్య ఆదివారం ప్రకటనలో తెలిపారు. 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీనివాస కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని తిలకంచి, తీర్థప్రసాదాలు స్వీకరించాలని పిచ్చయ్య కోరారు.

రూ.లక్ష విరాళం



ఈవోకు విరాళాన్ని అందజేస్తున్న దాతలు

అద్దంకి, ఆగస్టు 18 : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం రాతి ముఖ మండప నిర్మాణానికి నెల్లూరుకు చెందిన దాత వల్లెపు సంజీవరావు, నాగాంజమ్మ దంపతులు ఆదివారం ఈవో సుభద్రకు రూ.1,00,116 అందజేశారు. వల్లెపు వెంకటేశ్వర్లు, దుర్గమ్మ జ్ఞాపకార్థం కుమారుడు సంజీవరావు, నాగాంజమ్మ అందజేసినట్లు ఈవో తెలిపారు.

ఆర్వోబీ నిర్మాణం ఎప్పుడో?

» కార్యరూపం దాల్చని హామీ

» ఓవర్ బ్రిడ్జితో రాకపోకలకు సౌకర్యం



లెవల్‌క్రాసింగ్ వద్ద రైలుగేటు కింది నుంచి వచ్చేందుకు ప్రయత్నిస్తున్న రిక్షా పుల్లర్

చీరాల, ఆగస్టు 18 : అగ్నిమాపక కేంద్రం సమీపంలోని రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద ఆర్వోబీ (రోడ్డు ఓవర్ బ్రిడ్జి)ని ఏర్పాటు చేస్తామని పాలకులు, అధికారులు చెప్పినమాట కొన్ని సంవత్సరాలుగా కార్యరూపం దాల్చడంలేదు. దీంతో ఆ నిర్మాణం ఎప్పుడు జరుగుతుందా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. మున్సిపల్ పరిధిలో మొత్తం 33 వార్డులు ఉన్నాయి. అందులో 9 వార్డులు రైలుగేటుకు అవతల ఉంటాయి. ఆ వార్డుల నుంచి సింహభాగం ప్రజలు ఈ గేటు నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో అక్కడ ఆర్‌వోబీ ఏర్పాటుకు సంబంధించి స్థల పరిశీలన జరిగి కొన్ని సంవత్సరాలు గడిచింది. ప్రభుత్వాలు మారాయి. పాలకులు మారారు. కాని అక్కడి పరిస్థితిలో ఎలాంటి మార్పులేదు. రైలు గేటు వేసినప్పుడు పలువురు దిచక్ర వాహనచోదకులు, రిక్షాపుల్లర్లు, సైకిల్‌తో వచ్చే వారు గేటు కింద నుంచి ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తుంటారు. కొన్ని సందర్భాల్లో వారికి ఎలా ఉన్నా చూసే వారికి ఏ ప్రమాదం జరగుతుందో నని ఆందోళన కలిగించేరీతిలో సంఘటనలు ఉంటాయి. ప్రధానంగా ఉదయం, సాయంత్రం వేళల్లో స్కూల్స్, కాలేజీలకు వెళ్లే వారు, ఇతర ఉద్యోగాలకు, దినసరి పనులకు రాకపోకలు సాగించేవారు వెంటవెంటనే గేటు పడుతుండడంతో ఇబ్బంది పడుతున్నామంటున్నారు. ఇదిలావుంటే అక్కడ ఆర్‌వోబీ ఏర్పాటు చేస్తే తమకు ఇబ్బందవుతుందని పలువురు అప్పట్లో ఆందోళన చేపట్టారు. ఆర్‌వోబీ కాకుండా అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాలని వారు సూచించారు. ఆ తరువాత ఒకటికి రెండు పర్యాయాలు సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు ఆ ప్రాంతంలో పర్యటించారు. స్థానికులు అభిప్రాయాలు సేకరించారు. కొలతలు కూడా తీశారు.

ఎక్కడ వేసిన గొంగళి అక్కడే

అగ్నిమాపక కేంద్రం గేటు వద్ద ఆర్‌వోబీ నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా కొనసాగుతోంది. 2016లో ప్రతిపాదన వచ్చింది. తొలుత ఆర్వోబీ ప్రతిపాదన వచ్చినపుడు అప్పట్లో మున్సిపల్, రైల్వే, ఆర్ అండ్ బీ, రెవెన్యూ అధికారుల సమిష్టి సర్వే జరిగింది. ఆర్ అండ్ బీ అధికారులు డీపీఆర్(డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు) తయారు చేశారు. తొలుత రూ.68కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారు. అదే 2022కు ఆ వ్యయం అంచనా రూ.100 కోట్లు పై చిలుకు ఉంటుందని అంచనా వేశారు. ప్రస్తుతం డీపీఆర్‌కు సంబంధించి ఓ కన్సల్టీసీకి బాధ్యతలు అప్పగించారు. అది ఎప్పటికి పూర్తవుతుందో సంబంధీకులు చెప్పలేమంటున్నారు. అంచనా వ్యయం పెరిగిన ఎస్‌ఎస్‌ఆర్ రేట్లతో పోలిస్తే సుమారు రూ.130కోట్లు అయ్యే అవకాశం ఉంటుందని చెప్తున్నారు.

అనుకూల ప్రభుత్వాలు ఏర్పడిన నేపథ్యంలో

ప్రస్తుతం అటు కేంద్రంలో, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో ఆర్వోబీ నిర్మాణానికి తగిన చర్యలు వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు. అక్కడ ఆర్వోబీ నిర్మాణం జరిగితే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నారు.



కార్యాలయ గదిని ప్రారంభిస్తున్న వెంకట అప్పారావు

ఆరామ క్షేత్రం ప్రారంభం

అద్దంకిటౌన్, ఆగస్టు 18 : అద్దంకి సీమ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని పాత శివాలయం వద్ద నిర్మించిన ఆరామ క్షేత్రంలో ఆదివారం కార్యాలయ గదిని దర్శవరపు చారిటీస్ తరపున దర్శవరపు అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు జమ్ములమడక హనుమంతరావు మాట్లాడుతు ఆరామ క్షేత్రం ఆధునీకరణ, మొదటి అంతస్తు పూర్తికి చేయడానికి సూమారు రూ.19లక్షల విరాళాలను సేకరించి పూర్తి చేసినట్లు చెప్పారు. మొదటి అంతస్తు కార్యాలయ గదిని దర్శవరపు చారిటీస్ తరపున రూ.3లక్షలతో నిర్మించినట్లు చెప్పారు. బ్రాహ్మణ కుటుంబాలు కర్మ కార్యక్రమాలకు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి ఈదర శివప్రసాద్, కోశాదికారి నాగరాజు, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, దర్శవరపు శ్రావణ్‌కుమార్, లక్కరాజు చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు, వెంకటరత్నం, శ్రీనివాస్, సప్తాచలశర్మ, శ్రీనివాసరావు, మోహనరావు, సుబ్రహ్మణ్యం, రాధాకృష్ణమూర్తి, భవన్నారాయణ, సీతారామయ్య, సత్యం పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన కల్పించాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

అద్దంకిటౌన్, ఆగస్టు 18 : హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అద్దంకి, కొరిశ పాడు టీఐ అవుట్‌రిచ్ వర్కర్స్ కరుణ, కృష్ణవేణి అన్నారు. ఆదివారం పట్టణంలోని సంజీవనగర్‌లో మీకు తెలుసా అనే కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై మహిళలు, యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు శ్రావణి, మల్లేశ్వరి, శారద, నయోమి, కృపాదానం పాల్గొన్నారు.

వ్యక్తిపై సీసాతో దాడి



వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ

చీరాలటౌన్, ఆగస్టు 18 : వ్యక్తిపై మరో వ్యక్తి సీసాతో దాడి చేయగా బాధితుడు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఈఘటన ఆదివారం మధ్యాహ్నం కారంచేడు మండలం కుంకులమర్రు గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జమ్ములమడుగు ఏసురత్నం, బిళ్ల ప్రశాంత్ ఒకే ముఠాలోని రోజువారీ కూలీలు. వీరిద్దరూ మధ్యాహ్న సమయంలో ఓ గోడౌన్‌లో పని చేసి విశ్రాంతి తీసుకునే సమయంలో పరస్పరం గొడవ పడ్డారు. దీంతో ప్రశాంత్ సీసా పగలకొట్టి గొంతుపై పలు చోట్ల దాడిచేసి గాయపరిచాడు. దీంతో అపస్మారక స్థితిలో ఉన్న బాధితుడిని స్థానికులు 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యులు అతడికి శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం అతడి పరిస్థితి నిలకడగా ఉంది. ఈ మేరకు అవుట్‌పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు. దీంతో సమాచారం అందుకున్న కారంచేడు ఎస్‌ఐ వెంకటరావు హాస్పిటల్‌కు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ప్రశాంత్ కూడా స్వల్ప గాయంతో హాస్పిటల్‌లో చేరాడు.

బావిలో పడి రైతు మృతి



వెంకటరెడ్డి మృతదేహం

ఏల్చూరు (సంతమాగులూరు), ఆగస్టు 18 : మండలంలోని ఏల్చూరు గ్రామానికి చెందిన చల్లా వెంకటరెడ్డి (37) అనే రైతు ఆదివారం పొలం వద్ద ఉన్న బావిలో కాలుజారి పడి మృతి చెందారు. సంతమాగులూరు ఏఎస్‌ఐ రావినూతల నాగేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం ఏల్చూరు గ్రామానికి చెం దిన వెంకటరెడ్డి ఆదివారం ఉదయం పొలం పనులకు వెళ్లారు. అక్కడున్న నేలబావిలో నీటి కోసం దిగి కాలుజారి పడిపోయినట్లు తెలిపారు. ఈతగాళ్లతో మృతదేహన్ని బయటకు తీసినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వెంకటరెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

స్వర్ణ(పర్చూరు), ఆగస్టు 18 : కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ వెంకట్రావు తెలిపారు. అందిన సమాచారం మేరకు.. పేకాట శిబిరంపై దాడి చేసి జూదరులను అరెస్టు చేశామని, వారి నుంచి రూ.3490 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని ఎస్‌ఐ తెలిపారు.

ఎనిమిది దుకాణాలపై కేసులు

అద్దంకి, ఆగస్టు 18 : అద్దంకి పట్టణంలోని పలు దుకాణాలను జిల్లా తూనికల కొలతల అధికారి నాగేశ్వరరావు ఆదివారం తనిఖీలు చేసి 8 దుకాణాలపై కేసులు నమోదు చేశారు. ఒక బియ్యం దుకాణం, రెండు చికెన్ దుకాణాలలో తూకాలలో వ్యత్యాసం ఉండగా, మిగిలిన 5 చికెన్ దుకాణాలలో కాటాలకు ముద్రలు లేనట్లు గుర్తించి కేసులు నమోదు చేశారు.

పురుగు మందుల షాపులో చోరీ

- రూ.96వేల అపహరణ

- ఎగ్జాస్ట్ ఫ్యాన్ రంధ్రం ద్వారా దూరిన దొంగలు

పర్చూరు, ఆగస్టు 18 : పర్చూరులో పురుగు మందుల దుకాణంలో చోరీ జరిగిన ఘటనపై ఆదివారం బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పర్చూరు - చీరాల ఆర్‌అండ్‌బీ రోడ్డులోని పురుగు మందుల దుకాణంలో శనివారం రాత్రి ఎగ్జాస్ట్ ఫ్యాన్‌ను తొలగించి, రంధ్రం తొలిచి దొంగలు షాపులోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. దుకాణంలో ఉన్న రూ.96వేల నగదును దొంగిలించారు. ఈ చోరీ దృశ్యాలు సీసీ కెమెరా ఫుటేజీలో నమోదయ్యాయి. ఆదివారం ఉదయం షాపు యజమాని తలుపులు తీసి లోకిని వెళ్లడంతో ఎదురుగా ఉన్న గోడకి రంధ్రం ఉండడంతో ఆందోళనకు గురయ్యారు. వెంటనే గల్లాపెట్టెని పరిశీలించగా, నగదు కనిపించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు దుకాణాన్ని పరిశీలించారు. ఏఎస్‌ఐ సురేష్ రెడ్డి బాపట్ల క్లూస్ టీం సిబ్బందికి సమాచారం అందించారు. ఆ బృందం చోరీ జరిగిన ప్రాంతంలో ఆధారాలను సేకరించారు. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.



ఈ రంధ్రం ద్వారానే దుకాణంలోకి వెళ్లిన దొంగలు



భూమిపూజలో పాల్గొన్న గ్రామస్థులు

దేవరగుడి నిర్మాణానికి భూమిపూజ

పంగులూరు, ఆగస్టు 18 : పంగులూరులో చిలుకూరి వంశస్తుల దేవర గుడి నూతన నిర్మాణానికి ఆదివారం భూమి పూజ జరిగింది. తెనాలికి చెందిన ప్రముఖ వేద పండితులు వేముల శ్రీహరి, త్రినాథ్ నేతృత్వంలో ఆలయ నిర్మాణానికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కోటి రూపాయల అంచనాతో నిర్మించ తలపెట్టిన ఈ ఆలయానికి ప్రవాసాంధ్రుడు కొణకంచి రాము 10 సెంట్ల స్థలాన్ని, చిలుకూరి పెద్దబ్బాయి 5 సెంట్ల స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. ఆదివారం జరిగిన హోమాలు, ప్రత్యేక పూజల్లో చిలుకూరి వంశస్తులు వీరరాఘవయ్య, మేడ సుబ్బారావు, ప్రసాదనాయుడు, రామాంజనేయులు, కోటయ్య, మల్లవరం సర్పంచ్ వీరయ్య, చిలుకూరి రామారావు, హరికృష్ణ, చైతన్యతో పాటు పలువురు దంపతులు పాల్గొన్నారు. పంగులూరు, మల్లవరం, నక్కలపాలెం, ఏబీ పాలెం, చిలుకూరివారిపాలెం గ్రామాలకు చెందిన చిలుకూరి వంశస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు



సామూహిక పూజల్లో పాల్గొన్న భక్తులు

అద్దంకి, ఆగస్టు 18 : తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని శంఖవరప్పాడు(రెడ్డిపాలెం)లో లక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో వరలక్ష్మి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. లక్ష్మీ తిరుపతమ్మ దేవాలయం నిర్వాహకులు జిలుగు రోశిరెడ్డి, నాగ శ్రీనివాసరెడ్డి, వెంకటలక్ష్మి భక్తులకు అవసరమైన పూజా సామగ్రిని గ్రి సమకూర్చారు. మాదాల దానయ్య రావినూతల రామకృష్ణ, పుట్టా వీరాంజనేయులు, పెద్దిశెట్టి వెంకటాద్రి పాల్గొన్నారు. 100 మంది భక్తులు వ్రతాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

145 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పంగులూరు, ఆగస్టు 18 : కంటి విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని శంకర్ కంటి వైద్యశాల నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ బిపిన్, డాక్టర్ ఉష అన్నారు. మండలంలోని ముప్పవరం గ్రామంలో శంకర్ కంటి వైద్యశాల సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు వారు ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎస్‌ఐ బి.వినోద్‌బాబు ప్రారంభించారు. సుమారు 145 మందికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి, 90 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరంగా గుర్తించారు. వీరందరికీ కాకాణి శంకర్ కంటి వైద్యశాలలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తారని రోటరీ హెల్త్ క్యాంప్ ఇన్‌చార్జిలు వీరరాఘవయ్య, కరణం హనుమంతరావు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠ

వీరన్నపాలెం (పర్చూరు), ఆగస్టు 18 : పర్చూరు మండల పరిధిలోని వీరన్నపాలెం గ్రామంలో దాతల సహకారంతో రూపుదిద్దుకున్న శ్రీ కుష్ణుని ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం అనతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.



వీరన్నపాలెం చెరువు కట్టపై నిర్మించిన శ్రీకృష్ణాలయం

గ్రామాల్లో అటకెక్కిన పారిశుధ్యం

» విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

» స్థానికుల్లో ఆందోళన



బల్లికురవ తహసీల్దార్ కార్యాలయం ముందు నిలిచిన మురుగు నీరు



ముక్తేశ్వరంలో వృద్ధురాలికి వైద్యం చేస్తున్న ఆర్‌ఎంపీ

అద్దంకి, ఆగస్టు 18 : సీజనల్ వ్యాధులు విజృంభించాయి. గ్రామాలలో మురుగు నీరు ఎక్కడికక్కడే నిలిచి ఉండడంతోపాటు పారిశుధ్య పనులు నిర్వహణ పై క్షే త్ర స్థాయిలో దృష్టి పెట్టకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా ఇళ్ల నుంచి వచ్చే మురుగు పారుదలకు అవకాశం లేక ఎక్కడిక్కడే నిలిచి పోవడం, రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో ఆయా ప్రాంతాలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. దీనికితోడు వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రజలు జ్వరాలబారిన పడుతున్నారు. స్తోమత లేని కుటుంబాలు స్థానికంగా ఆర్‌ఎంపీలవద్ద వైద్యం చేయించుకుంటున్నారు. మరి కొందరు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి వేలకు వేలు ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో చేరుతున్న వారి సంఖ్య తక్కువ గానే ఉన్నప్పటికి ప్రవేట్ వైద్యశాలలో చేరుతున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉన్నారు. ప్రధానంగా ప్రస్తుతం వస్తున్న జ్వరాలలో అధిక భాగం టైఫాయిడ్, వైరల్ జ్వరాలు ఉన్నాయి. వైద్య శాఖ సిబ్బంది కూడా ముందస్తు చర్యలు చేపట్టకుండా జ్వర పీడితులు ఎక్కువ మంది అయిన తరువాత మొక్కుబడిగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. అప్పటికే ఆయా గ్రామాలలో ప్రవేట్ వైద్యశాలలో చేరిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాలలో పారిశుధ్యం పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి మురుగు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, అదే సమయంలో వైద్య శాఖ అధికారులు ముందస్తుగానే ఆయా గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించి పరీక్షలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు

» జ్వరాలున్న చోట వైద్య శిబిరాలు నిర్వహించండి

» అధికారులను ఆదేశించిన మంత్రి గొట్టిపాటి

అద్దంకి, ఆగస్టు 18 : నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలని, వైద్య శిబిరాలు నిర్వహించాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా వైద్యశాఖ అధికారులతో ఆదివారం ఫోన్‌లో ఆదేశించారు. గ్రామాలలో దోమలవ్యాప్తి ఎక్కువగా ఉండి డెంగ్యూ టైఫాయిడ్ తదితర జ్వరాల బారిన పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గొట్టిపాటి అన్నారు. విష జ్వరాలబారిన పడిన ప్రజలు ప్రైవేటు వైద్యశాలకు వెళ్లలేక ఆర్‌ఎంపీల వద్దే వైద్యం చేయించుకుంటున్నారన్నారు. గ్రామాలలో ప్రతి రోజూ విధిగా పారిశుధ్య పనులు, ఫాగింగ్ చేపట్టాలన్నారు. విషజ్వరాలకు సంబంధించిన మందులు అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేం ద్రాలలో ఉండేలా ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య శిబిరాలను ఏర్పా టు చేయడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి జ్వరాలతో బాధపడుతున్న వారి వివరాలను సేకరించేలా చర్యలు చేపట్టాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు.

కొమ్మాలపాడులో కంపుకంపు

» కాలువల్లో పేరుకుపోయిన పూడిక

» రోడ్లపై పారుతున్న మురుగు నీరు

» కంపుతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

కొమ్మాలపాడు (సంతమాగులూరు), ఆగస్టు 18 : మండలంలోని కొమ్మాలపాడు గ్రామంలో మురుగునీరు వీధుల్లో పారుతోంది. కొంత కాలంగా సైడు కాలువలో పూడిక తీయకపోవడంతో మురుగునీరు వీధుల్లోకి వచ్చి కంపుకొడుతోందని గ్రామస్థులు అంటున్నారు. గ్రామంలో బల్లికురవ రోడ్డు, మొయిన్‌రోడ్డు, పెద్ద మనుషుల రోడ్డు, ప్రధాన వీధుల్లోని కాలువల్లో పూడిక తీయించాలని డిమాండ్ చేస్తున్నారు. వాహనాలు వెళ్లే సమయంలో మురుగు నీరు నడిచివెళ్లేవారిపై పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగునీరు బయటకు పోకపోవడంతో దోమల తీవ్రత ఎక్కువైందని, ప్రజలు జ్వరాలబారిన పడుతున్నారని తెలిపారు. వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.



రోడ్డుపై నిలిచి ఉన్న మురుగు నీరు

అద్దంకి ఎస్‌ఐ వీఆర్‌కు

» తీవ్ర అవినీతి ఆరోపణలు

» మంత్రికి ఫిర్యాదు చేసిన పలు గ్రామాల ప్రజలు

అద్దంకి, ఆగస్టు 18 : అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న నాగరాజును వీఆర్‌కు పిలిచారు. ఎన్నికల ముందు అద్దంకి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన నాగరాజు ఎస్‌హెచ్‌వోగా ఉన్న అధికారిని సైతం తప్పు దారి పట్టించే విధంగా వ్యవహరిస్తూ ఎన్నికల సమయంలో రెండు పార్టీల నాయకుల ద్వారా డబ్బులు దండుకున్నారన్న విమర్శలు ఉన్నా యి. ఎన్నికల పూర్తయి టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కూడా పాత పద్ధతినే కొనసాగిస్తూ పలు కేసులలో వైసీపీ వర్గీయుల వద్ద డబ్బులు తీసుకుంటూ టీడీపీ వర్గీయుల కేసులను నీరుగార్చే విధంగా వ్యవహరించినట్లు పలు గ్రామాల ప్రజలు మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా చినకొత్తపల్లిలో టీడీపీ వర్గీయులు బాధితులుగా ఉన్నప్పటికీ వైసీపీ వర్గీయులతో మిలాఖత్ అయి కేసును పక్కదారి పట్టించినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయాలు మొత్తం నిర్ధారణ చేసుకున్న తరువాత మంత్రి గొట్టిపాటి ఈ నెల 16వ తేదీన అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన సమయంలో పలు గ్రామాల ప్రజలు ఎస్‌ఐ తీరుపై ఫిర్యాదు చేశారు. అక్కడే ఉన్న ఎస్‌ఐ నాగరాజుతో మంత్రి రవికుమార్ ఒకింత కటువు గానే చెప్పినట్లు తెలుస్తుంది. ఇంకా పద్ధతి మార్చుకొని ఉద్యోగం చేయకపోతే కష్టం అని కూడా కష్టం అని చెప్పినట్లు సమచారం. ఈ విషయాలు జిల్లా పోలీస్ అధికారుల దృష్టికి కూడా పోవడంతో శుక్రవారం వీఆర్‌కు పిలిచారు. ఎస్‌ఐ నాగరాజును వీఆర్‌కు పిలిచిన విషయాన్ని ఎస్‌హెచ్‌వోగా ఉన్న సీఐ కృష్ణయ్య నిర్ధారించారు. ఇప్పటికే సీఐ కృష్ణయ్య ఆరోగ్య రీత్యా సెలవులో ఉండగా మహిళా ఎస్‌ఐ రత్నకుమారి బదిలీపై వెళ్లారు. నాగరాజును వీఆర్‌కు పిలవడంతో అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ప్రస్తుతం సిబ్బంది మాత్రమే మిగిలారు. ఇప్పటికే మహిళా ఎస్‌ఐగా ప్రవీణను నియమించగా, మరో ఎస్‌ఐని కూడా త్వరలో నియమించనున్నట్లు తెలుస్తుంది. ఇద్దరు ఎస్‌ఐలు త్వరలో బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలుస్తుంది.

గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి




గ్రామ అధ్యక్షులకు నియామకపత్రాలను అందజేస్తున్న విజయ్‌కుమార్

చినగంజాం, ఆగస్టు 18 : జనసేన పార్టీ నాయకులు, సైనికులు, వీరమహిళలను సమన్వయం చేసుకుంటూ గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి విజయ్‌కుమార్ అన్నారు. పల్లెపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దపల్లెపాలెం, బాపయ్యనగర్ గ్రామాలకు జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులను ఆదివారం ఆయన నియమించారు. పెద్దపల్లెపాలెం, బాపయ్యనగర్ గ్రామాలకు చెందిన రాసాని గోపి, దండప్రోలు అంజయ్యను గ్రామ పార్టీ అధ్యక్షులుగా ఎంపికచేసి నియామక పత్రాలను అందజేశారు. రాష్ట్ర పార్టీ ఆదేశాలను పాటిస్తూ గ్రామ స్థాయిలో పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సందు శ్రీనివాసరావు, ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి తుమ్మలపెంట సతీష్, నాయకులు వెంకట్, తోట ఆశోకచక్రవర్తి, వాసుదేవరావు, నేవా, వాసు, ఆయా గ్రామాల జనసైనికులు పాల్గొన్నారు.

ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి


3



శ్రీ పొట్టి శ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
సోమవారం, 19 ఆగస్టు 2024

గేట్లు ఎత్తేవారేరి..?

● సంగం, నెల్లూరు బ్యారేజీల నిర్వహణ గాలికి



నెల్లూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : రూ.వందల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన నెల్లూరు, సంగం బ్యారేజీలను నిర్వహించేందుకు సిబ్బంది లేరు. ఇప్పటికిప్పుడు పెన్నాకు భారీ వరద వస్తే ఈ బ్యారేజీల వద్ద గేట్లు ఎత్తేవారు కూడా లేరు. గత టీడీపీ ప్రభుత్వంలో 90 శాతం పూర్తయిన ఈ రెండు బ్యారేజీల పనులను మిగిలిన పదిశాతం పూర్తి చేసేందుకు మూడేళ్ల సమయం తీసుకుంది. అయినా కొన్ని పనులు పెండింగ్ పెట్టి మరీ ఆర్భాటంగా రెండు బ్యారేజీలను నాటి సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. రెండు బ్యారేజీలు ప్రారంభమై రెండేళ్లు గడిచినా ఇంత వరకూ నిర్వహణకు మ్యాన్‌పవర్‌ను ప్రభుత్వం మంజూరు చేయలేదు. అదృష్టవశాత్తూ పెన్నాకు గడిచిన రెండేళ్లలో భారీ వరదలు రాలేదు కాబట్టి సరిపోయింది. ఒకవేళ వరదలు వచ్చి ఉంటే పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. సుమారు రూ.500 కోట్లతో నిర్మించిన నెల్లూరు, సంగం బ్యారేజీలను నెలకు రూ.10 లక్షలతో నిర్వహణ చేయలేక నిర్వీర్యం చేస్తున్నారు. సంగం బ్యారేజీలో 88 గేట్లు, నెల్లూరు బ్యారేజీలో 57 గేట్లు ఉన్నాయి. వీటిని ఆపరేట్ చేయాలంటే శిక్షణ పొందిన టెక్నికల్ సిబ్బంది అవసరం. ఆఖరుకు గతంలో ఉన్న లస్కర్లను కూడా వైసీపీ ప్రభుత్వం తొలగించడంతో ఇప్పుడు ఈ రెండు బ్యారేజీల వద్ద ఒక్కరు కూడా రెగ్యులర్ సిబ్బంది లేరు. ఒకరిద్దరికి అనధికారికంగా ఇరిగేషన్ అధికారులే జీతాలు ఇస్తూ ఈ బ్యారేజీల వద్ద కాపలా ఉంచారు. సంగం బ్యారేజీ నిర్వహణకు 28 మంది, నెల్లూరు బ్యారేజీ నిర్వహణకు 20 మంది అవసరమని ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి పలు మార్లు ప్రతిపాదనలు పంపారు. కానీ అనుమతులు మాత్రం రాలేదు. టెక్నికల్, నాన్ టెక్నికల్ సిబ్బంది లేకుండా ప్రాజెక్టులను ఎలా ఆపరేట్ చేయాలని ఇరిగేషన్ అధికారులు ప్రశ్నిస్తున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు అయినా ఈ సమస్యను పట్టించుకోవాలని అటు అధికారులు, ఇటు రైతులు కోరుతున్నారు.



సంగం బ్యారేజీ

నేడు సోమశిలకు సీఎం రాక

సోమవారం (నేడు) సీఎం చంద్రబాబు నాయుడు సోమశిల పర్యటన ఖరారు కావడంతో జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్‌లు ఆదివారం సోమశిలను సందర్శించారు. సీఎం రాక ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. హెలిప్యాడ్ కోసం అగ్రికల్చర్ కళాశాల, ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాల ప్రాంగణాలను పరిశీలించారు. గోనుపల్లి వద్ద మరో ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. సీఎం మధ్యాహ్నం 3:05గంటలకు గంటలకు సోమశిలకు చేరుకోనున్నారు. ఆగిన అప్రాన్, హైలెవల్ కాలువ పనులు, క్రస్టుగేట్ల వ్యవస్థను 4:45గంటల వరకు పరిశీలిస్తారు. అనంతరం గ్రామస్థులతో ముఖాముఖి నిర్వహించి ఇరిగేషన్ అధికారులతో సమీక్షిస్తారు. సాయంత్రం 5:45గంటలకు తిరుగు ప్రయాణమవుతారు.



సోమశిలలో హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్

పాలక మహాశయా.. పట్టించుకోవయ్యా!

జిల్లా వరప్రదాయిని సోమశిల జలాశయం పలు సమస్యలతో సతమతమవుతోంది. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఈ పరిస్థితి దాపురించింది. సాగునీటి రంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న సీఎం చంద్రబాబు సోమవారం సోమశిలకు రానున్న నేపథ్యంలో ఈ సమస్యలపై ఆయన దృష్టి సారించాలని జిల్లా రైతులు కోరుతున్నారు.

పరిష్కారం కాని 'సమస్యలెన్నో?

- సోమశిలపై గత ప్రభుత్వం నిర్లక్ష్యం
- అభివృద్ధి పనులకు పైసా విదిల్చని వైనం
- ప్రాజెక్టు మనుగడ ప్రశ్నార్థకం

అనంతసాగరం, ఆగస్టు 18: సోమశిలకు 2021,22 సంవత్సరాల్లో వరుసగా ఎగువ నుంచి భారీ వరద చేరింది. ఆ ప్రవాహాన్ని దిగువకు వదలడంతో జలాశయం ముందు డౌన్‌స్ట్రీమ్, అప్రాన్, పొర్లుకట్టలు, రక్షణ గోడలు, సోమేశ్వర ఆలయం పూర్తిగా ధ్వంసమయ్యాయి. వాటి అభివృద్ధిని అత్యవసరంగా చేయాల్సి ఉండగా, గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. అప్రాన్ పనులకు రూ. 99.11 కోట్లు మంజూరు చేయాల్సి ఉండగా, నిధులు విడుదల చేయని కారణంగా పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు పత్తాలేకుండా పోయారు.

● ఆగిన హైలెవల్ కెనాల్ పనులు

ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో సాగునీటి సమస్యను పరిష్కరించేలా రూపొందించిన ఆనం సంజీవ్‌రెడ్డి హైలెవల్ కెనాల్ పనులు కునారిల్లుతున్నాయి. 2013లో ఈ పనులకు అంకురార్పణ జరిగింది. ఈ పనులు పూర్తయి ఉంటే మెట్ట గ్రామాల్లో తాగునీటి అవసరాలు తీరడంతోపాటు రైతుల జీవనోపాధి మెరుగుపడేది. గత వైసీపీ పాలనలో మొదటి ఫేస్ పనులు పూర్తి చేయకుండా రెండవ ఫేస్ పనులకు శ్రీకారం చుట్టారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు నీటి అవసరాలు తీరక అల్లాడుతున్నారు.

● ప్రమాదకరంగా క్రస్టుగేట్లు

సోమశిల ప్రాజెక్టు క్రస్టుగేట్లు అధ్వానంగా ఉన్నాయి. మొత్తం 12 క్రస్టుగేట్లు ఉండగా 11వ నెంబరు గేటు రోప్ తుప్పుపట్టి తెగిపోయేలా ఉంది. 12వ గేట్ పరిస్థితి కూడా అలాగే ఉన్నట్లు తెలుస్తోంది. ఇక గత వరదల సమయంలో 3,5 నెంబర్ల క్రస్టుగేట్లు మొరాయించాయి. గత ఐదేళ్ల పాలనలో గేట్ల రోప్‌లకు గ్రీజు కూడా పూయలేదు. వాటి మెయింటెనెన్స్‌కు నిధులు విడుదల చేయలేదు. ఈక్రమంలో రాబోయే వర్షాకాలంలో ప్రాజెక్టు గేట్లతో ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ఇంజనీర్లు ఆందోళన చెందుతున్నారు.

బలహీనంగా పొర్లుకట్టలు

ప్రాజెక్టు పరిధిలో పొర్లుకట్టలు బలహీనంగా ఉన్నాయి. గత వరదల సమయంలో ఉత్తర, దక్షిణం వైపు ఉన్నా రివెట్‌మెంట్ నిర్మాణాలు దెబ్బ తిన్నాయి. వాటి స్థానంలో తాత్కాలిక పనులు చేసి చేతులు దులుపు కొన్నారు. అలాగే జలాశయం వద్ద సిబ్బంది కొరత వెంటాడుతుంది.



అధ్వానంగా సోమశిల ఉత్తర కాలువ

క్రస్ట్‌గేట్లకు ఉన్న పాతరోప్

కాలువల అభివృద్ధి శూన్యం

ప్రాజెక్టు పరిధిలోని నాన్‌డెల్టా ఉత్తర, దక్షిణ కాలువ మనుగడ అధ్వానంగా ఉంది. కాలువకు డబ్లింగ్ పనులకు డిజైన్ చేశారు. ఉత్తర కాలువను 750 క్యూసెక్కుల నుంచి 1500 క్యూసెక్కులకు పెంచి కొంత మేరకు పనులు చేసి వదిలేశారు. చేసిన పనులకు గత ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. దీంతో ఏటా రెండవ పంట సమయంలో జరగాల్సిన పనులకు బ్రేక్ పడింది. కాలువల అభివృద్ధి లేక చివరి ఆయకట్టుకు నీరు సరఫరా కాని పరిస్థితి. తెలుగుగంగ వరద కాలువ నీటి ప్రవాహ సామర్థ్యం 11,500 క్యూసెక్కులు కాగా, కండలేరుకు నీటి సరఫరా సమయం ఆలస్యమతోంది. ఈకాలువ రెట్టింపు సామర్థ్యం పనులు కూడా పూర్తి చేయలేదు.

ట్రాఫిక్ ఎస్‌ఐ X టీడీపీ మహిళా నేత

- ఆటో డ్రైవర్ డ్రంకన్ డ్రైవ్ విషయంపై వివాదం
- ఇద్దరి మధ్య ఘర్షణ, పరస్పర దాడి
- జీజీహెచ్‌లో ట్రాఫిక్ ఎస్‌ఐ, 'నారాయణ'లో రేవతికి చికిత్స

నెల్లూరు,(క్రైం),ఆగస్టు18: ట్రాఫిక్ ఎస్‌ఐకి, టీడీపీ మహిళా నేతకు మధ్య జరిగిన వివాదం తారస్థాయికి చేరుకొని, ఒకరిఒకరు దాడి చేసుకున్నారు. స్థానికుల కథనం మేరకు, నగరంలోని రంగనాయకులస్వామి ఆలయానికి వందమీటర్ల దూరంలోఆదివారం సాయంత్రం ఏడు గంటల సమయంలో ఓ ఆటోను నిలిపి వేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గమనించిన ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్ ఆటో వద్దకు వెళ్లి చూడగా, ఎవరూ లేరు. ఆ సమయంలో ఆటోడ్రైవర్ వచ్చి ఆటోను తీసేస్తాను సార్ .. అంటూ చెప్పాడు. అయితే ఆటోడ్రైవర్ నుంచి మద్యం వాసన రావడంతో వెంటనే ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్ విషయాన్ని ట్రాఫిక్ ఎస్‌ఐ గీతారమ్యాకు తెలియజేశాడు. దీంతో ఆమె అక్కడికి చేరుకొని ఆటోడ్రైవర్‌తో డ్రంకన్‌డ్రైవ్ టెస్ట్ చేయించారు. అనంతరం ఆటోను స్టేషన్‌కు తరలిస్తుండగా, డ్రైవర్ అడ్డుకున్నాడు. అనంతరం ఆటో డ్రైవర్ సంతపేటకి చెందిన టీడీపీ కార్యకర్తలకు, నాయకులకు ఫోన్ చేశాడు. దీంతో ఆ ప్రాంతానికి టీడీపీ కార్యకర్తలతోపాటు నాయకురాలు రేవతి చేరుకున్నారు. వారు వచ్చాక అక్కడ ఏమి జరిగిందో ఏమో తెలియదు కానీ, ట్రాఫిక్ ఎస్‌కి, రేవతికి మధ్య ఘర్షణ జరిగింది.ఈ ఘర్షణలో ఇద్దరూ గాయపడ్డారు. అనంతరం ట్రాఫిక్ ఎస్‌ఐ గీతారమ్యా జీజీహెచ్‌కి, రేవతి నారాయణ ఆసుపత్రికి చికిత్స కోసం వెళ్లారు. ఈ ఘర్షణపై పరస్పర ఆరోపణలు చేసుకున్నారు.

● కోటంరెడ్డి పరామర్శ

గాయపడిన టీడీపీ మహిళా నేత రేవతి నారాయణ వైద్యశాలలో చికిత్స పొందుతుండగా, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి ఆదివారం రాత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడి విషయమై పూర్తి స్థాయిలో విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మస్తాన్, అంచూరి శ్రీనివాసులునాయుడు, ఇక్బాల్, తదితరులు పాల్గొన్నారు.



రేవతిని పరామర్శిస్తున్న కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి



చేతికైన గాయాన్ని చూపుతున్న ఎస్‌ఐ గీతా రమ్య

కల్పవృక్షంపై వెంకయ్యస్వామి

వైభవంగా ఆరాధనోత్సవాల ప్రారంభం



కల్పవృక్ష వాహనంపై విహరిస్తున్న వెంకయ్య స్వామి

వెంకటాచలం, ఆగస్టు 18: మండలంలోని గొలగమూడి వెంకయ్యస్వామి 42వ ఆరాధనోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేకువన సుప్రభాతసేవ, అభిషేకం, స్వామివారిపూజ, హారతి, ప్రసాద వినియోగం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తికి అభిషేకం, దత్త సంప్రదాయ షోడపచార పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారి సమాధి మందిరాన్ని పూలతో అత్యంత సుందరంగా అలంకరించారు. అనంతరం ఉదయం 10 గంటలకు గొలగమూడి గ్రామస్థుల ఆధ్వర్యంలో సర్వభూపాల వాహన సేవ నిర్వహించారు. గ్రామోత్సవం ముందు భక్తుల కోలాటాలు, పండరి భజనలు సాగాయి. ఆరాధనోత్సవాల్లో మొదటిరోజు కావడంతో ఉభయకర్తల తోపాటు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గ్రామస్థులు భక్తులకు అన్నదానం చేశారు. ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం కార్యక్రమాలను పర్యవేక్షించారు.

● కల్పవృక్షవాహనంపై వెంకయ్యస్వామి

ఆదివారం రాత్రి వెంకయ్యస్వామి కల్పవృక్ష వాహనంపై కొలువుతీరి భక్తులకు దర్శనమిచ్చారు. గొలగమూడి గ్రామస్థులు ఉభయకర్తలుగా వ్యవహరించిన ఈ సేవకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రంగురంగుల విదుద్దీపాలతో అలంకరించిన వాహనంపై ఊరేగుతున్న వెంకయ్య స్వామివారిని చూసి తమ జన్మధన్యమైనట్లు భక్తులు పులకించి పోయారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కాగా ఆరాధనోత్సవాల్లో రెండోరోజైన సోమవారం ఉదయం 10 గంటలకు వెంకయ్య స్వామికి సూర్యప్రభ వాహనసేవ, రాత్రికి చంద్రప్రభ వాహన సేవ నిర్వహించనున్నారు.

ప్రేమానురాగాలకు ప్రతిరూపం

సోదర సోదరీ ప్రేమకు నిదర్శనం

దేశ సంస్కృతికి తార్కాణం

నేడు రాఖీ పౌర్ణమి

నెల్లూరు (విద్య), ఆగస్టు 18: సోదర ప్రేమకు ప్రతిరూపంగా నిలిచే రక్షాబంధన్ సంప్రదాయమైన విలువలను మరింత ఉట్టిపడేలా చేస్తుంది. ఉన్మాదం, విచక్షణారహితం వంటి వెకిలి చేష్టలు పేట్రేగిపోయి, మానవతా విలువలు మంటగలుస్తున్న నేటి ఆధునిక యుగంలో రాఖీ పౌర్ణమి తన విశిష్టతను చాటుతూ సోదర ప్రేమ పటిష్టతకు దోహదపడుతుంది. శ్రావణ పౌర్ణమి లేదా రాఖీ పూర్ణిమ రోజున అక్కాచెల్లెళ్లు తమ అన్నదమ్ముల నుదుటన తిలకం దిద్ది, చేతికి రాఖీ కట్టి మిఠాయిలు తినిపిస్తారు. సోదరులు కూడా తమ శక్తి కొద్దీ కానుకలు ఇస్తారు. సోదరులు దూరప్రాంతాల్లో ఉంటే రాఖీలను పోస్టులోనూ కొరియర్‌లోనూ పంపుతారు. గతంలో రాఖీ పండుగను హిందువులు, సిక్కులు మాత్రమే జరుపుకునేవారు. సోదరీమణులు కూడా తమ సొంత అన్నదమ్ములకు మాత్రమే రాఖీ కట్టేవారు. కానీ ఈ సంప్రదాయం ఇప్పుడు దేశంలో అన్ని మతాలకు విస్తరించింది. అలాగే సొంతవారికే కాకుండా తమ ఇష్టాన్ని బట్టి అన్నదమ్ముల వరసయ్యే వారికి కూడా రాఖీ కడుతున్నారు. ఆగస్టు 19 (నేడు) రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక కథనం.

● అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక

భారతీయ సంస్కృతికి నిదర్శనంగా కుటుంబ బాంధవ్యాలలోని మాధుర్యానికి చిహ్నంగా ఈ పండుగను జరుపుకుంటారు. మనకు అనేక పండుగలు ఉన్నాయి. శ్రావణమాసంలో నోములు, వ్రతాలు, పూజలతో ప్రతి ఇల్లూ కళకళలాడుతుంది.ఈ మాసంలో ప్రతితిథికి ఒక ప్రత్యేకత ఉంది. సోదరీ, సోదరులకు విశేషమైన రోజుగా గుర్తించబడింది రక్షాబంధనం. రక్ష కట్టించుకుంటే అరిష్టాలను పోగొడుతుందని, ప్రతి సోదరుడు తన సోదరికి రక్షగా ఉండాలన్న ఉద్దేశంతోనే ఈ పండుగ జరుపుకుంటార ని చరిత్ర చెబుతోంది.

● రాఖీ కట్టే సమయం

శ్రావణ పౌర్ణమి రోజున మధ్యాహ్న సమయంలో రాఖీ కట్టాలని శాస్త్రాలు చెబుతున్నాయి. ఆ తర్వాత నీరు తీపిచేయడం సంప్రదాయం. మనం చేసే ప్రతి పనికీ కర్మసాక్షి ఆ సూర్యభగవానుడు. మధ్యాహ్నవేళ సూర్యకిరణాల తాకిడి ఎక్కువగా ఉంటుంది. అంతటి తేజస్సు రాఖీలో ఇమిడి ఉంటుందని, ఆ సమయంలోనే రాఖీని కట్టించుకోవాలని శాస్త్రం చెబుతుంది. ఇదిలా ఉండగా పెళ్లి అయిన ఆడపడుచులు తమ పుట్టింటికి వెళ్లి సోదరులకు రాఖీలను కట్టడం ఆనవాయితీగా వస్తున్నది.



నెల్లూరులో రాఖీలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

పురాణాల్లో, చరిత్రలోనూ రక్ష

రక్షాబంధనమనేది కేవలం అన్నాచెల్లెల్లు, అక్కాతమ్ముళ్లు కట్టుకునేది కాదు. రక్షాబంధనం ద్వారా రక్ష కల్పించాలనే ప్రతిజ్ఞ, ఆత్మీయులకు భరోసా కల్పించడం కోసమని శాస్త్రం చెబుతోంది. పూర్వం రాజవంశీకులకు ఇబ్బందులు, ప్రమాదాలు కలుగుతాయనే కారణంగా వాటి నుంచి రక్షణ పొందడానికి కట్టుకునే ఆనవాయితీ నుంచి ఈ రక్షాబంధనం వచ్చినట్లు చరిత్ర కథనం. గతంలో భర్తకి రక్షణ కోసం భార్య రాఖీ కట్టేది. దేవదానవ యుద్ధంలో ఇంద్రుడికి విజయం కలగాలని శచీదేవి రక్ష కడుతుంది. చరిత్రలో పురుషోత్తముడితో తలపడడానికి సిద్ధంగా ఉన్న అలెగ్జాండర్ భార్య రుక్సానా బేగం పురుషోత్తముడి ఆశ్రయం కోరుతుంది. అతడికి సోదరి లేదన్న విషయం తెలుసుకుని శ్రావణ పౌర్ణమి రోజున రాఖీ కడుతుంది. అందుకు బహుమతిగా తన భర్త ప్రాణాలను కాపాడమని కోరుతుంది. తన చేతికి ఉన్న రక్ష కారణంగా అలెగ్జాండర్‌ను చంపకుండా వదిలేస్తాడు పురుషోత్తముడు. అంతటి విశిష్టత కలిగిన రాఖీ పండుగను నేటి యుగంలో కూడా మహిళలు వైభవంగా జరుపుకుంటున్నారు.



ఎక్కడున్నా రాఖీ రోజు కలుస్తాం

- కుంచాల తబిత, ధనలక్ష్మీపురం

రాఖీ పండుగంటే నాకు చాలా ఇష్టం. ఆ రోజు మా అన్న వినయ్‌కి రాఖీ కట్టాలని ఎంతో ఆశగా ఎదురుచూస్తుంటా. నేను చదువుల కోసం బయట ఉన్నాను. మా అన్న కూడా ఉద్యోగం చేస్తూ బయట ప్రాంతాల్లో ఉన్నాడు. కానీ రాఖీ పౌర్ణమి రోజు ఎంత ముఖ్యమైన పనులున్నా సరే ఇంటికి వచ్చేస్తాం. ఇప్పటి వరకు రాఖీకట్టకుండా ఒక్కసారి కూడా లేను. చిన్ననాటి నుంచి ఎంతో అన్యోన్యంగా కలిసి పెరిగాం. ఏ సమస్య వచ్చినా ఒకరికొకరం చెప్పుకుని పరిష్కరించుకునే వాళ్లం. రాఖీ మా బంధాన్ని మరింత బలోపేతం చేసింది.



కష్టసుఖాలను పంచుకుంటాం..

అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని నిత్యం గుర్తుకు తెచ్చుకుంటాం. కష్టమైనా, సుఖమైనా నేను, నా సోదరి ఇద్దరం కలిసి పంచుకుంటాం. మా అమ్మ విజయలక్ష్మి మృతి చెందాక ఒకరినొకరం ఓదార్చుకున్నాం. పెళ్లిళ్ల అయి వేర్వేరుగా జీవిస్తున్నప్పటికీ అదే వాత్సల్యాన్ని కొనసాగిస్తున్నాం. ప్రతి రక్షాబంధన్ రోజున కలుసుకుంటాం. ఒకరికొకరు రక్ష కట్టుకుంటాం.

- దేవిరెడ్డి సువర్చన్‌రెడ్డి, శ్రీతులసి,కోవూరు



సోదరి ప్రోత్సాహంతో ఉన్నతిస్థితికి..

ఓసీలకు ఉద్యోగాలు రావని మా నాన్న నన్ను ఇంటర్‌లో చదువు మాన్పించి బెంగళూరులో ఉన్న బంధువుల వద్దకు కాంట్రాక్ట్ పనుల కోసం పంపాడు. అప్పటికే వివాహమైన మా అక్క వెంకటరమణ ఈ విషయం తెలుసుకుని నా తమ్ముడ్ని నేను ఇంజనీర్‌గా చూడాలని.. మా నాన్నతో గొడవపడి నన్ను ఇంటికి పిలిపించింది. సోదరి ప్రోద్బలంతో ఎంటెక్ పూర్తి చేశా. నేడు ఉన్నత ఉద్యోగంలో స్థిరపడ్డా. రక్షాబంధన్ వచ్చిందంటే సోదరి తప్పక వచ్చి నాకు రాఖీ కడుతుంది. ఈ సారి పోస్టులో రాఖీ పంపింది.

-కే రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వరపురం, సంగం



రాఖీ కోసం ఎదురు చూస్తున్నా

- మౌనిక, గౌతమ్

నా తరువాత తమ్ముడు గౌతమ్ పుట్టాడు. చిన్నతనం నుంచే వాడి అల్లరి, చిలిపితనం భరిస్తూనే అమ్మ తరువాత అక్కగా ప్రేమను పంచా. చిన్నతనం నుంచే రాఖీ పండుగ వచ్చిందంటే దాచుకున్న డబ్బుతో రాఖీ కొని తమ్ముడికి కట్టేదాన్ని. పెళ్ళై తొమ్మిది సంవత్సరాలు అవుతున్నా రాఖీ పండుగ కోసం ఏటా ఎదురు చూస్తుండేదాన్ని. ఉన్నత చదువులకు చెన్నైకి వెళ్లినా తమ్ముడికి పోస్టు ద్వారా రాఖీ పంపిన సందర్భాలు ఉన్నాయి. ఉద్యోగ రీత్యా తమ్ముడుగౌతమ్ ప్రస్తుతం బెంగళూరులో ఉంటున్నాడు. ఈ సంవత్సరం కొరియర్ ద్వారా రాఖీ పంపా.

బకాయిలు చెల్లించరూ!

- పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్లకు ఏడాదిగా అందని జీతాలు
- కూటమి ప్రభుత్వంలో చెల్లిస్తారని ఎదురుచూపు


సీతారామపురం: బస్టాండ్ సెంటర్‌లో చెత్తను సేకరిస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

సీతారామపురం, ఆగస్టు 18: స్వచ్ఛ భారత్ కింద గ్రామ పంచాయతీల ఆర్థిక ఆదాయాన్ని పెంచేందుకు 2014లో టీడీపీ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చెత్త నుంచి సంపదను తయారీ చేసేందుకు కేంద్రాలు నిర్మించింది. అందులో భాగంగా అధికారులు మండలంలో 14చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలకు చెత్తను తరలించేందుకు 40మంది గ్రీన్ అంబాసిడర్లను నియమించారు. వీరికి గ్రామ పంచాయతీ నుంచి ఒక్కొక్క రికి నెలకు రూ.6వేలు అందించేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రీన్ అంబాసిడర్స్‌కు ఏడాదిగా నుంచి జీతాలు అందించలేదు. వీరు జీతం కోసం ఎదురు చూస్తున్నారు. గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులను కూడా అప్పటి ప్రభుత్వం వెనక్కి తీసుకోవడంతో పంచాయతీ మనుగడ ప్రశ్నార్థకంగా సాగింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం చెత్త నుండి సంపద సృష్టించడంపై ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇటీవల సర్పంచులు, కార్యదర్శు ల శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రభుత్వం ఆశించిన ఫలాలు పొందాలంటే క్షేత్రస్థాయిలో పని చేయాల్సిన గ్రీన్ అంబాసిడర్లకు కూటమి ప్రభుత్వం బకాయి జీతాలపై చెల్లించేందుకు దృష్టి సాధిస్తే బాగుంటుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కుటుంబ పోషణ భారమైంది...

గత 9ఏళ్ల నుంచి సీతారామపురం పంచాయతీలో గ్రీన్ అంబాసిడర్‌గా పనిచేస్తున్నా. గత ప్రభుత్వంలో సమయానికి వేతనాలు చెల్లించక పోవడంతో కుటుంబ పోషణ భారంగా సాగింది. అయినా పనులు చేశాం. సంపద కేంద్రాలను వైసీపీ ప్రభుత్వం పర్యవేక్షణ చేయక, నిధులు మంజూరు చేయకపోవడంతో అవి పూర్తిగా నిర్వీర్యం అయ్యాయి. అధికా రంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పెండింగ్ బకాయిలను విడుదల చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.



\- కలివెల ప్రభాకర్, గ్రీన్ అంబాసిడర్

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు


గంగిరెడ్డిపల్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి


ఉదయగిరి రూరల్, ఆగస్టు 18: ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అల్లర్లు సృష్టించేందుకు యత్నిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. ఆదివారం గంగిరెడ్డిపల్లి, గానుగపెంటపలి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ స్నేహపూర్వకంగా మెలిగి ప్రశాంతత వాతావరణం నెలకొల్పేందుకు కృషి చేయాలన్నారు. అపరిచిత వ్యక్తుల సంచారంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్న సమస్యలు వస్తే వివాదాలకు దిగి ఘర్షణలు చేసుకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ఎలాంటి సంఘటనలు చోటుచేసుకున్న పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట


ఎస్ఎంసీ చైర్మన్‌ను సన్మానిస్తున్న చెంచలబాబు యాదవ్

ఉదయగిరి రూరల్, ఆగస్టు 18: కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెట్టపీట వేస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ తెలిపారు. ఆదివారం స్థానిక చెంచురామయ్య అతిథిగృహంలో నూతనంగా ఎంపికైన పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లు భాస్కర్‌రెడ్డి, బాలఅంకయ్య, మధుయాదవ్, కాలేషాలను సన్మానించి అభినందించారు. గత ప్రభుత్వంలో గాడి తప్పిన విద్యావ్యవస్థను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి విద్యాభివృద్ధికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వం విద్యా పథకాలకు మహనీయుల పేర్లు పెట్టడం అభినందనీయమన్నారు. నూతనంగా ఎంపికైన ఎస్ఎంసీ చైర్మన్లు పాఠశాలల అభివృద్ధికి చర్యలు చేపట్టడంతో పాటు విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న, నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, రమణారెడ్డి, రమణయ్య, అంబటి మస్తాన్, బాలకృష్ణ పాల్గొన్నారు.

బుద్ధుడి అష్టాంగ మార్గమే మానవ జీవితానికి ఆదర్శం


కరపత్రాలు చూపుతున్న ధ్యానులు

వింజమూరు, ఆగస్టు 18 : బుద్ధుడు చెప్పిన అష్టంగా యోగమార్గమే మానవ జీవితానికి ఆదర్శనీయం అని దీన్ని ఆచరిస్తే ఎల్లప్పుడూ సుఖసంతోషాలతో ఆరోగ్యంగా జీవిస్తూ మోక్షానికి అర్హులవుతారని ఒంగోలు సీనియర్ పిరమిడ్ మాస్టర్ నన్నూరి వాసంతి తెలిపారు. శ్రీవేద వ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం జరిగిన సజ్జన సాంగత్యంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ధ్యానం గురించి ఉదాహరణలతో సందేశమిచ్చారు. శాకాహారం ప్రాముఖ్యతను వివరిస్తూ పిరమిడ్‌నగర్, వైశ్య బజార్, కుమ్మరి బజారు, ఎర్రబెల్లిపాలెం ప్రధాన రహదారుల్లో మహాకరుణ శాకాహార ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, తిరుపతిరావు, జానకీరామిరెడ్డి, సుబ్బారెడ్డి, చిన్న, వెంకటరెడ్డి, హేమలత, సుప్రజ, సీత, కౌసల్య, శాంతమ్మ, రేణుక, స్వరాజ్యం, కృష్ణవేణి, 70 మంది ధ్యానులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ


క్రేన్ సహాయంతో ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేసిన భక్తులు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 18: కృష్ణంపల్లిలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్ర ఆలయంలో భక్తులు ఆదివారం విగ్రహాలు, ధ్వజస్తంభం, శిఖర కలశ ప్రతిష్ఠాపన కార్యక్ర మాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సం దర్భంగా వేదపండితులు హోమాలు, తదితర ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి కల్యాణంను శాస్త్రోక్తంగా చేపట్టారు. ధ్వజ స్తంభాన్ని క్రేన్ సహాయంతో ఏర్పాటు చేసేటపుడు గ్రామ స్థులతో పాటు బంధువులు, సమీ ప గ్రామాల ప్రజలు తరలిరావడంతో ఆలయం వద్ద సందడి నెలకొంది. ఈ సందర్భంగా కొందరు స్వామివారికి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్నదాన, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కలువాయి: వెదనపర్తి కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం గ్రామస్థులు స్వామి వారి నూతన విగ్రహం, శిఖర కలశ ప్రతిష్ఠను చేపట్టారు. ఈ సందర్భంగా మ హాకుంభాభిషేకం నిర్వహించా రు. వేడుకలో వెంకటగిరి ఎమ్మె ల్యే కురుగొండ్ల రామకృష్ణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచు దనియాల చంద్రయ్య నాయుడులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను సన్మానిస్తున్న నాయకులు

నిర్వహణ నిధులు కేటాయించక..

- తుప్పుపట్టి నిరుపయోగంగా మారిన జనరేటర్
- పట్టించుకోని అధికారులు
- ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయంలో దుస్థితి


ఆరుబయట ఉన్న తహసీల్దారు కార్యాలయంలోని జనరేటర్

ఉదయగిరి రూరల్, ఆగస్టు 18: మండల తహసీల్దారు కార్యాలయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ఉండేందుకు పదేళ్ల క్రితం పాలకులు జిల్లాలోని అన్ని మండలాలకు జనరేటర్లు కేటాయించారు. వాటి నిర్వహణకు ప్రత్యేక బడ్జెట్ కల్పించక పోవడంతో అధికారులు వాటిని ర్వహణను గాలికొదిలేశారు. దీంతో రూ.లక్షలు వె చ్చించి సమకూర్చిన యంత్రాలు, సామగ్రి అలంకారప్రాయంగా దర్శనం ఇస్తున్నాయి.

నీరుగారిన లక్ష్యం: అప్పట్లో విద్యుత్ కోతలు అధికంగా ఉండడంతో పాటు తుపాన్ల సమయంలో వీచే గాలులకు రహదారుల వెంట చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరగడం వంటి ఘటనలు చోటుచేసుకొని విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. ఈ క్రమంలో కీలకమైన సమాచార వ్యవస్థ దెబ్బతినడంతో పాటు అధికారులు, ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఇలాంటి కష్టాలను అధిగమించేందుకు 2010లో అప్పటి ప్రభుత్వ హయాంలో జిల్లా వ్యాప్తంగా అన్ని తహసీల్దారు, ఆర్డీవో కార్యాలయాలకు జనరేటర్లు కేటాయించారు. అప్పట్లో ఒక్కో జనరేటర్ ఏర్పాటుకు రూ.40వేల వరకు ఖర్చు చేశారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో వాటి ఏర్పాటు లక్ష్యం నీరుగారిపోయింది.

ఖర్చు అధికారులు భరించాలి: జనరేటర్లు కేటాయించినా వాటి వినియోగానికి అయ్యే డీజిల్ కొనుగోలుకు నిధులు కేటాయించలేదు. ఆ ఖర్చు ఎవరు భరించాలన్న విషయమై స్పష్టత లేకపోవడంతో సమస్యగా మారింది. కొన్ని ప్రాంతాల్లో కొన్ని నెలలపాటు డీలర్లు, ఇతరుల సహాయంతో నడిపినా తరువాత వదిలేశారు. చాలాచోట్ల వాటిని ఒక్కసారి వినియోగించిన దాఖలాల్లేవు. కనీసం వాటికి రక్షణ కూడా లేకపోవడంతో ఎండకు, వానకు తడుస్తూ తప్పుపట్టి నిరుపయోగంగా మారాయి. ఇవి వినియోగంలోకి తెస్తే మామూలు రోజుల్లో విద్యుత్ అంతరాయాలు తలెత్తినా ఇబ్బందులు ఉండవని పలువురు కోరుతున్నారు.

శిధిలావస్థలో సొసైటీ భవనాలు

వరికుంటపాడు, ఆగస్టు 18: స్థానిక సొసైటీ కార్యాలయ భవనాలు శిధిలావస్థతకు చేరుకోవడంతో ఎప్పుడు కూలిపోతాయో అని రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా కార్యాలయ గదికి ఆనుకొని ఉన్న ఎరువుల నిల్వ గదుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఆ గదుల శ్లాబులు పెచ్చులూడి పడుతుండటంతో పాటు గోడలు సైతం నెర్రలుబారి కూలే దశకు చేరుకున్నాయి. కనీసం తలుపులు, కిటికీలు సక్రమంగా లేకపోవడంతో ప్రభుత్వం ఎరువులను సరఫరా చేస్తే భద్రపరచడం సిబ్బందికి తలకు మించిన భారంగా మారుతుంది. చిన్నపాటి వర్షం కురిసినా విలువైన ఎరువులు తడిచి ముద్దవుతాయని అధికారులు వాపోతున్నారు. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లు అన్నచందంగా కాకుండా భవిష్యత్తు దృష్ట్యా ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గదులకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.


సొసైటీ భవనం దుస్థితి ఇలా..

పారిశుధ్యలోపంతో రోగాలు

- ఆత్మకూరు పట్టణంలోని ఇళ్ల మధ్యలో 700లకు పైగా ఖాళీ స్థలాలు
- వాటిపై పర్యవేక్షణ లేక ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, కంపచెట్లు
- దోమలకు, విషపురుగులకు ఆవాసాలుగా మారిన వైనం

ఆత్మకూరు, ఆగస్టు 18: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని జెఆర్‌పేట, ఎల్ఆర్‌పల్లి, ఆర్టీసీ డిపో సమీపంలోని ప్రాంతాల్లో జనావాసాల మధ్య ఖాళీ స్థలాల్లో పారిశుధ్యం కొరవడి ప్రజలు రోగాల బారిన పడేందుకు ఆస్కారం ఎక్కువగా ఉంది. ఈ స్థలాలను కొన్న యజమానుల వాటిని పర్యవేక్షించక పోవడంతో డంపింగ్ యార్డులుగా దర్శనమిస్తున్నాయి. దానికితోడు పరిసర ప్రాంత ఇళ్లలో వాడిన నీరంతా ఈ స్థలాల్లో నిలిచి మురుగుకుపాలుగా దర్శనం ఇస్తున్నాయి. అందులో పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలు ఏపుగా పెరుగుతున్నాయి. స్థానికులు ఈ స్థలాల్లో కొబ్బరిబొండాలు, విరిగిపోయిన ప్లాస్టిక్ సామగ్రి, పాత టైర్లు ఇలా పనికిరాని చెత్తంతా తీసుకొచ్చి అందులో వేస్తున్నారు. వర్షం పడితే వాటిలో నీళ్ల చేరి ప్రమాదకర డెంగీ, మలేరియా జ్వరాలకు కారణమయ్యే దోమలు పెరుగుతున్నాయి.


పట్టణంలోని జేఆర్‌పేటలోని ఖాళీస్థలం దుస్థితి

ఖాళీ స్థలాలు 700 పైనే..

మున్సిపాలిటీ పరిధిలో 23వార్డులు ఉంటే ఖాళీస్థలాలు మాత్రం 700లకు పైగా ఉన్నాయి. అందులో అధికారికంగా 192స్థలాలను గుర్తించారు. గుర్తింపు లేని ఖాళీస్థలాలు మరో 520కిపైగా ఉన్నాయి. ఈ స్థలాలను చదును చేయించి పిచ్చిమొక్కలు మొలవకుండా, మురుగునీరు నిల్వ ఉండకుండా, చెత్త వ్యర్థాలు ఖాళీస్థలాల్లో పడేయకుండా ఉంచాలని కోర్టు ఆదేశించింది. అలా చేయని ఖాళీస్థలాల యజమానులకు రూ.1000లు జరిమానా విధించాలని ఉత్తర్వులను మున్సిపల్ అధికారులకు జారీ చేసింది. ఈ ఆదేశాలు ఎక్కడ అమలుకావడం లేదు. శాశ్వత ప్రాతిపదికన చర్యలు ఉండడం లేదు. ప్రజల అనారోగ్యాలకు ముప్పువాటిల్లడానికి కారణమైన ఖాళీ జాగాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల మున్సిపాలిటీ పరిధిలో రూ.22 లక్షలతో మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపడుతున్నారు. కానీ జనావాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలాల శుభ్రతను అటు స్థలం కొన్న యజమానులు లేదా మున్సిపల్ అధికారులు పట్టించుకోక పోవడం వల్లే ఈ దుస్థితి నెలకొందని పట్టణవాసులు వాపోతున్నారు.

నేడు ఉపాధి హామీ ప్రజావేదిక

కలిగిరి, ఆగస్టు 18: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటలకు ఎన్ఆర్ఈజీఎస్ 2023-24 సంవత్సరానికి సంబంధించి ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రంగసుబ్బరాయుడు తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచులు, ఉపాధికూలీలు హాజరుకావాలని కోరారు.

సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు ముందంజ

- కావలి ఆర్యవైశ్య నూతన కమిటీ ప్రమాణ స్వీకారం


ఆర్యవైశ్య అధ్యక్షుడిని అభినందిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

కావలి, ఆగస్టు 18: సేవా కార్యక్రమాలు చేపట్టడంలో ఆర్యవైశ్యులు అందరికంటే ముందజలో ఉంటారని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. వాణిజ్యపరంగా కావలిని అభివృద్ధి చేసిన ఘనత ఆర్యవైశ్యులదే అని కొనియాడారు. ఆర్యవైశ్య సంఘం కావలి మండల నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం స్థానిక బృందావనం హౌసింగ్ కాలనీ కల్యాణమండపంలో జరిగింది. సంఘం అధ్యక్షుడిగా తటవర్తి రమేష్ కార్యదర్శిగా ఓరుగంటి రామకృష్ణ కోశాధికారిగా కంచర్ల చక్రితో పాటు నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అమర్తలూరి చెంచయ్య వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డీవీ క్రిష్ణారెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో అనేక సత్రాల నిర్మాణంలో వీరిది కీలక పాత్ర అన్నారు. కావలిలో టీడీపీ విజయం కోసం ఆర్యవైశ్యులు ఎంతో కృషిచేశారని వారికి ఎల్లప్పుడు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కావలిలో ఆనాటి చక్కా సత్యం.. నిన్నటి గ్రంధి యానాదిశెట్టి.. నేటి పోతుగంటి అలేఖ్య వరకు అందరూ రాజకీయాలకు వన్నె తెచ్చారని గుర్తుచేశారు. కావలిలో ఆర్యవైశ్య భవనం ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఆర్యవైశ్యులలో పేదవారి వివాహాలకు ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. అనంతరం కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్ర అభివృద్ధి నిర్వీర్యం అయ్యిందన్నారు. టీడీపీతోనే అభివృద్ధి జరుగుతోందనే నమ్మకంతో ప్రజలు తిరుగులేని మెజార్టీ ఇచ్చారని చెప్పారు.

రాజకీయాలకతీతంగా సేవలందిస్తా: తటవర్తి రమేష్

ఎమ్మెల్యే సహకారంతో రాజకీయాలకతీతంగా ఆర్యవైశ్యులకు సేవలందిస్తానని నూతనంగా ఎన్నికైన సంఘ అధ్యక్షుడు తటవరి రమేష్ తెలిపారు. అంతకుముందు నూతన కార్యవర్గం వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు చేశారు. అలాగే పొట్టి శ్రీరాములు విగ్రహం, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ర్యాలీగా ప్రమాణస్వీకార వేదిక వద్దకు చేరుకున్నారు. కావలి మున్సిపల్ మాజీ చైర్మన్ పోతుగంటి అలేఖ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త కనమర్లపూడి కోటేశ్వరరావు వామ్ గ్లోబల్ అధ్యక్షుడు తంగుటూరి రామక్రిష్ణ , వామ్ తెలంగాణా ఇన్‌చార్జి ఎస్. గురుప్రసాద్, బీజేపీ రాష్ట్ర సంయుక్త కోశాధికారి కందుకూరి వెంకటసత్యనారాయణ, కొండబిట్రగుంట దేవస్థాన మాజీ చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి, ఆర్యవైశ్యమహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ, మహిళావిభాగ్ ఇన్‌చార్జి కొప్పవరపు రజినీ, పందా వెంకటేశ్వర్లు, కొట్టు సత్యనారాయణ, సంఘం నెల్లూరు నగర అధ్యక్షుడు కొండా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

లింగసముద్రం, ఆగస్టు 18: మండలంలోని వీఆర్ కోట గ్రామ సమీపంలోని మన్నేరు వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం రావడంతో ఆదివారం ఉదయం ఎస్సై ఎం బాజీబాబు, సిబ్బంది దాడి చేసి రెండు ట్రాక్టర్లను గ్రామ శివారులో పట్టుకున్నారు. ట్రాక్టర్లను, డ్రైవర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

తెలుగును పాలనా భాషగా అమలు చేయాలి

అల్లూరు, ఆగస్టు 18 : తెలుగును పాలనాభాషగా అమలు చేయాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ సమన్వయ కమిటీ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పాలనా కార్యక్రమాలన్నీ తెలుగులోనే నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రాథమిక విద్యను కనీసం 30శాతం కూడా తెలుగులో అమలు చేయకుంటే అది మృతభాషగా ఎలా మారుతుందని యునెస్కో హెచ్చరించిందన్నారు. రచయితలు, కళాకారులు మేధావులు నిరంతరం తెలుగు భాషకు వన్నె తెచ్చేలా కృషి చేయాలన్నారు. భాష పరిరక్షణకు తెలుగు అధికార భాషా సంఘం చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు అయ్యప్పస్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం

కందుకూరు, ఆగస్టు 18: శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయ ంలో సోమవారం సాయంత్రం 6 గంటలకు సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే భక్తులు పసుపు కుంకుమ, పూజ సామాగ్రి తెచ్చుకోవాలని తెలిపారు. వ్రతం అనంతరం తీర్థప్రసాదాలు అందజేయటం జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి పూజలో పాల్గొనాలని విజ్ఞప్తిచేశారు.

నిందితులకు ఉరిశిక్ష వేయాలి

కందుకూరు, ఆగస్టు 18: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసిన వారికి ఉరిశిక్ష వేయాలని మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు వర్ల దేవదాస్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశంలో అత్యాచారాలు అరికట్టాలంటే మానవ మృగాలకు ఉరిశిక్షలు విధించటమే సరైనదని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

సాగరంలో కుక్కల బెడద

అనంతసాగరం, ఆగస్టు 18: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో గుంపులు గుంపులుగా సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. చికెన్ వ్యాపారాలు చేసే నిర్వాహకులు కోళ్ల వ్యర్థాలను సోమశిల రోడ్డులో వేస్తున్నారు. వాటిని రుచి మరిగిన కుక్కలు మేకలు, గొర్రెలపై అవి దాడి చేస్తున్నాయి. అప్పుడప్పుడు జనాలపైకి వస్తున్నట్లు ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

వరికుంటపాడు, ఆగస్టు 18: మండలంలోని ఇస్కపల్లి-వరికుంటపాడు, ఇస్కపల్లి-విరువూరు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి కూడలి సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదాలకు నిలయంగా మారింది. రహదారికి ఆనుకొని అతి తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మన్‌ను చూసిన ప్రజలు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. దీనితో ఎప్పుడు.. ఎవరికి ప్రమాదం జరుగుతుందో అని వాపోతున్నారు.

ఈ మార్గంలో ప్రతినిత్యం తిరిగే వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా ఇక అంతేసంగతులు అంటున్నారు. పశువులు, మూగజీవాలు మేతకోసం అటుగా వెళ్లిన సమయంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశాలున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే చర్యలు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతర పోరాటం

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న మాదాల వెంకటేశ్వర్లు

కావలి టౌన్, ఆగస్టు 18: కేంద్రం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందని, అందుకు వ్యతిరేకంగా నిరంతర పోరాటాలు చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన పార్టీ రాజకీయ శిక్షణా తరగతుల్లో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. కేంద్రం తీసుకొచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా సీపీఎం పెద్దఎత్తున ఉద్యమించిందని, సీపీఎం కార్యకర్తలు సమాజం కోసం పనిచేయాలని పార్టీ పటిష్టతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మతోన్మాదంతో దేశానికి ముప్పు వాటిల్లుతుందని చెప్పారు. అలాగే లౌకికవాదం, ప్రజాస్వామ్యం సన్నగిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేసారు. కేంద్ర పాలకులు దేశభక్తి ముసుగులో రాజ్యాంగాన్ని తూట్లు పొడుస్తున్నారని ప్రధాని మోదీ మాటల గారడీతో పాలన సాగిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి పెంచులయ్య, రామచంద్రయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

కలిగిరి, ఆగస్టు 18: వర్షాకా లంలో వచ్చే సీజనల్ వ్యాధుల పై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కలిగిరి పీహెచ్‌సీ వైద్యులు బిజ్జం గీతారెడ్డి తెలిపా రు. పడమర గుడ్లదొన ఎస్సీకాల నీలో జ్వర లక్షణాలు బాధపడు తున్న వారికి ఆదివారం ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించి మాట్లా డారు. గత బుధవారం జ్వర లక్ష ణాలున్న రోగులను పరీక్షించగా డెంగ్యూ, మలేరియా జ్వరాలు నమోదు కాలేదన్నారు. ప్రస్తుతం జ్వర లక్షణాలతో బాధపడేవారు వైద్యులు సూచించే సూచనలు పాటించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరాలు తగ్గుముఖం పట్టేంతవరకు వైద్యశిబిర సేవలను వినియోగించుకోవాలన్నారు.

ఇంటింటికీ కొళాయి కనెక్షన్ సర్వే

కావలి ఆగస్టు 18: జలజీవన్‌మిషన్‌లో భాగంగా పట్టణంలోని ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్ ఇచ్చి శుద్ధి చేసిన మంచినీటిని ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలోని కాలనీల్లో 1 నుంచి 28 సచివాలయాలలో పనిచేస్తున్న మౌలిక వసతుల కార్యదర్శులు ప్రతి గృహాన్ని సందర్శిస్తారని పేర్కొన్నారు. మంచినీటి కొళాయి స్థితి, వ్యత్యాస విశ్లేషణను పరిశీలించి వెబ్ అప్లికేషన్‌లో వివరాలను నమోదు చేస్తారన్నారు. ఈ సర్వే ఈ నెల 16 నుంచి పట్టణంలో జరుగుతోందని కార్యదర్శులు మీ ఇంటికి వచ్చినపుడు కొళాయికి సంబంధించిన వివరాలను వారికి తెలియజేసి సహకరించాలని కోరారు.

సంజీప్‌కుమార్‌కు వాకర్స్ సన్మానం

బిట్రగుంట, ఆగస్టు 18: స్థానిక రైల్వే సెక్షన్ పరిధిలో రన్నింగ్ ట్యాఫ్ లోకోపైలెట్ ఎల్పీ సంజీప్‌కుమార్ బదిలీపై సొంత రాష్ట్రం బీహార్‌కు వెళ్లనున్న సంద ర్భంగా ఆయన్ను బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం సన్మానించారు. 12 ఏళ్లుగా బిట్రగుంటలో విధులు నిర్వహిస్తూ రైల్వే ఫుట్‌బాల్ మైదానం అభివృద్ధికి ఆయన చేసి సహకారం మరువలేనిదని వాకర్స్ సంఘం అధ్యక్షుడు ఎం.స్వర్ణన్‌రాజు అన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, ఫౌండర్ అధ్యక్షుడు శ్రీనివాసులు, సభ్యులు సత్యనారాయణ చార్యులు, జనార్ధన్, శ్రీనివాసులు, సుధాకర్, క్రిష్ణారెడ్డి, ఆర్ఆర్ మిత్రబృందం ఉన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని గేదె మృతి

నష్టపరిహారం చెల్లించాలని రైతు మొర

వలేటివారిపాలెం, ఆగస్టు 18 : కందుకూరు నుండి మొగిలిచెర్ల వెళ్తున్న ఆర్టీసీ బస్ శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో జాతీయ రహదారిపై వెళ్తున్న గేదెను ఢీకొంది. దీంతో సమాచారం తెలుసుకున్న రైతు రవీంద్రతో పాటు మరికొంతమంది రైతులు సంఘటనా స్థలానికి వెళ్లి గేదెను ఇంటికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తుండగా శనివారం రాత్రి మృత్యువాత పడింది. గేదె విలువ లక్ష రూపాయలకు పైగా ఉంటుందని, ఆర్టీసీ అధికారులు స్పందించి నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతు రవీంద్రతో పాటు గ్రామస్థులు కోరుతున్నారు.